భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

జూన్ 1974

సంపుటము : 51 : సంచిక : 6 :

విడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

జూన్ 1974

దండెంపై మడిబట్ట

శ్రీ తిరుమల రామచంద్ర

అదొక విశాల భవనం
దానిచుట్టూ ఉద్యానవనం.
ఎక్కడ చూచినా రంగురంగు చిత్రాలు
చిత్ర విచిత్రాలు
అటు ఇటు గండారంపు బొమ్మలు
దివినుంచి దిగవచ్చిన అమరుల కొమ్మలు
గండు కోయిలల కుహూకుహూరావాలు
నృత్య న్మత్త మయూర కేకా రావాలు.
ఎవరో అన్నట్లయింది 'ముందుకు వెళ్లు.'
జల్లు మన్నది నా ఒళ్లు.
ఒళ్లంతా కళ్లతో వేశాను ముందుకు అడుగు.
అనిపించింది తామరతంపరల మడుగు.

* * *

పెద్ద భవంతి పడసాల
దాని నడుమున హోమశాల.
నా ఆశల తీరున లేస్తున్నాయి ధూమాలు
ఆజ్య హవిస్సుగంధి శ్యామాలు.
అర్ధదగ్ధ సమిచ్ఛకలాలు
నాయికల కార్యారంభ సకలాలు.
వేదికచుట్టూ పడిన పువ్వులు
నా జీవిత వైఫల్యం పై వెకిలి నవ్వులు
పిడచగట్టి కనిపించే కుశలు
నా మలిన భావాలకు కర్శక కశలు.
అటు చూచాను, ఇటు చూచాను
దిక్కు తెలియని వానిలా ఎటో చూచాను.
ఒక మూల కనిపించాయి దండాలు
శిక్కరించే ఉత్త వేదండ తుండలు.

ఎప్పుడూ ఎక్కడా కలవని సమానాంతరరేఖలవలె
చాచికట్టిన కామినీ కమనీయ రత్నమేఖలవలె
కమ్మచ్చునలాగిన ఇనుపకడ్డీలవలె
ఊళ్ల హృదయాలు చీల్చుకొని వెళ్లే తారురోడ్లవలె
ఇంద్రజిత్తు వదలిన నాగపాశాలవలె
చాణూర ముష్టికుల జెట్టీకాసెలవలె
వేలమంది శ్రమను స్వాహాచేసి కుయ్యమనే కార్ఖానా గొట్టాలవలె
తుళ్లిపడే కృష్ణమ్మను కట్టివేసే ఆనకట్టలవలె
నిరంతరం తిరిగే నా కాళ్లవలె
చిగురు ఇగురులేని సరుగుడు మోళ్లవలె
కార్మిక కర్షకులు ఇతరుల సేవకై చాచే చేతులవలె
మెట్టిన దారిని గుడ్డిగా నడిచే అనాది జాతులవలె
ఎప్పటికీ జంటగా నడిచే పూర్వోత్తర భాద్రపదలవలె
ఆలనపాలన లేక ఊరువిడిచి దారిబట్టే అనదలవలె
పడగ విప్పనున్న పొగాకు పనలవలె
వెనక చూపులేని వెర్రివాని కనులవలె
కలిసి ఉందామనుకున్నా వేరుచేసే పొలంగట్లవలె
మొదలు ఒక్కటైనా కత్తులవలె దిక్కుదిక్కుకు వెళ్లే తాటిమట్లవలె
కన్నె రొమ్ము దూసుకొనివచ్చే కుచప్రరోహాలవలె
జీవి హృదయభేదకంగా నిపతించే యమభటు పాశాలవలె
కాదన్న వానిని కాలరాచే సర్కారు చట్టాలవలె
మార్పులేని సంఘం రైలు నడిచే ఇనుపపట్టాలవలె
ఉరి దుని కన్నీటి ధారలవలె
వానకారులో మహిషాలెత్తిన మోరలవలె.

* * *

వానినుంచి వ్రేలాడుతున్నవి తడిబట్టలు
వానినుంచి జీరాడుతున్నవి మడిబట్టలు
అరకొరగా ఆరినవి
గరగరగా మారినవి
తడిముద్దలు కొన్ని
పొడిపొడి అయినవి కొన్ని.
పళపళ మెరిసే పంచలు
కట్టుకొని నీళ్లుపోసుకొనే గావంచాలు
జరీ పేటులవి గోరంచులవి

దండెం పై మడిబట్ట

మురిపెపు మూడురంగుల మించులవి
ఖద్దరువి, పుర్సరైజాలవి
ముదురురంగుల రకరకాల సైజాలవి.

* * *

వానితో ఒకదానిపై పడింది నా చూపు
నా మనస్సును హరించింది దానిరూపు
మల్లెల మొల్లెల రంగుతో
నల్లని కాటుకంచు హోరంగుతో
చెదరని మడతల బిగువుతో
గాలికి కదిలే లగువుతో
కిందికి జీరాడే సేరుతో
పడుగు పేకల గట్టి తీరుతో
చూచినట్టయింది నన్ను
కట్టుకో మన్నట్టయింది తన్ను.

* *

చేయిముందుకు వెళ్లింది
మనసు వెనుకకు మళ్లింది.
'ఏమి ? న్యాయమా ఇది?
కాదు, భావ్యమా ఇది !
ఊహుఁ! ఎవరో పాపం ఆరవేసినది
ఎందుకోసమో మడుపు చేసినది
పూజకో పురస్కారానికో
రాగానికో భోగానికో
ఎదురు చూస్తున్నది పాపం !
ఎందుకు నాకీ తాపం !
నేను తాకడం ధర్మమా ?
నేను కట్టుకోడం ఉత్తమ కర్మమా ?
అని మనసు వితర్కించింది
కాని ఆశ కుతర్కించింది.
అందుకోడానికి అర్రులు చాచింది
పొందడానికి మొగం వాచింది.
'పాకుడు రాళ్లను తొలగించుకొని
పీకుడు ముళ్లను వదలించుకొని
నీళ్లలో విసిరి వెనక్కు గుంజుకొని

కాళ్లతో నొక్కిపట్టి కుప్పళించి గింజుకొని
కుచ్చెళ్లు పెట్టి ముచ్చటగా కట్టి
నిడుగాపట్టి బండ పై కొట్టి
గట్టిగా పిండినారు
గుట్టుగా ఆరవేసినారు
పాపం ఇతరుల మడిబట్టకదా మరి ?
కట్టుకోడం సరే, తాకడమైన తప్పకదా మరి !'
అని మరొకమారు మనసు హెచ్చరించింది
హృదయమేమో మచ్చరించింది.

*   *   *

దండెంనుంచిలాగి గట్టిగా పిడికిట పట్టుకొన్నాను
మడిచికొట్టి అదిమి పెట్టుకొన్నాను
అయినా మనసు ఒప్పలేదు
మరల విదిలించి దండం పై సర్దడం తప్పలేదు.
రెండుకొనలూ సవరించిలాగను
పై నుంచి కిందివరకు అరచేతులతో అదిమి తూగాను

*   *   *

ఇంతలో యజమాని కాబోలు వచ్చినాడు
తన మడిబట్ట నలిగి ఉండడం చూచి తచ్చాడినాడు
తాకి చూచాడు, తడిమి చూచాడు
పంచెను లాగి చూచాడు, అంచులు నిమిరి చూచాడు
నా ముఖంలో కానవచ్చిందేమో ప్రతారణ ఫక్కి
నా మాటలలో వినవచ్చిందేమో హుళక్కి
నా చేతలలో కనిపించిందేమో దౌర్మనస్యం
నా రీతులలో స్ఫురించిందేమో వంచన పర్జన్యం.
'తాకారా ఇది మీరు!' అన్నాడు
'ఎవరో సర్దినట్లున్నది' అనుకొన్నాడు.
గొణుగు కొన్నాడు
సణుగు కొన్నాడు
నేను చెప్పాను తాకలేదని ఖరారుగా
అంతరాత్మను అదిమిపెట్టాను జరూరుగా.

*   *   *

ఇంతలో మేలుకొన్నాను
కలయినా మంచి సంగతే అనుకున్నాను.

బసవపురాణము - స్థలనిర్దేశము

డా. తిమ్మావజ్ఝల కోదండరామయ్య

మహాపురుషులు జన్మించిన స్థలములు, నివసించిన నెలవులు, వర్తించిన భూములు, సిద్ధినందిన క్షేత్రములు వారి జీవితములందు ప్రాముఖ్యము వహించి, తరువాతి తరములవారికి తీర్థభూతములై విరాజిల్లుచున్నవి. వారు మత ప్రవర్తకులును, మతాచార్యులును కూడనగుచో తన్మతానుయాయులకు ఆయా స్థలములు పవిత్ర యాత్రాస్థలములై పుణ్యతీర్థములై పొలుచుననుట సత్యదూరము కాదు. క్రీ. శ 12 వ శతాబ్దమున కర్ణాటకదేశమునందు వీరశైవ మతోద్ధారకుఁడుగను, గొప్ప సంఘ సంస్కర్తగను పేర్వడసిన భండారి బసవేశ్వరుని మహనీయ జీవితమునకు సంబంధించిన కొన్ని స్థలములు పాల్కురికి సోమనాథుని బసవపురాణమునందు పేర్కొనఁబడినవి. బసవేశ్వరుని జీవితమును మొట్టమొదటిసారిగా లోకమునకు ఎఱుకపఱచిన కీర్తి సోమనాథుని బసవపురాణమునకు చెందవలసియున్నది. హరిహరుఁడను కవీశ్వరుఁడు కన్నడమునందు రచించిన 'శివశరణర రగళె' యను గ్రంథమునందలి 'బసవరాజదేవర రగళె' యను భాగమునందు కూడ బసవేశ్వరుని జీవితము అభివర్ణింపఁబడినది. క్రీ. శ 14 వ శతాబ్దమునకు చెందిన భీమకవి యను కన్నడ కవీశ్వరుఁడు సోమనాథుని బసవపురాణమును కన్నడీకరించెను. సింగిరాజ పురాణము మొదలగు మఱికొన్ని గ్రంథములు కూడ బసవేశ్వరుని జీవితము నభివర్ణించుచున్నవి. వీనియందన్నిటను బసవేశ్వరుని జీవితములోని ప్రధాన ఘట్టములతో ముడిపడిన పవిత్రస్థలములు కొన్ని ప్రస్తావ వశమున పేర్కొనఁబడినవి. వానిలో ముఖ్యమయినవి హింగుళేశ్వర భాగవాటి, కూడలి (కప్పడి) సంగమేశ్వరము, మంగళవాడ, కల్యాణము అనునవి. పయివాని స్థల నిర్దేశము కావించి బసవేశ్వరుని జీవితమునందు వానికిఁగల ప్రాధాన్యమును చారిత్రకవిషయ పురస్సరముగా వివరించుటయే యీ వ్యాసముయొక్క యుద్దేశము.

1. హింగుళేశ్వర భాగవాటి:

ఇది బసవేశ్వరుని జన్మస్థలము. బసవపురాణమునందు దీని ప్రస్తావమిట్లు కలదు.

'గురుతరం బైన శ్రీగిరి పశ్చిమమున
నరనుతం బగుచుఁ గర్ణాటదేశ మనఁ
గడు నొప్పు నందుఁ బ్రఖ్యాతసద్భక్తి
నడి సన్నహింగుళేశ్వర భాగవాటి
యను నగ్రహారంబునందు.........'

(బస ప్రథ. 28 పు.)

అర్జునవాడ శాసనము హరిహరుని బసవరాజదేవర రగళయు నీ జన్మస్థలము విషయమున నీ యభిప్రాయమునే వెల్లడించుచున్నది. బసవపురాణమునందు 'హింగుళేశ్వర భాగవాటి' యనునది యేకగ్రామ నామముగా పేర్కొనఁబడి యున్నను, నిజమున కవి పరస్పరము అత్యంత సమీపమున నున్న రెండు గ్రామములు. భాగవాటి యనునది నేఁడు 'బాగెవాడి' యను పేర వ్యవహరింపఁబడుచున్నది. ఇది నేఁటి బీజపూరు మండలమునందు మణిగవల్లి (మనగూళి). ముత్తగె యను ప్రదేశములకు నడుమనున్న ఒక తాలూకా కేంద్రము. బసవేశ్వరునితో నా స్థలమునకుఁ గల సంబంధమును బట్టి నేఁడది 'బసవన బాగెవాడి' యను పేర ప్రసిద్ధి చెందియున్నది. దీనికి ఇంచుమించుగా ఆఱుమైళ్ల దూరమున 'ఇంగళేశ్వరము' అను పేర ఒక ప్రదేశము కలదు. ఇదియే బసవపురాణమునందు పేర్కొనఁబడిన 'హింగుళేశ్వరము'. క్రీ. శ 12 వ శతాబ్దమున ఈ ఇంగళేశ్వరము దానికి సమీపమున నున్న బాగెవాడికంటెను ఎక్కువ ప్రాముఖ్యము వహించియుండెనని తెలియుచున్నది. నాఁటి ప్రజలకు

కూడ ఇంగళేశ్వరమే యెక్కువ బాగుగా తెలిసియుండుటకు అవకాశము కలదు. శైవమత మచట ప్రాబల్యము వహించుటకు మునుపు అది జైన మతమునకు పట్టుగొమ్మగా నుండెను. ఈ గ్రామమునందు వెలసిన జైనాచార్య పరంపరకు జైన పరిభాషలో 'ఇంగళేశ్వర బలి' యని పేరు. దీనికి తోడు జైన స్థలముల శిథిలములును, జైనాచార్యులకు సంబంధించిన శాసనములును పెక్కు ఇచట కానవచ్చును. ఈ గ్రామమునకు సమీపమునందే ఒక మైలు దూరమున ఒక పర్వత గుహలో సిద్ధాసనమున నున్న రేణుకాచార్యుని (రేవణసిద్ధ) విగ్రహ మొకటి కలదు. రేణుకాచార్యుడు బసవేశ్వరునికి పూర్వము శైవ మతమును ప్రచారము చేసిన శివాచార్యుడు. అందే కొంతదూరమున పార్శ్వనాథుడను జైనసిద్ధుని విగ్రహము కూడ కలదు. అగ్గళుడను జైనకవి (క్రీ. శ 1189) ఇంగళేశ్వరమునం దుండియే తన 'చంద్రప్రభ పురాణము' అను గ్రంథమును రచించెను. ఇంగళేశ్వరము ప్రాచీన కాలమున గొప్ప విద్యాకేంద్రముగా కూడ విరాజిల్లినట్లు తెలియుచున్నది. అది అయిదువందలమంది మహాజనులతో కూడిన ఒక బ్రాహ్మణాగ్రహారముగా నుండెను టకు శాసన సాక్ష్యము కలదు. అది జనమేజయ మహారాజుచే నిర్మింపబడినదని యైతిహ్యము. కాలక్రమమున దానికి దక్షిణ కాశియనియు కర్ణాటక కాశియనియు ప్రసిద్ధి యేర్పడెను. ఇట్లు ఇంగళేశ్వరము జైన స్థలముగా, శైవమతమునకు ఆలంబముగా, గొప్ప విద్యాకేంద్రముగా పుణ్యస్థలముగా ప్రాచీనకాలమునుండి ప్రసిద్ధివహించి యుండినట్లు తెలియును సాధారణముగా అంతగా ప్రసిద్ధివహింపని గ్రామమును దానికి సమీపమునందే యున్న యొక ప్రసిద్ధ గ్రామముతో జతచేర్చి పేర్కొనుట జరగుచుండును. ఈ వ్యవహారమునకు అనుగుణముగానే—అకాలమునందు అంతగా ప్రసిద్ధివహింపని 'బాగెవాడి'—అప్పటికే బాగుగా ప్రసిద్ధిచెందియుండిన 'ఇంగళేశ్వరము'తో జతపఱచి సోమనాథునిచే హింగుళేశ్వర భాగవాటిగా పేర్కొనబడి యుండును. తొలుగొలుతగా నీ స్థలమును పేర్కొనిన పాల్కుఱికి సోమనాథుడు దీనిని 'హింగుళేశ్వర భాగవాటి' యని పేర్కొనినను దీనిని కన్నడీకరించిన భీమకవి 'ఇంగళేశ్వర బాగెవాడి' యనియే పేర్కొనెను. దీనినిబట్టి 'బాగెవాడి'యే బసవేశ్వరుని జన్మస్థలమనియు ఇంగళేశ్వరమునకు అతని జన్మముతో ఎట్టి సంబంధమును లేదనియు రూఢి యగుచున్నది. కాని కాలక్రమమున ఆ గ్రామనామ మట్లేర్పడుటకుఁగల కారణము మఱుగుపడిపోగా బసవపురాణ ప్రవచనముల మూలమున నీ జన్మస్థలము 'హింగుళేశ్వర భాగవాటి' యను జంటపేరుతోనే జనులకు పరిచయమయి యుండుట సంభావ్యము. కాలక్రమమున జనులు ఈ రెండు స్థలములను కూడ బసవేశ్వరుని జన్మమునకు సంబంధించిన స్థలములుగా పేర్కొనుటకు ప్రారంభించిరి. తదనుగుణముగా కొన్ని కట్టుకథలు కూడ ప్రచారములోనికి వచ్చినవి. ఉదాహరణమునకు—ఇంగళేశ్వరమునందు నేడు ఒక పాడుపడిన బావి కలదు. దానికి 'హాలబావి' (పాలబావి) అని పేరు. గర్భవతి యయిన బసవేశ్వరుని తల్లి వేవిళ్ల కలిగినపుడు ఆ స్థలమునందే క్రక్కినదని అచటి జనులు ఆ బావిని చూపి పేర్కొందురు. రేణుకాచార్యుని గుహయున్న స్థలమునందే మఱి రెండు గుహలను బసవేశ్వరుని అగ్రసోదరియైన అక్కనాగమ్మ గుహగాను, అతని మేనల్లుడయిన చెన్నబసవేశ్వరుని గుహగాను పేర్కొందురు. దానికి అనతిదూరమునందే కల యొక ప్రదేశమును 'హోరియ మొరడి' యని పేర్కొందురు. 'హోరియ మొరడి' యనఁగా సూతికాగృహము. బసవేశ్వరుడందు జన్మించెనని చెప్పుదురు. కాని యివి యన్నియు తరువాతి కాలమున ప్రచారములోనికి వచ్చిన కట్టుకథలు. ఇట్లు ఇంగళేశ్వరము యథార్థమునకు అతని జన్మస్థలము కాకపోయినను బసవేశ్వరుడు తన చిన్నతనమునందు తన గ్రామమున కనతిదూరమున నున్న యీ ప్రసిద్ధగ్రామమునకు పెక్కు పర్యాయములు పోయియుండుట సంభావ్యము. అట్లు పోయిన సందర్భములందే జైనమతమును గూర్చియు, వారి యాచార వ్యవహారములను గూర్చియు అతఁడు ప్రత్యక్షముగాఁ జూచి తెలిసికొనియుండునని భావించుట తప్పు కాదు. అతని వచనములలో పదిఁబదిగా కానవచ్చు జైన మత ప్రస్తావనలే దానికి ప్రబల నిదర్శనము.

బాగెవాడియందు లభించిన శాసనములనుబట్టి క్రీ శ 12 వ శతాబ్దినాటికి అది యొక గొప్ప అగ్రహారముగా అభివృద్ధి చెందినట్లు తెలియుచున్నది. అందు

స్థిరనివాసము లేర్పఱుచుకొనిన వేదాధ్యయన సంపన్నులును, వివిధ శాస్త్రపారంగతులును అగు బ్రాహ్మణ వరేణ్యుల నిరంతర విద్యావ్యవసాయమును, రాజ పోషణమును దాని యభివృద్ధికి కారణములుగా పేర్కొనవచ్చును. ఆ యగ్రహారమునకు చెందిన అయిదువందలమంది మహాజనులు దాని పరిపాలనము నందును, అభివృద్ధియందును శ్రద్ధాసక్తులను కలిగి యుండిరి. రాజాధ్యక్ష రేవణయ్యానాయకుఁడు మొదలగు రాజోద్యోగులు దాని యభ్యుదయమునకై యెక్కువగా దోహదము గావించినట్లు తెలియుచున్నది. మల్లికార్జునస్వామి, చెన్నకేశవస్వామి, బకుళేశ్వర, బొంటేశ్వర, గరుడేశ్వరస్వాములు మొదలగు దైవతములపేర వెలసిన దేవాలయము లందు పెక్కు ఉండినట్లు శాసనములు తెలుపుచున్నవి. కాని వానిలో నొక్కదేవాలయము కూడ నేడందు కానరాదు. అవి యన్నియు కాలగర్భమునఁ గలసిపోయి యుండును. బాగెవాడియందు నేఁడు ప్రాచీనమయిన శివాలయమొకటి మాత్రము అతి శిథిలావస్థలో కానవచ్చును. అట్లే అందొక పాడుపడిపోయిన బావి కలదు. బసవేశ్వరుఁడు తన చిన్నతనమున పిల్లలతో కలసి ఆటలాడుకొను చుండఁగా ఒకబాలుఁడు ఆ బావియందు పడిపోయె ననియు, అపుడు బసవేశ్వరుఁడు ఆ బాలుని అందుండి లేవనెత్తి కాపాడెననియు నచటి జనులు ఒక యైతిహ్యమును చెప్పుదురు. బసవేశ్వరుడు జన్మించిన గృహము అని ఒక గృహమును అందలి జనులు చూపుదురు. బసవేశ్వరుని వంశీకులు ఇటీవలిదాఁక కూడ అందు నివసించు చుండెడివారఁట! బసవేశ్వరుని తండ్రియగు (మండెఁగ) మాదిరాజు ఆ యగ్రహారముయొక్క పరిపాలమును నిర్వహించు చుండిన మహాజనసభకు అధ్యక్షుడై యుండెను. ఇట్లు వైదికప్రవణ మయిన పరిసరములయందు బసవేశ్వరుని బాల్యము గడిచినది. కాని యతని మనసులో విప్లవబీజము లానాటికే బాగుగా నాటుకొనినవి. తత్ఫలితముగా నతఁడు తన తండ్రి యగు మాదరాజు తనకు చేయనెంచిన ఉపనయన సంస్కారమును తిరస్కరించి, బాగెవాడిని వదలి, కూడలి సంగమమునకు తరలిపోయినట్లు బసవపురాణము తెలుపుచున్నది. కాని కన్నడమునందలి 'బసవరాజ దేవర రగళె'లో నీ వృత్తాంతము భిన్నముగా చూపట్టును. బసవేశ్వరునికి ఎనిమిదేండ్ల ప్రాయమున అతని తండ్రి యతనికి యథావిధిగా ఉపనయన సంస్కారమును గావించెను. కాని యతని యుపనయనము జరిగిన కొన్ని దినములకు అతని తలిదండ్రు లిరువురును దివంగతులయిరి. అందుచే నతఁడు కొంత కాలము తన పితామహి పోషణలో నుండవలసివచ్చెను. వైదికాచారములును, నియమనిష్ఠలును, క్రతుకలాపములును అతనికి ప్రీతి గొలుపవయ్యెను. క్రమముగా అతని మనసు వాని వంక విముఖము కాఁదొడఁగెను. అందుచే నతఁడు తన పదునాఱవయేట తన 'జన్నివార'ను (యజ్ఞోపవీతము) పరిత్యజించి, బంధువర్గమును విడనాడి, యాత్మ దర్శనమునకై యన్వేషించుచు తన యాత్మోద్బోధము మేరకు 'కూడలి సంగమము'నకు తరలిపోయెను.

2. కూడలి సంగమము :

బసవపురాణమునందు బసవేశ్వరుఁడు కూడలి సంగమమునకు తరలిపోవుట యిట్లు ప్రస్తావింపఁబడినది.

'ఇల్లు కప్పుడి సంగమేశ్వరం బంద
తెల్లంబు మా గురుదేవుఁ డున్నాఁడు
చనియెద వారి శ్రీ చరణముల్ గొలువ'

(బస. ప్రథ. 53 పు.)

బసవేశ్వరుని యాధ్యాత్మిక జీవితమున కూడలి సంగమమునకు అత్యంతప్రాధాన్యము కలదు. అతఁడు ఆత్మోన్నతిని సాధించినది యీ క్షేత్రమునందే. ఇది నేఁడు బీజపూరు మండలమునందు హుంగుండు తాలూకాలో నున్న ఒక గ్రామము. పేరునుబట్టి అది యొక నదీ సంగమ స్థలముగా స్పష్టమగును. కృష్ణానదియు, దాని యుపనది యయిన మలప్రభయు నీ స్థలమున సంగమించుచున్నవి. అందుచేతనే దానికి సంగమ క్షేత్రమని పేరయ్యెను. 'కూడల' అనుపదమునకు కన్నడమున 'సంగమ' మనియే యర్థము. ఆ రెండు స్థలములును సంగమించు స్థలమున సంగమేశ్వరాలయము కలదు. దానికి అనతి దూరమునందే—ఒక ఫర్లాంగు దూరమున—కూడలి సంగమగ్రామ మున్నది. అచటి సంగమేశ్వరాలయ క్రీ. శ 11 వ శతాబ్ది ప్రాంతమునకు చెందినది. అందలి గర్భగృహమున నున్న

సంగమేశ్వర లింగమునందు శిరోభాగమున ఒకచిహ్నము కలదు. ఆ చిహ్నముకల స్థలమునుండియే బసవేశ్వరుఁడు తుదిని శివైక్యము నందెనని చెప్పుదురు. బసవేశ్వరుని కాలమున కూడలి సంగమము గొప్ప క్షేత్ర రాజమై, పవిత్ర యాత్రాస్థలమై యుండుట మాత్రమేకాక గొప్ప విద్యాకేంద్రముగా కూడ ఉండినట్లు అచట లభించిన శాసనములనుబట్టి తెలియుచున్నది. శాసనములం దదిది కూడల కప్పడి సంగమమని పేర్కొనఁబడినది. దీనినే విడిచి కూడల సంగమమనియు, కప్పడి సంగమమనియు ప్రజలు వ్యవహరించెడివారు. కూడల, సంగము పదములు సమానార్థకములయిన కన్నడ సంస్కృతపదములు. కప్పడియనునది 'కర్పటి' యను సంస్కృత పదమునుండి యేర్పడిన తద్భవ పదము. 'కర్పటి' అనగా కర్పటము—శిథిల వస్త్రము ధరించిన శివయోగి యని యర్థము. కప్పడి సంగమ మనగా కప్పడులు నివసించు సంగమక్షేత్రము అని యర్థము. ఈ క్షేత్రమునకు అతి ప్రాచీన కాలమునుండియు పెక్కురు శివయోగులు, భక్తులు యాత్రార్థము అరుదెంచుచుండెడివారనియు, అందే కొందఱు స్థిరనివాసములు కల్పించుకొని నివసించుచుండెడివారనియు దీనినిబట్టి యూహించుటకు వీలగుచున్నది. కూడల సంగమము నాఁటికాలమున అఖిలవిద్యలకును కూడలియయి ప్రసిద్ధి చెందిన ఒక బ్రాహ్మణాగ్రహారము. పెక్కు బ్రాహ్మణ కుటుంబములకు యజమానులయిన నూఱుగురు మహాజనులు దాని యాధిపత్యమును నిర్వహించుచుండిరి. వారెల్లరును గొప్ప విద్వాంసులును, కర్మిష్ఠులును అయి పాశుపతకాలాముఖ శైవశాఖలకు చెందియుండిరి. క్షేత్రాధి దైవతమయిన సంగమేశ్వరుని దేవాలయము మాత్రమే కాక యా కాలమున మఱికొన్ని యాలయములు కూడ నందుండినవి. మలప్రభా నదీతీరమున నిర్మింపఁబడిన అచేశ్వరుని దేవాలయము వానిలో నొకటి. సంగమేశ్వరునికి తరువాత ప్రసిద్ధి చెందిన దైవతము అచేశ్వరుఁడు. ఇదికాక కాశీశ్వరుని దేవాలయము, ఒక విష్ణ్వాలయము ఒక సూర్యదేవాలయము కూడ అందుండినట్లు తెలియుచున్నవి. వివిధ ప్రాంతములకు చెందిన పెక్కుగురు భక్తులు భిన్నభిన్న కాలములందు ఆయాయి దేవాలయములకు భూరిదానములను పెక్కు గావించిరి.

బసవేశ్వరుఁడు గొప్ప మతప్రవక్త గను, సంఘ సంస్కర్తగను వికాసము చెందుటకును, ఆత్మోన్నతిని సాధించుటకును అనేక విధముల అనువయిన స్థలము ఈ కూడలసంగమము. రమణీయమయిన ప్రకృతి సంపదతో విరాజిల్లు నీ పవిత్రక్షేత్రము భగవత్సంబంధమయిన పవిత్రభావములను ఉద్దీపింపఁజేయుచు దైవదర్శనాభిలాషులగు భక్తులకు భౌతిక ప్రపంచమునకు అతీతమయిన దివ్యానుభూతులను కలుగఁజేయఁజాలియుండెను. అది యొక యగ్రహారము కూడ నగుటచే పెక్కువిద్యలను నేర్చి పాండిత్యము పడయుటకును విద్వాంసులయిన విప్రవరేణ్యులతో పరిచయము పెంపొందించుకొని నిరంతర శాస్త్రాది చర్చలు గావించుటకును అందు అవకాశములు అధికముగా నుండెను. వివిధ ప్రాంతములకును, వివిధ మతములకును చెందిన పెక్కురు జ్ఞానులును భక్తులును అచటికి నిరంతరము యాత్రార్థము వచ్చుచుండుటచేత వారి మూలమున పెక్కు భౌతిక ఆధ్యాత్మిక విషయములను ఎఱుంగుటకు అందెక్కువ యవకాశముండెను. బసవేశ్వరుఁ డీ సంగమక్షేత్రమునం దుండినపుడే అతనికి ఈశాన్య గురు డను గొప్ప శివయోగి దర్శన భాగ్యమేర్పడెను. బసవేశ్వరుని చూచినంతనే యా శివయోగికి అతఁడు భవిష్యత్తులో ఒక మహాపురుషుఁడుగా పెంపొంది పేరుపెంపులు పడయఁగలఁడను భావము మదిలో మెదలెను. కూడల సంగమమునందే కొంతకాలము వసింపవలసినదని యతఁడు బసవేశ్వరుని ప్రోత్సహించెను. అంతకంటె బసవేశ్వరునికి కావలసిన దేమున్నది? అతఁడు సంతోషముగా నంగీకరించెను. అతఁ డచట ఇంచుమించుగా పండ్రెండేండ్లకాలము వసించినట్లు తెలియుచున్నవి. ఆ కాలమునందు అతఁడు సంగమేశ్వరుని అనుదినము సేవించుచు, భక్తిప్రవణమయిన జీవితమును గడపుచుండుటయే కాక పెక్కు మతవిషయక గ్రంథములను చదువుచు, విద్వాంసులతో చర్చించుచు వారి సాహచర్యమున తనకు కలిగిన సందేహములను నివృత్తి చేసికొనుచు వివిధ మతములకు, మార్గములకు చెందిన విజ్ఞాన సర్వస్వమును సముపార్జించెను. అతనికి సంగమక్షేత్రమునందు ఆదరప్రోత్సాహము లందఁజేసిన గురువుపేరు జాతవేదముని యని కొన్ని గ్రంథములు పేర్కొనుచున్నవి. బసవపురాణమున సంగమేశ్వరుఁడే యొక తాపసివేషమున వచ్చి యతనికి ఉపదేశము కావించినట్లు కలదు.

'తొల్లింటి వేషంబుతో వచ్చి తేట
తెల్లగా సంగయ దేవదేవుండు
గుడివెలిఁ బొడసూప గురులింగమూర్తిఁ
బొడఁగని బిట్టుల్కిపడి బసవండు'
(బస. ప్రథ. 55 పు)

ఇచటి సంగమేశ్వరుని గూర్చియే బసవేశ్వరుఁడు తన వచనములందు 'కూడలి సంగమదేవా' అని సంబోధించి యున్నాఁడు.

3. మంగళవాడ :

బసవేశ్వరుఁడు కూడల సంగమమునందుండఁగా చాళుక్యుల రాజధానియగు కల్యాణకటకమునందు బిజ్జలునికడ దండనాయకుఁడుగా నుండిన బలదేవ మంత్రి దివంగతుఁ డయ్యెననియు, అపుడు బిజ్జలుఁడు అతని మేనల్లుఁడయిన బసవేశ్వరునిఁ బిలిపించి యతనిని దండనాయక పదవియందు నిలిపెననియు బసవపురాణము తెలుపుచున్నది. దీనినిబట్టి బసవేశ్వరుఁడు కూడలి సంగమమునుండి నేరుగా కల్యాణమునకు తరలిపోయినట్లు తెలియును. కాని యిది యథార్థము కాదు. హరిహరుని 'బసవరాజదేవర రగళె'యందు బసవేశ్వరుఁడు కూడలి సంగమమునందు కొన్ని సంవత్సరముల కాలము గడపి యాపిదప 'మంగళవాడ' యను స్థలమునకు తరలిపోయినట్లు తెలుప బడియున్నది. చరిత్రాధారములనుబట్టి యీ కథనమే సత్యమునకు సన్నిహితముగా నుండునట్లు తోఁచును. ఆ కాలమున కలచుర్య వంశజుఁడయిన బిజ్జలుఁడు (రెండవ బిజ్జలుఁడు) రాజకీయముగా ప్రాముఖ్యములోనికి వచ్చుచుండెను. క్రీ. శ 1130 లో బిజ్జలుఁడు చాళుక్యులకు సామంతుఁడుగా 'మంగళవాడ'యందు మహమండలేశ్వరుఁ డయ్యెను. అతనికి కల్యాణమునందలి చాళుక్య చక్రవర్తులతో బాంధవ్యము కలదు. అతని తల్లి చాళుక్యుల యింటి ఆడుపడుచు. ఆమె ఆరవ విక్రమాదిత్యుఁడను చాళుక్య చక్రవర్తి కుమార్తె. అందుచే నతఁడు తన రాజధానియగు మంగళవాడ నుండి కల్యాణమునకు చుట్టపుచూపుగాను, రాజకీయముగాను రాకపోకలు సాగించుచుండుట సంభావ్యము. బిజ్జలుఁడు క్రీ. శ 1130 నుండి 1156 దాఁక మంగళవాడయందే మహామండలేశ్వరుఁడై యుండి క్రీ. శ 1156లో చాళుక్యుల యధికారమును తిరస్కరించి స్వతంత్రుఁ డయ్యెను. అప్పుడు చాళుక్య సామ్రాజ్యమునకు అధిపతిగా నుండిన తైలప చక్రవర్తి (మూఁడవ తైలపుఁడు) బిజ్జలుని ధాటి కాఁగఁజాలక కల్యాణమునుండి పారిపోయి యెచటనో తలదాఁచుకొనెను. క్రీ. శ 1162 లో బిజ్జలుఁడు సంపూర్ణముగా చాళుక్య సింహాసనము నాక్రమించుకొని చక్రవర్తియై కల్యాణమును రాజధానిగా జేసికొని క్రీ. శ 1167 దాఁక పరిపాలించెను. అతఁడు స్వతంత్రుఁడయిన క్రీ. శ 1156 వ సంవత్సరమునందే యతఁడు తన నివాసమును మంగళవాడనుండి కల్యాణమునకు తరలించియుండునని భావింపఁదగును. దీనిఁబట్టి బిజ్జలుఁడు కల్యాణమున పాలించినది ఒక్క యాఱు సంవత్సరముల కాలము మాత్రమే. అతఁడు మహామండలేశ్వరుఁడై రాజ్యాధికారము నెఱపిన యధికకాలము మంగళవాడయందే గడచినది. దీనిఁబట్టి బసవేశ్వరుఁడు కూడలి సంగమమును వదలిపెట్టి బిజ్జలుఁడు రాజ్యాధికారము నెఱపుచుండిన మంగళవాడకు తరలిపోయెనని తెలుపుచున్న హరిహరుని కథనమే సత్యసమ్మతమై యుండునని యూహింప వీలగుచున్నది. బిజ్జలుని కొలువులో నతఁడు తొలుత అతిసామాన్యమయిన గణక పదవినుండి క్రమముగా భండారియై, దండనాయకుఁడై, మంత్రిపదవి నందెనను విషయములు కూడ పయి విషయమునే బుజావు చేయుచున్నవి. చారిత్రక సత్య మిట్లుండఁగా బసవేశ్వరుని జీవితము నభివర్ణించు పురాణ గ్రంథములన్నియు కూడఁబలికికొని నట్లుగా మంగళవాడను, అందలి అతని నివాసమును పూర్తిగా విస్మరించి అతని జీవితమునకు సంబంధించిన అనేక విషయములు, వీరశైవ మతోద్యమము కల్యాణమునందే జరిగినట్లు అభివర్ణించి యుండుట విస్మయము గొలుపును. నేఁడు 'మంగళవేడె' యని పిలువఁబడుచున్న 'మంగళవాడ' మహారాష్ట్రమునకు చెందిన షోలాపుర మండలమున పండరిపురమునకు పండ్రెండుమైళ్ల దూరమునందున్నది. మంగళవాడ అనఁగా మంగళప్రదమైన ప్రదేశమని యర్థము. ప్రస్తుత మిది మహారాష్ట్రమునకు చెందియున్నను ప్రాచీన కాలమున క్రీ. శ. 15 వ శతాబ్దముదాఁక గూడ నిది కర్ణాటదేశమునందు అంతర్భాగముగా నుండెను. కర్ణాటక దేశమునకును, మహారాష్ట్రదేశమునకును సంబంధించిన పెక్కురు మహనీయులకును,

విద్వాంసులకును మంగళవాడతో సంబంధము కలదు. క్రీ. శ. 14 వ శతాబ్దమున మధ్వాచార్యుల ద్వైత సిద్ధాంతమునకు భాష్యము విరచించిన జయతీర్థస్వామి యీ మంగళవాడకు చెందినవాఁడే. నాథపంథకు చెందిన గహనీనాథుఁడను మహనీయుని దేవాలయము ఒకటి యిచట కలదు. హరిహరుని 'రేవణ సిద్ధేశ్వర రగళె'నుబట్టి రేవణసిద్ధుఁడను శైవాచార్యుఁ డచటనే నివసించినట్లు తెలియుచున్నది. అతని కుమారుఁడయిన రుద్రమునియను వీరశైవాచార్యుఁడు దీనికి సమీపమునందేయున్న 'సిద్ధనకెరె'లో జన్మించెను. మంగళవాడలో రేవణసిద్ధుని దేవాలయముకూడ ఒకటి యున్నది. అచట నేఁటికిని వీరశైవులే పూజాదికమును నిర్వర్తించుచున్నారు. ఇట్టి మంగళవాడయందు బసవేశ్వరుఁడు క్రీ. శ. 1153 దాఁక నివసించి బిజ్జలుని కొలువులో క్రమముగా నున్నత పదవుల నధిష్ఠించెను. ఇందేయతఁడు తన వీరశైవోద్యమమునకును, సంఘ సంస్కరణోద్యమమునకును గట్టి పునాదులను వైచుకొని తుదకు కల్యాణమున వానిని అమలులో పెట్టి కృతార్థత గాంచెను.

4. కల్యాణము :

బసవేశ్వరుఁడు కల్యాణమునకు తరలిపోయిన విషయము బసవపురాణమునందు ఇట్లు తెలుపఁబడి యున్నది.

'అక్కడ నంత కల్యాణంబునందు
నెక్కుడు శివభక్తి కెల్లయై పరఁగు
బండారి బలదేవదండనాయకుఁడు
దండి బసవనికిఁ దనయ నిచ్చుటయుఁ
బ్రమథు లెంతయు మెచ్చి రాఁబంపఁబోవు
క్రమమునఁ బ్రమథలోకమున కేఁగుడును
బలదేవ మంత్రి యాప్తుల బంధుజనులఁ
బిలువంగఁ బంచి యాబిజ్జలుం డనియె.'

(బస. ద్వితీ. 60 పు.)

క్రీ. శ. 1153 లో బసవేశ్వరుఁడు మంగళవాడను వదలి కల్యాణమునకు చేరినట్లు తెలియుచున్నది. అతఁడు తలపెట్టిన వీరశైవోద్యమము విశ్వరూపము దాల్చినది యిచ్చటనే. అందుచేతనే యిది నేఁడును వీరశైవులకు పవిత్ర యాత్రాస్థలమై 'బసవ కల్యాణ్' అను పేర ప్రసిద్ధి వహించియున్నది. ఇది ప్రస్తుతము బీదరు మండలమునందలి హుమ్నాబాదు తాలూకాలో చేరియున్నది. చారిత్రకముగా కూడ దీనికి గొప్ప ప్రఖ్యాతి కలదు. క్రీ. శ. 11,12 శతాబ్దులలో నిది చాళుక్య చక్రవర్తుల రాజధానిగా నుండెను. కలచుర్య వంశజుఁడయిన బిజ్జలుఁడు క్రీ. శ. 1162 లో చాళుక్య సింహాసనము నాక్రమించుకొనిన తరువాత ఇచ్చటనుండియే తన పరిపాలనము కొనసాగించెను. బిజ్జలునికిఁ దరువాత రాజ్యమునకు వచ్చినవారుకూడ దీనినే రాజధానిగా చేసికొని పరిపాలించిరి. బసవేశ్వరునికిని, అతని యుద్యమమునకును సంబంధించిన స్థలము లనేకములు ఇచ్చట కాననచ్చును. కల్యాణమున బసవేశ్వరుఁడు నివసించిన భవనమునకు 'మామనె' అని పేరు. ఆ 'మామనె' వెలసియుండిన స్థలముగా నొక ఖాళీ ప్రదేశమును అచ్చటివారు చూపుదురు. అందుండినట్లుగా చెప్పఁబడు భవనమునకు సంబంధించిన చిహ్నము లేవియు నేఁడచ్చట కానవచ్చుట లేదు. అందే రెండు రాతి గుహలు కానవచ్చును. వానిలో నొకదానియందు బసవేశ్వరుఁడు అనుదినమును పూజాదికము నిర్వర్తించుచుండువాఁడనియు, మఱొకదానియం దతఁడు ధ్యాన సమాధియం దుండెడివాఁ డనియు చెప్పుదురు. వానికి అనతిదూరమునందే బసవేశ్వరుని సోదరియు, చెన్నబసవేశ్వరునికి తల్లియునగు అక్కనాగమ్మ నివసించిన స్థలము కలదు. అచటనున్న యొకద్వారముగుండా క్రిందికి దిగి పోయినచో అచట నొక పెద్దగుహాలయము కానవచ్చును. అందులోపలగా ఒక స్త్రీ విగ్రహము కానవచ్చును. అది అక్కనాగమ్మ విగ్రహమని చెప్పుదురు.

బసవేశ్వరునికి సమకాలికుఁడును అనుభవ మంటపమునకు అధ్యక్షుఁడును అగు అల్లమ ప్రభుదేవరపేర 'ప్రభుదేవర గద్దిగె'—అల్లమ ప్రభుపీఠమొకటి యందు గలదు. ఆ ప్రదేశమునందు కొంత యెత్తున నొక వేదిక కలదు. అది ప్రభుదేవర కూర్చుండుచుండిన స్థలమఁట! దానిని సందర్శించుటకై వీరశైవమతమునకు చెందిన భక్తులు అనుదినము తండోపతండములుగా వచ్చుచుందురు. మడివాలు మాచయ్య బసవేశ్వరునికి సమకాలికుఁ డయిన భక్తుఁడు. చాకలి కులమునకు చెందినవాఁడు. ఇతని కథ బసవ పురాణమునందు కలదు. (బస. 4 ఆ. 232–242

పుటలు) అతడు శివభక్తుల మలిన వస్త్రములను అచటికి సమీపముననే యున్న చెఱువునందు ఉతికి యిచ్చుచుండువాఁడట! అతనికి సంబంధించినదిగా చెప్పఁబడు స్థలమునందు ఒక శివాలయము కూడ కలదు. కల్యాణమునందలి దేవాలయములలో త్రిపురాంతకుని దేవాలయము మిక్కిలి ప్రసిద్ధి చెందినది. వీరశైవ గ్రంథములందును, చెన్నబసవేశ్వరుని వచనములందును ఇది పలుమారు ప్రస్తావింపఁబడినది. 'పరుష గట్టి' యనుపేర కల్యాణమునందు ఒక యెత్తైన వేదిక కానవచ్చును. బసవేశ్వరుఁడు ఈ స్థలమునందు ఉండియే భక్తులకు ద్రవ్యమును పంచిపెట్టువాఁడట! అది బసవేశ్వరుఁడు తన శిష్యులకు ఉపదేశము చేయుచుండిన స్థలమని మఱికొందఱు చెప్పుదురు. 'పరుష గట్టి' యను పదమునకు ఇనుమును బంగారముగా మార్చు శక్తికల రస శిల లేక స్పర్శశిల అని యర్థము. అందలి శివపురమునందు ఒక శివాలయము కలదు. అది సొన్నలిగె (నేటి షోలాపురము) నుండి కల్యాణమునకు బసవేశ్వర సందర్శనార్థము వచ్చిన సిద్ధరాముని సంస్మరణార్థము అతనిపేర కట్టిన శివాలయముగా చెప్పుదురు. సిద్ధరామయ్య కైలాసమున కరిగిన విషయము బసవపురాణమునందు విపులముగా నభివర్ణింపఁబడినది. (బస. ద్వితీ. 111–123 పు) ఇఁకను కల్యాణమునకు చుట్టుపట్టుల బసవేశ్వరుని సమకాలికులకు, సహచరులకు, అనుయాయులకు సంబంధించినవిగా చెప్పఁబడు స్థలములు, గుహలు అనేకములు కలవు. రేవణసిద్ధుని కుమారుఁడగు ఘనలింగ రుద్రముని గుహ, నులియ చౌడయ్య గుహ, ముగ్ధ సంగయ్య గుహ, అంబిగర చౌడయ్య, హరళయ్య, మోళిగ మారయ్యల గుహలు వానిలో ముఖ్యమయినవి. ఇవి బహుశః తరువాతి కాలమున ఆయా భక్తుల సంస్మరణార్థమై నిర్మింపఁబడియో, నామకరణము చేయఁబడియో యుండునని భావింపవచ్చును.

బసవేశ్వరుఁడు మంగళవాడయం దుండినపుడు ప్రారంభించిన వీరశైవోద్యమము సామాన్య ప్రజానీకమును విశేషముగా నాకర్షించినది. అగ్రజాతులవారును, అన్యమతస్థులును, అధికారులును అడ్డుతగులుచు వచ్చినను అది నిరాఘాటముగా సాగిపోవుచుండెను. తాను సాఁగింపఁదలఁచిన యుద్యమమునకు మఱింత యనుకూలముగా నుండునని బసవేశ్వరుఁడు బిజ్జలునితోఁ బాటు దన కార్యస్థానమును మంగళవాడనుండి కల్యాణమునకు మార్చి యుండును. అతఁడు కల్యాణమును చేరిన సమయమున బిజ్జలుఁడు చాళుక్య సింహాసనమును ఆక్రమించుకొని చక్రవర్తి యయ్యెను. ప్రజలలో తన యుద్యమ ప్రభావముచే గొప్పపలుకుబడి కలిగిన బసవేశ్వరునికి అతఁడు మంత్రి పదవినిచ్చి సత్కరించి యుండును. కాని నానాఁటికి అభివృద్ధి చెందుచుండిన బసవేశ్వరుని పలుకుబడిని, అతని యుద్యమమునకు ప్రజలతో కలుగుచున్న యాదరమునుచూచి బిజ్జలునికి కన్నులు కుట్టియుండును. బసవేశ్వరుఁడును ప్రజలలో తనకుఁగల బలమును చూచుకొని బిజ్జలునియెడ నిర్లక్ష్యభావమును పూనియుండవచ్చును. తత్ఫలితముగా వారి నడుమ సత్సంబంధములు చెడినవి. బసవేశ్వరుని యనుయాయులయిన హరళయ్య (అల్లయ్య), మధుపయ్యలను శిక్షించి బిజ్జలుఁడు తనక్రోధమును తీర్చుకొనెను. దాని మూలమున వీరశైవ లోకమంతయు అట్టుడికినట్లు ఉడికిపోయినది. ఆ సంక్షోభములో బిజ్జలుఁడు క్రీ. శ. 1168 లో చంపఁబడెను. ఇది జరుగుటకు మూఁడు నెలలకు ముందే బసవేశ్వరుఁడు కల్యాణమును వదలి కూడలి సంగమునందు శివైక్యము చెందెనని వీరశైవ గ్రంథములు తెలుపుచున్నవి. ఇది క్రీ. శ. 1167 లో జరిగియుండును. ఇట్లు బసవేశ్వరుఁడు క్రీ. శ. 1153 నుండి 1167 దాఁక ఇంచుమించుగా పండ్రెండు సంవత్సరముల కాలము చాళుక్యుల రాజధానియయిన కల్యాణము (కల్యాణ కటకము)నందు నివసించి తన వీరశైవోద్యమమును ప్రచారము గావించెను. అనుభవ మండపమునందు అతఁడు సాగించిన కార్యరూపములన్నియు ఈ కాలమునందే జరగియుండును. ఇట్లు కల్యాణము బసవేశ్వరుని వీరశైవోద్యమమునకు ప్రధానస్థానమై, మహనీయమయిన అతని చరమ జీవితమునకు స్థావరమై వెలసినది.

ఆకరములు :

1. Sri Basaveswara — A Commemoration Volume. Government of Mysore, Bangalore 1967.

2. Sri Basaveswara — A Biography by R. C. Hiremath.

3. Historical Places pertaining to Basaveswara by P. B. Desai.

4. Social and Religious conditions of Karnatak before Basava, by G. S. Dikshit.

"కవి కేక"

శ్రీ బండి రాధాకృష్ణ

ఎవరు వారు ?
ధవళిమ అంతా హృదయ కుహరంలో
దాచుకున్న 'మల్లెపూవులాంటి' నా
'కవి హృదయాన్ని' అవలోకిస్తామంటూ,
'మింటినంటే మంటలతో' ప్రయత్నిస్తున్నారు.

అవును. నేనూ ఒకప్పుడు కవినే !
అవినీతిని, చవులూరే మాటల తీపిని
అవగాహన చేసుకున్నా, ఏమీ చేయలేక
జవసత్వా లుడిగిన జీవచ్ఛవాన్ని.

'నవలలోని పాత్రలాగా' ఉండీ, లేనివాణ్ణి.
'కవితా గీతికల' 'మంజుల రవాలతో,'
నిదిరించేవాళ్లను మేలుకొలిపే, కాలం కాదిది.
చెవులు హోరెత్తేలాగా ఉదయాన్నే,
'సైరన్ మ్రోత' కావాలి వీళ్లకి !
అవినీతిపరుల గుండెల్లోకి, ఇది ఏమూలకి ?

గుండె లదరే' 'నీలకంఠుని ప్రళయ తాండవం'
కండ కొకడిగా చెండడానికి, కాలభైరవుని భీకరాట్టహాసం
కవివేసే కేకల్లోనూ, పిడిబాకులోనూ,
కనబడాలి వీళ్లకి ! అప్పుడు
లేచి మొక్కుతారు, బీదా బిక్కీ కాళ్లకి.

పాలనావ్యవస్థలో రావలసిన మార్పులు

శ్రీ పి. సత్యనారాయణ

పాలనా వ్యవస్థ, రాజకీయ వ్యవస్థలో అంత ర్భాగంగాన పాలనావ్యవస్థ స్వరూప స్వభావాలు, రాజకీయ వ్యవస్థ రూపారూపాలమధ్య ఆధారపడి వుంటాయి. కమ్యూనిస్ట్ రాజ్యరాజకీయ వ్యవస్థల్లోని పాలనా విధానం, కమ్యూనిస్టేతర రాజకీయ వ్యవస్థ ల్లోని పాలనా విధానం మధ్యఉన్న భిన్నత్వం మనకు తెలిసిందే. కమ్యూనిస్టు రాజకీయవిధానం అమల్లో వున్న దేశాలన్నిటిలో కూడ, ఒకే రకమైన పాలనా వ్యవస్థ లేదు. ఆచరణలో కమ్యూనిస్ట్ సూత్రాలు దేశ సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక చారిత్రిక శక్తులకు ప్రభావితం కావడంవల్ల కమ్యూనిస్టు దేశా లన్నిటిలో సిద్ధాంతరీత్యా ఒకే రకమైన పాలనా వ్యవస్థ వుండవలసినా వాస్తవంగా అట్లా లేదు. అలానే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అమలులోఉన్న దేశాలన్నిటిలోకూడ, ఒకే రకమైన పాలనా వ్యవస్థ అమలులో లేదు. సమకాలీన రాజకీయ వ్యవస్థకు దారితీసిన పరిస్థితులు, ప్రభావాలు, కారణాలను బట్టి కూడా పాలనా యంత్రాంగ నిర్మాణం జరుగుతుంది. పాతరాజ్య విధానాన్ని విడనాడడానికి విప్లవాన్ని సాధ నంగా ఉపయోగించి కొత్తరాజ్య విధానాన్ని రూపొం దించుకొని సోవియట్ రష్యా ఏర్పరచుకొన్న పాలనా వ్యవస్థకి, శాంతియుత పద్ధతులద్వారా బ్రిటిష్ రాజ్య విధానాన్ని వదిలించుకొని, కొత్తరాజ్య వ్యవస్థను ఏర్ప రచుకొని, భారతదేశం రూపొందించుకొన్న పాలనా వ్యవస్థకి మధ్య ఎంతో తేడా వుంది. పాత విధానాన్ని సమూలంగా నాశనంచేసి దానిస్థానే నూతనరాజ్య లక్ష్యసాధన కనుగుణమైన పనిముట్టుగా పాలనా యంత్రాంగాన్ని రష్యా నిర్మించుకొంది. స్వాతంత్ర్య సంపాదనతో రాజ్యధ్యేయం మారినా, భారతదేశపాలనా వ్యవస్థ పాతపద్ధతిలోనే నడుస్తుంది. బ్రిటిష్‌వారి హయాంలో రూపొందిన పాలనా యంత్రాంగం ప్రాథ మికంగా వలసరాజ్యావసరాల కనుగుణంగా, అత్యవసర కార్యక్రమాలను మాత్రమే నిర్వహించేదిగా ఉండేది. ప్రజా ప్రభుత్వంలో ప్రజాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే ప్రతిభాశక్తులు దానికి లేవు. స్వాతంత్ర్యా నంతరం భారత సమాజాన్ని ఆధునిక పద్ధతులలో అభివృద్ధి పరచగల సాధనంగా పాలనా వ్యవస్థను రూపొందించవలసిన ఆవశ్యకతను, మన నాయకులు గుర్తించలేదు. మన రాజ్యాంగం లక్ష్యించే మౌలిక పరివర్తనను [1. ఆర్థిక, సాంఘిక, రాజ కీయ, సాంస్కృతిక రంగాలలో అందరికి సమంగా న్యాయం జరగడం; 2. దేశ భౌతిక సంపదల్లో ప్రజ లందరికి సమభాగస్వామ్యం వుండడం; 3. కుల, మత వర్గరహిత సాంఘిక వ్యవస్థ ఏర్పడడం] సాధించ గల పాలనా వ్యవస్థను ఏర్పరచుకోలేకపోవడం ఎంతో విచారించదగ్గది. ఈ కొరతే మన దేశంలో నానాటికి దిగజారుతున్న సామాజిక స్థితికి ప్రధాన కారణాల్లో ఒకటిగా భావించదగును. ప్రణాళికాబద్ధమైన ఆర్థి కాభివృద్ధి సాధనకు పంచవర్ష ప్రణాళికల రూపకల్పన ప్రారంభమయిననాటినుండి పాలనా యంత్రాంగంలో మార్పులు తప్పనిసరి అనిపించడంతో కేంద్ర, రాష్ట్ర స్థాయిలలోని పాలనా విధానాన్ని పటిష్టం చేయ డానికై కమిటీలు, కమీషన్‌లు ఎన్నో ఏర్పా టయ్యాయి. 1949—52 మధ్య గోపాలస్వామి అయ్యంగార్ అధ్యక్షతన, 1951 లో గోర్వాలా అధ్యక్షతన, 1953—56 మధ్య పాల్‌ఎపెల్బి అధ్య క్షతన, 1962 లో వి. టి. కృష్ణమాచారి నాయ కత్వాన, 1966—70 మధ్య మొరార్జిదేశాయ్, కె. హనుమంతయ్యల అధ్యక్షతన పనిచేసిన పాలనా సంస్కరణల సంస్థలన్ని ప్రస్తుత పాలనా వ్యవస్థను మౌలికంగా అంగీకరిస్తూ; అక్కడక్కడ కొన్ని మార్పులు, కూర్పులు, చేర్పుల సూచించాయేగాని

ఆమూలాగ్రంగా పాలనా వ్యవస్థను పరిశీలించి ఆధునీకరణకు, అభివృద్ధికి అనుగుణంగా మార్చవలసిన ఆవశ్యకతను గుర్తించలేదు. ప్రస్తుత పాలనా వ్యవస్థ లోని కొన్ని ప్రధాన లోపాలను గుర్తించి నివారణోపాయలను, ఆలోచించడం మన సమాజం ఆధునిక సమాజంగా మారాలని కాంక్షించేవారందరి కనీస కర్తవ్యం.

మన ప్రభుత్వ యంత్రాంగం పనిచేసే విధానం మీద పశ్చిమదేశాల్లో ఎప్పుడో కల్గిన వైజ్ఞానిక యాజమాన్య ఉద్యమ ప్రభావం ఏమాత్రం లేదు. అడ్డదిడ్డంగా, అశాస్త్రీయంగా పనులు చేయడం బాగా అలవాటయ్యింది. ఏ పనికి ఏ వ్యక్తిని, ఏ సాధనాన్ని ఉపయోగించాలనే భావన లేదు. అభివృద్ధిని సాధిస్తున్న, సాధించిన పశ్చిమదేశాలలో కార్యనిర్వహణ విధానం శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా జరుగుతుంది. శాస్త్రీయ పద్ధతిని అంగీకరిస్తూ కొత్త పాలనా ప్రక్రియలను ప్రవేశపెట్టడం ఎంతైనా అవసరం. క్రొత్త ప్రక్రియల ద్వారా పనివేగం, గుణం రెండూ పెరుగుతాయి. ఏ ఉద్యోగి, ఏ స్థాయి; ఎంతపని, ఎటువంటిపని చేయగలుగుతుందా ఖచ్చితంగా తెలుసుకోగలం. ప్రభుత్వం కొత్త కార్యక్రమాల చేపట్టడానికి ముందు ఆ కార్యక్రమాల నిర్వహణకు తగిన శక్తిసంపత్తులు ప్రస్తుత వ్యవస్థలో ఉన్నాయో లేవో అంచనా వేయడానికి వీలవుతుంది. శాస్త్రీయమైన అంచనా లభ్యం కానప్పుడు ఉన్న ఉద్యోగులమీద మరింత భారం పెట్టడం ఉన్న స్థాయిలను బలహీనపరచడం సాధారణంగా జరిగే పని. నిర్ణీతకాలంలో పూర్తి కావాలని ఉద్దేశించే కార్యక్రమాలు విఫలం కావడానికి కారణం, కార్యనిర్వహణలో శాస్త్రపరమైన అంచనా విధానం లోపించడమే.

ప్రస్తుత పాలనా వ్యవస్థలో మరొక పెద్ద లోపం తగు మోతాదులో అధికార వికేంద్రీకరణ, దత్తత జరుగకపోవడం. నానాటికి కేంద్రీకృత ధోరణి బలపడుతుంది. కేంద్ర రాష్ట్ర కార్యాలయాలన్నీ కేంద్రీకృతం కావడం, పాలనా సౌలభ్యం దృష్ట్యా అవాంఛనీయం. ప్రజలకు దగ్గరగావుండి సేవచేయవలసిన కార్యాలయాలు కూడా అధికారుల సౌలభ్యంకోసం రాజధాని ప్రాంతాలలో కేంద్రీకరించడం, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అగాధాన్ని ఏర్పరచడమే. ప్రజలకు అందుబాటులో లేని కార్యాలయాలలో జాప్యం, లంచగొండితనం, అవినీతి పెరగడానికి అవకాశం ఏర్పడుతుంది. సామాన్య ప్రజలకు అందుబాటులో లేనివాటిని ధనికవర్గాలవారు సులువుగా అందుకోవడంలో పాలనా న్యాయంలో వర్గ దృక్పథం ఏర్పడుతుంది. అధికార వికేంద్రీకరణంతో పాటు అధికార దత్తత కూడ విస్తృతంగా జరగాలి. పెత్తందారి మనస్తత్వానికి అలవాటుపడ్డ పై అధికారులు క్రింది ఉద్యోగులను బానిసలుగాచూసే సంకుచిత దృష్టి మారాలి. ప్రభుత్వ యంత్రాంగపు పై అంతస్థుల్లో ఉండేవారికి మేధా సంపత్తి శక్తి సామర్థ్యాలు అధికంగా వుంటాయనే ఫ్యూడల్ భావన పోవాలి. క్రిందివారికి అధికారం ఇవ్వడం అంటే తమకు సంక్రమించిన అధికారపు ఆస్థిలో వాటా పోతున్నట్లు బాధపడకూడదు. ఉద్యోగులందరూ పాలనా యంత్రాంగంలో ఏదో రకంగా కీలక పాత్ర వహించేవారనే విశాల దృక్పథం కలగాలి. నమ్మకం, విశ్వాసం లేనిదే, ఎన్ని నియమాలు, నిబంధనలు ఏర్పరచినా పని మాత్రం జరుగదు.

మన పాలనా వ్యవస్థలో సాధారణ అధికారులు (జనరలిస్ట్లు) పెత్తందారులుగా ఉండటం బ్రిటిష్ పాలనా వ్యవస్థనుండి మనకు సంక్రమించిన అవాంఛనీయ వారసత్వాలలో ఒకటి. అభివృద్ధి కార్యక్రమాల అమలుకి ప్రత్యేక జ్ఞానం; నిపుణత, శక్తి అవసరం. ఈ గుణాలు సాధారణ అధికారులలో ఉండటం అరుదు. వినియామక కార్యక్రమాల అమలులో ఆరితేరిన సాధారణ అధికారు (స్పెషలిస్ట్)లపై పెత్తనం చెలాయించటం వారిమధ్య మానసిక సంఘర్షణకు దారితీస్తుంది. ఇంజనీర్లు, డాక్టర్లు, సైంటిస్టులు, 'టెక్నోక్రాట్లు'కు వివిధ ప్రభుత్వ యాజమాన్య స్థాయిలలో ఇతోధికంగా అవకాశం లభించాలి, ఐ. ఏ. ఎస్. పెత్తనం నశించాలి అంటారు. ఇటీవల దేశంలో తలెత్తిన ఉద్యమానికి దారితీసిన పరిస్థితులను, భావనా పటిమను అరం చేసుకోవాలి. నిర్వహించే కార్యక్రమాల ననుసరించి ఉద్యోగుల నియామకం జరగాలిగాని అంతస్థులను బట్టికాదు.

మనము ఇంతవరకు గుర్తించని మరొక

వాస్తవం ప్రభుత్వ ఉద్యోగ బృందం వైఖరి ప్రాధాన్యత. విధాన నిర్ణయం—విధాన నిర్వహణ వేరువేరని భావించే పాతకాలపు పద్ధతుల ననుసరించి, ఉద్యోగులలో తటస్థ వైఖరి పెంపొందాలనే భావన ఇంకా దృఢంగా వుంది. బ్రిటిష్ వారి పాలనలో భారతీయ ఉద్యోగులు భారత ప్రజల భావాలకు ప్రభావితం గాకుండా తటస్థంగా వుండాలని సిద్ధాంతీకరించడం వల్ల అప్పటినుండి ఆ భావనే ప్రచారంలో వుంది. ప్రభుత్వలక్ష్యం సంక్షేమరాజ్య నిర్మాణమైనప్పుడు ప్రభుత్వోద్యోగుల్లో తటస్థవైఖరి కార్యక్రమాల నిర్వహణా సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యవ్యవస్థలో నిర్ణయాకరణ మంత్రుల ఒక్కరి బాధ్యతేనని ప్రభుత్వోద్యోగులకు ఎట్టి సంబంధంలేదని చాలామంది భావిస్తారు. ఇది సరికాదు. నిర్ణయాకరణ చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఈ ప్రక్రియలో ఉద్యోగులందరూ ఎంతో కొంత భాగస్వాములే. కింది తరగతి ఉద్యోగుల రాజకీయ కార్యనిర్వహణతో నిమిత్తం లేక పోయినా దాని లక్ష్యాలకు భిన్నంగా ప్రవర్తించడానికి వీలుండదు. అధికార దత్తత విస్తృతమయ్యేకొద్దీ రాజకీయ కార్యనిర్వాహకత్వం, ఉద్యోగులందరినీ తన పరిధిలోకి తీసుకువస్తుంది. పరిధిని దాటిపోవటమంటే ప్రభుత్వ విధానాలకు, ప్రవర్తనకు భిన్నంగా నడవటమే. తమ దీర్ఘకాలిక అనుభవంద్వారా మంత్రులకు సముచిత సలహానిస్తూ నిర్ణయాకరణలో పరోక్షంగా పాల్గొంటారు. శాసన నిర్మాణంలో వారి ప్రభావం ఒక్కోసారి ప్రత్యక్షంగా ఉంటుంది. పార్లమెంటరీ సంఘాలముందు ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ లోపాలపై తగు సమాధానాలిచ్చే బాధ్యత కూడా ఉద్యోగులదే. పైపెచ్చు నిత్యం తమకు ఎదురయ్యే పాలనా సమస్యలను పరిష్కరించడంలో తటస్థవైఖరి అవలంబించడం అసాధ్యం. మంత్రులతోపాటు ఉద్యోగి బృందం కూడా రాజ్యాంగంలో పొందుపరచబడిన జాతీయ లక్ష్యాల సాధనకు ప్రమాణం చేస్తారు. దానికి భిన్నంగా గాని, తటస్థంగా గాని ఉండటానికి వీలులేదు. రాజ్యాంగ సూత్రాలు నిర్దేశించే మన జాతీయ లక్ష్యాలకు (1. ప్రజలందరికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని వీలైనంత కార్యసాధకంగా చేకూర్చడం; 2. సమిష్టి సౌభాగ్యానికి దేశంలోని భౌతిక సంపదను సమంగా సక్రమంగా పంచడం; 3. దుర్బల వర్గాలను సాంఘిక అన్యాయాలకు గురికాకుండా చూస్తూ వారికి విద్య, ఆర్థిక వ్యవహారాల్లో ఎక్కువ అవకాశాలను కల్పించడం; 4. స్వపరిపాలనా సంస్థలుగా గ్రామ పంచాయతీలను ఏర్పరచడం). భిన్నంగా, తటస్థంగా నడవడం ఉద్యోగులకు ఎలా సాధ్యం? ఒక ఉద్యోగి తన వృత్తిని యాంత్రికంగా చేయలేడు. యాంత్రికంగా చేయగలడు అని నమ్మటం తటస్థభావం, అశాస్త్రీయం. ప్రతి ఉద్యోగి మరగాక మనస్సు హృదయం ఉన్న వ్యక్తిగాన తను పెరిగిన వాతావరణం చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావాలకు లోనవుతూ వృత్తి నిర్వహణలో తటస్థంగా ఉండజాలడు. తటస్థంగా ఉండటమంటే పనిచేయకపోవడమే అవుతుంది. పాలక పక్ష సిద్ధాంతాలు, ఆశయాల ఆధారంగా రూపకల్పన జరిగే కార్యక్రమాల నిర్వహణంలో ఉద్యోగులు చిత్తశుద్ధితో, దృఢవిశ్వాసంతో, ఉత్సాహంతో, స్నేహశీలతతో ప్రవర్తించాలి. దీనికి మారుపేరే 'కమిట్‌మెంట్''

పాలనా సామర్థ్యం కేవలం ఉద్యోగుల ప్రతిభాశక్తిమీదనే గాక వారి ప్రవర్తనమీద కూడ ఆధారపడి ఉంటుంది. ఉద్యోగుల ప్రవర్తన ఆదర్శప్రాయమైనపుడు ప్రజలలో ఉద్యోగులపట్ల తద్వారా ప్రభుత్వ యంత్రాంగం మొత్తంమీద గౌరవం, విశ్వాసం పెంపొందుతాయి. ప్రజాసంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం విధించే నియమాలకు, నిబంధనలకు ఉద్యోగులు కట్టుబడి వుండాలి. ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించేవారిమీద క్రమశిక్షణ చర్యలు గట్టిగా తీసుకొనే సంప్రదాయం మన దేశంలో ఇంకా ఏర్పడలేదు. ఉద్యోగులు సంఘటితంగా సమైక్యంగా పాలనా సామర్థ్యాన్ని అభివృద్ధిచేయడానికి యోగ్యతా విధానాన్ని పెంపొందించడానికి బదులు స్వార్థచింతనతో తమ జీతభత్యాలు మెరుగుకోసం మాత్రమే కృషి చేస్తున్నాయి. జీవనాన్ని గడిపే ఒక బలమైన సామాజిక వర్గంగా ప్రజా జీవితాన్ని స్తంభింపజేసే ముఠాగా ఉద్యోగులు ప్రవర్తించడం గర్హించదగ్గ విషయం. జాతీయ ప్రయోజనాలను లెక్కచేయక స్వలాభ దృష్టితో ఉద్యోగులు ప్రవర్తించరాదు. ప్రభుత్వ యాజమాన్యం

కింద వున్న పారిశ్రామిక, వ్యాపార సంస్థల్లో సమ్మెల వల్ల ఉత్పత్తి తగ్గిపోవటమేగాక, సోషలిస్టు విధానాల మీద ప్రజలకు నమ్మకం సన్నగిల్లే ప్రమాదం కూడా వుంది. సమ్మెలమీద చర్య తీసుకోవడం కార్మిక వ్యతిరేక ధోరణి రాజకీయ నాయకులు, కార్మిక నాయకులు భావించరాదు.

ప్రస్తుత పాలనా వ్యవస్థలు ప్రజలకోసం ప్రభుత్వం చేసే పనుల సమాచారం తెలియకపోవడం మరొక పెద్ద లోపం. పంచవర్ష ప్రణాళికల రూపకల్పన ఎక్కడ జరుగుతుందో, ఎలా జరుగుతుందో, ఎవరికీ తెలియదు. సామాన్య ప్రజానీకానికేగాక కళాశాలల; విశ్వవిద్యాలయాలలోనివారి కసలు పూర్తిగా తెలియదు. తగు ప్రచారంలేదు. ప్రభుత్వానికున్న ప్రచార సాధనాలు సరిగా ఉపయోగపడటంలేదు. ఆకాశవాణి లాంటి ప్రభుత్వ ప్రసార సాధనాలు ప్రజలను ఎంతో ప్రభావితం చెయ్యవచ్చు. ప్రజల భావాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వానికి పత్రికలు తగినంతగా లేవు. ఉన్న కొద్దివి అందరికీ అర్థంగాని ఇంగ్లీషులో వున్నాయి. పాతికేళ్లనుండి పాలక పక్షంగా ఉన్న కాంగ్రెసుకు గూడా ఒక్క దినపత్రిక లేకపోవడం అత్యంత విచారకరమైన విషయం. ప్రతిపక్షాలకున్న పత్రికలు ప్రభుత్వాన్ని విమర్శించడంతో ప్రభుత్వం చేయని, చేయలేని వాటిని గురించి ప్రజలకు ఎక్కువగా తెలుపుతుంది. చైనాలో సాంస్కృతిక విప్లవపు రోజుల్లో చైనా రేడియో రాత్రింబగళ్లు సాంస్కృతిక విప్లవ ఫలితాలను ప్రసారం చేస్తుండటం మన కందరికని తెలిసినదే. ప్రచారం లేనిదే ఏ కార్యక్రమమైన ప్రజలలోకి చొచ్చుకుపోదు. కమ్యూనిస్టుదేశాల్లో పాలకపార్టీశాఖలు ప్రభుత్వ కార్యక్రమాలను పరోక్షంగా పర్యవేక్షిస్తుంటాయి. పాలకపక్షం నిఘాద్వారా ప్రభుత్వ కార్యక్రమాల అమలు సరిగా జరగటానికి అవకాశం ఉంది. మనదేశంలో పాలకపక్షంకు మంచి 'కేడర్' లేకపోవడం పెద్ద లోపం. పాలక పక్షానికి వివిధ స్థాయిల్లో శాఖలుంటే ప్రభుత్వంపై ప్రజల భావాలను, ప్రభావాలను మంత్రివర్గం తెలుసుకొని ఎప్పటికప్పుడు లోపాలను సరిదిద్దుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. రాజకీయపక్షాలు శాస్త్రీయ పద్ధతిలో, ప్రజాస్వామిక సూత్రలాధారంగా బలపడకపోతే అధికారంపక్షాల వివిధ స్థాయిల్లో, విభిన్న వ్యక్తుల్లో దుర్వినియోగమయ్యే అవకాశం ఎక్కువగా వుంటుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలపడడానికి రాజకీయ పక్షాలు వహించవలసిన పాత్రను పాలకపక్షం గుర్తించింది.

నవసమాజ నిర్మాణంలో పాలనావ్యవస్థ ప్రాధాన్యతను ప్రాముఖ్యతను గుర్తించి ప్రస్తుత పాలనా పద్ధతుల్లో రావలసిన మార్పులను ఆలోచించడం అభ్యుదయవాదులందరి కర్తవ్యం.



పతాక శీర్షిక

శ్రీ రామా చంద్రమౌళి

చుట్టూ—ఆకాశం అంచులనుండి నా వైపు
చేతులు.
ఒక్కొక్క చేయి కబంధ హస్తంలా,
రెపరెప లాడుతున్న అగ్నిశిఖల్లా హస్తాంగుళులు
నా కన్నుల నిండా చిక్కగా నిశిజీరలు చీకటి దారాల్లా.
గుండెల్లో ఏదో లావా ఊటలా
కత్తిమొన కదులుతున్నట్టు చిరుమంట
—ఏమిటిది.
నాభి పొరల్లోనుండి విశ్వపరివ్యాప్తమౌతున్న ఈ ఆర్తి ఏమిటి
...ఆకలి...ఆకలి
ఆకలి విషకూర్చికలా నా ప్రేగులను ఛేదిస్తోంది.
అరవాలి—దీర్ఘస్తబ్దతలో మెసలుతున్న నేను
ఈ నిశ్శబ్దాన్ని బద్దలుకొట్టి ఆక్రందించాలి.
కాని ఏది,
ఏ శబ్దచాపంలోకీ అభిక్రమించలేకపోతున్నాడు తను.
గొంతునిండా గట్టిగా మంచు ముద్దలా
ఏదో నిస్సత్తువ పులుముకుంది
అయినా, ఆశ.. ఎవరైనా మనసున్నవారు తనను చూడకపోతారా అని
కాని నాకు తెలియడంలేదు—నేను
రోడ్డు ప్రక్కన మున్సిపాలిటీవాళ్ల చెత్తకుప్పలా ఉన్నానని
ప్రక్కన బిల్డింగ్‌మీది త్రివర్ణజాతీయపతాకం నీడ
రంగుల వలలా నాపై రెపరెప మంటోంది—అయితే మాత్రం
ఆకలి చల్లారడంలేదు.
ఎవరో నా వైపు చూస్తారనుకున్నవారు, పైకి ఆకాశంలోకి చూచుకుంటూ
అప్పుడప్పుడు నా చేతిని మాత్రం తొక్కుతున్నారు
—అదిగో
దూరంగా కేకలు...అరుపులు—ఎన్నో వేలగొంతుల ఘోష...ఎందుకో?
వస్తున్నారు నా వైపు
ఇంతలో...నా కనుబొమ్మలు చిట్లిపోయినట్టు ప్రళయనాదం
ప్రపంచం సుళ్లు తిరుగుతోంది.

* * * *

మర్నాడు పేపర్లో
'ఉద్యమంలో వీరకిషోరం ఆత్మబలి'—పతాక శీర్షిక.

పట్టెడు మెతుకులు

శ్రీ కలువకొలను సదానంద

"పట్టెడన్నం పెట్టు తల్లీ!"

మిట్టమధ్యాహ్నంవేళ వాకిట్లో ఉరుము ఉరిమింది.

భోజనం ముగించి ఆ ఉరుముకోసమే వేచి వున్నట్లు వసారాలో వాలు కుర్చీలో కూర్చునివున్న రాయప్పలో చలనం కలిగింది.

వాడేనా?...

నిలువునా కాలిపోయిన చింతమొద్దులావున్న ఆరడుగుల విగ్రహమూ, దిష్టిబొమ్మను తలపింపజేసే తెల్లగుమ్మడికాయంత తల, గాజుగోళాలవంటి మిడిగుడ్లు, ముంతమామిడికాయలాంటి ముక్కు, లావుపాటి పెదవులమీద భయంకరమైన పిచ్చినవ్వు, మాసిన గడ్డం, చింపిరిజుట్టు, మొలచుట్టూ మురికిబట్ట... వాడే! బలికి సిద్ధంచేసిన దున్నపోతులా వున్నాడు! వెధవ! బదరీనాథ్‌కు వెళ్లరాదూ? ఒక్కసారికి ఇద్దరేసి యాత్రికులనుమోస్తూ వేనకువేలు సంపాదించుకోవచ్చు! చట్టిచేతబట్టుకొని ఊరిమీదపడ్డాడు, సోమరిపోతు! ఊరి సొమ్ముతిని ఒళ్లు పెంచుకోటానికి—కాలు సొట్టా, కన్నుసొట్టా? భిక్షగాడికుండవలసిన యోగ్యత ఒక్కటైనా వుందా? పోనీ, ఆ నిలబడే వాణ్యంతో, అడిగే తీరులో కాసంత వినయమైనా ఏడిసిందా? బిచ్చగాళ్లకంతా తానేదో ప్రతినిధి అయినట్లు నిటారుగాన్లే నిలబడి, వీడి తాత సొమ్మేదో యిచ్చిపెట్టినట్లు ధారాళంగా అడుగుతాడు—పొగరుబోతు చెధవ!

ఎన్నిసార్లు తిట్టి, తరిమినా—వాడు రావడం మానుకోడు. పూట పూటకు వస్తూనే వుంటాడు. రానీ! తన దగ్గరా వీడి మొండితనం? ఈ రాయప్ప వాలుకుర్చీలో ఆసీనుడై వుండగా, వీడు అన్నం పెట్టించుకు పోగలడా?

'అయ్య వద్దంటుంటే, అమ్మ ఎలా పెడుతుందనుకున్నావురా పిచ్చినాగన్నా అన్నంలేదు, ఆవకాయా లేదు. పోపో!' అంటూ—ఆ యింట్లో తన ఆధిక్యతను ప్రదర్శించే హుందాతనంతో కసరి కొట్టాడు రాయప్ప.

ముష్టివాడు అంతకన్నా హుందాగా అక్కడి నుండి కదలి, మరో యింటి ముందరికి వెళ్లాడు.

రిటైర్డు ఆఫీసరు రాయప్ప వాలు కుర్చీలో వాలి, గంటల తరబడి ఆలోచిస్తూ ఏకాంతంగా గడపడమనే అభ్యాసం ప్రారంభించి యిప్పటికి మూడు నెలలు కావస్తున్నది. అంతకుముందు ఆలోచించడానికి అతనికి అవకాశం వుండేదికాదు. అతని చేయి మేజామీది బెల్లును ఘల్లు మనిపిస్తూనో, ఫైళ్లలో గరగరలాడుతూనో వుండేది. అతని నోరు బంట్రోతులమీద, గుమాస్తాలమీద, రెవిన్యూ ఉద్యోగులమీద అస్త్రపరంపరలను కురిపిస్తూనే వుండేది. ఆ అలవాటును మానుకోలేని రాయప్ప—ఈ మూడు మాసాలుగా ఇంటి ఛాయలకు వచ్చే కుక్కలమీద చేయి చేసుకోవడంతోను, ముష్టివాళ్లమీద నోరు చేసుకోవడంతోను సరిపెట్టుకోగలిగాడు.

అతను వాలుకుర్చీలో గడపడం ప్రారంభించిన తొలి రోజుల్లో అతని ఆలోచనలకు ఒక లంగరంటూ లేకుండా వుండేది. ఆ ఆలోచనా భ్రమణానికి ఒక కేంద్ర విషయమంటూ లభించడానికి ఎన్నో రోజులు పట్టలేదు.

రాయప్ప నిద్ర లేచినదే తడవుగా కాలకృత్యాలు ముగించుకుని, ఉపాహారం పుచ్చుకుని, కాఫీ సేవించి, చుట్ట కాల్చుతూ వసారాలో—వాలుకుర్చీలో కూర్చుం

టాడు. తెరమీది సినిమా బొమ్మల్లా నిమిష నిమిషానికీ వీధిలో నడయాడుతూ కనిపించే ముష్టివాళ్ళు రాయప్ప ఆలోచనల్ని తమ పైకి కేంద్రీకరించుకోగలిగారు.

అతడి సిద్ధాంతం ప్రకారం ప్రపంచంలో మూడు రకాల మనుషులున్నారు. ఒకడు అత్యాశాపూరితుడు. మరొకడు అత్యాశలేనివాడు, సోమరిపోతుకానివాడు. ఇంకొకడు వట్టి సోమరిపోతు. గడనకోసమే కాలాన్ని వెచ్చించే అత్యాశాపరుడు తిండి తినడమనే వృథా కాలయాపన చేయలేడు. అతడు కష్టపడీ, తినలేకపోతున్నాడు. సోమరితనమూ, అత్యాశాలేనివాడు కష్టపడుతున్నాడు, తింటున్నాడు. కానీ, ఈ మూడోవాడు—సోమరిపోతు—కష్టపడడు; హాయిగా తింటున్నాడు. ఈ ముష్టివాళ్లంతా సోమరిపోతులు!

కంటబడిన ముష్టివాళ్ల నందరినీ శ్రద్ధగా పరిశీలించడం, వాళ్లనుగూర్చి ఆలోచిస్తూ వుండడం—రాయప్పకు ముఖ్యవ్యాసంగమైపోయింది. ఈ మూడు మాసాల్లో— ప్రపంచంలోఎన్ని భాషలున్నాయో, అన్ని రకాల ముష్టివాళ్లను అతను చూశాడు. ఒకడి వేషానికీ, మరొకడి వేషానికీ ఎక్కడా పోలికే లేదు. ఆ లేకపోవడమనేది బహుశా ఆ వృత్తిలోని ప్రధాన సూత్రం కావచ్చు!

ఒకడు కోతి నాడిస్తూ వస్తాడు. ఒకడు ఎలుగుబంటుతో వస్తాడు. ఒకడు పామును భుజాన వేసుకుని వస్తాడు. ఒకడు నెత్తిన గంగమ్మతల్లిని మోసుకుని వస్తాడు. ఒకడు గరుడగంబం పట్టుకుని గంట వాయించుకుంటూ వస్తాడు. ఒకడు కాషాయగుడ్డలు తగిలించుకుని వస్తాడు. ఒకడు మూర్ఛరోగినంటూ మెడలో పెద్ద రాగిరేకు వేలాడదీసుకుని వస్తాడు. ప్రపంచంలో రేడియోలన్నీ పనిచేయనట్లు, తాను తప్ప ప్రపంచానికిక వేరు గతి లేదన్నట్లు—ఒకడు గొంతెత్తి పాడుతూ వస్తాడు. వీళ్లందరూ సోమరిపోతులుగాక, మరెవరు?

వీళ్లతోబాటుగా అప్పుడప్పుడు కుంటివాళ్లు, గుడ్డివాళ్లకూడా అతనికి తారసపడకపోలేదు. వారిమీదకూడా అతనికి ఈ షణ్మాత్రమైనా సానుభూతి లేదు. వాళ్లు కుంటి వాళ్లుగా, గుడ్డివాళ్లుగా నటిస్తున్నారనీ—ఒకవేళ ఆ అంగవైకల్యం నిజమే అయితే సుఖజీవనంకోసం తమకు తామే బుద్ధిపూర్వకంగా ఆ అంగవైకల్యాన్ని కలుగజేసుకుని వుంటారనీ అతని అనుమానం. వాళ్లు వికలాంగులుకారు! మోసగాళ్లు! ప్రభుత్వం వీళ్లందరినీపట్టి బానిసలుగాచేసి, జాతీయాభివృద్ధి కార్యకలాపాలకు వినియోగించుకుంటే—దేశం బాగుపడిపోదూ?

వారిపట్ల రాయప్పకున్న ఏహ్య భావం, ద్వేషం యినుమడించడానికి వారి వినయ విధేయతారహిత ప్రవర్తనకూడ కారణమే! తాను (రిటైర్డు) తాసీల్దారుకదా?...ఏ మాత్రం జంకుగొంకులు లేక తనకు ఎట్టయెదుట నిటారుగా నిలబడి, బిచ్చంపెట్టించుకోవడం జన్మహక్కులా కేకపెట్టడమేనా మర్యాద?... పోనీ, తాను వెళ్లమంటే ఒక్కమాటతో వెళ్లిపోవాలి కదా? ఎంతకూ కదలక ఒకటికి పదిసార్లు గీపెడితే, దాన్నేమనాలి? తల బిరుసుకదూ?

అందుకే, ముష్టివాడన్నవాడు ఈ యింటి దరిదాపులకైనా రాకూడదు. వస్తే—'రాయప్పగారున్నారు! జాగ్రత్త!'...ఈ ఆరుఖండాలూ ఒకే ఇల్లయిపోతే బాగుండును. అప్పుడు ఆ యింటి వసారాలో వాలు కుర్చీ వేసుకుకూర్చుని, ఈ ముష్టివాళ్లందరి ఆట కట్టించవచ్చును!

నిలువునా కాలిపోయిన చింతమొద్దులావున్న ఆ ఆరడుగుల ఎత్తున బిచ్చగాణ్ణిచూస్తే అరికాలి మంట నెత్తికెక్కుతుంది రాయప్పకు. వాడికి పరమ శత్రువెవడైనావుంటే, ఒక్కరాయప్పే! ఆయన వుండగా వాడు ఒక్కపూటైనా అన్నం పెట్టించుకోలేడు. రాయప్ప ఊహలో—వాడొక ముష్టివాళ్ల సంస్థ! వాళ్ల సోమరితనానికి అచ్చుబొమ్మ!

అప్పుడప్పుడూ అతని అంతరాత్మ అతని ఈ స్థిరాభిప్రాయాలకు భిన్నంగా ఆలోచించడంకూడా కద్దు. వీళ్లలో చాలామంది సోమరిపోతులైతే—మిగిలిన వాళ్లు గత్యంతరం లేక ముష్టివాళ్లైన వాళ్లు. కొందరు రోగపీడితులు. కొందరు వికలాంగులు. కొందరు దుర్బలులు. వాళ్లు ముష్టెత్తుకోవటానికి వారి దౌర్భాగ్యమో, దారిద్ర్యమో కారణమై వుండాలి.

ఆ దురవస్థ మానవుడికిగాక మరే ప్రాణికి ప్రాప్తిస్తుంది ?

రాయప్ప వాళ్లను చూచినప్పుడల్లా తన సౌభాగ్యాన్ని మననం చేసుకునే వాడు. తనకూతురు ఒకానొక ఉన్నతకుటుంబంలో కోడలు. తనకొడుకు హైదరాబాదులో ఉన్నతోద్యోగం చేస్తున్నాడు. తాను అతి జాగరూకుడు. వారిమీద ఆశ అడియాసగా పరిణమించే రోజుకూడా రావచ్చును. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే—తన భావిజీవితానికి రక్షణ చేకూర్చుకోగలిగాడు తాను. ఉండటానికి యిప్పుడీ మేడ వుంది. బ్రతుకు గడుపుకోవడానికి నెలనెలా పెన్షన్ వస్తుంది. కొండంత అండగా బ్యాంకులో పాతికవేల రూపాయల రొక్కం వుంది. ఇది చాలు. తనకా దురవస్థ ఏదో ప్రాప్తించటానికి అవకాశం గోరంతైనా లేదు.

...ఈ విధమైన ఆలోచనలతో వాలుకుర్చీలో మూడు మాసాలు గడిపాడు రాయప్ప.

* * *

వేళకు తింటూ, వాలుకుర్చీలో వాలి సదా ఒకే రకమైన ఆలోచనల్ని నెమరు వేసుకుంటూ వుండడమనే జీవన సరళిపట్ల ఒకింత వెగటు పొడసూపింది, రాయప్పలో.

తనకు ఉల్లాసం కావాలి. కాలక్షేపంలో కొత్తదనాన్ని వెతుక్కోవాలి. రాయప్ప ఆ సాయంకాలం అలా వాహ్యాళి వెళ్లి రావాలనుకున్నాడు.

ఇల్లాలు అందించిన కాఫీ త్రాగి, ముఖం కడుక్కున్నాడు రాయప్ప. చొక్కా తొడుక్కుని ఊతకర్ర చేతబట్టుకుని బయలుదేరాడు. విలాసంగా కర్ర ఊపుకుంటూ, ఎదురుపడిన పరిచితుల నమస్కారాలను చిరునవ్వుతో అందుకుంటూ ఊరిబయటకు చేరుకున్నాడు. తెల్లమబ్బుల నీలాకాశంతో, పచ్చని పొలాలతో, పిట్టల పాటలతో, చల్లని మలయసమీరంతో, సాయంకాలపు ప్రశాంతతతో ఆహ్లాదకరంగా వున్నది ప్రకృతి. సాయంతపు శోభనం యిలా ఏకాంతంగా అనుభవించడం తనకు కొత్తగాను, ఆనందదాయకంగాను వుంది. తాను తాసీల్దారుగా వున్న రోజుల్లో తనకీ అవకాశం వుండేదికాదు. మనుషులు తనను ఏకాంతంగా వుండనిచ్చేవారు కారు.

రాయప్పకు నడక ఉల్లాసజనకంగా వుంది.

అతను నడుస్తూన్న కాలిబాటను ఆనుకుని చిన్నగుట్ట ఒకటుంది. ఆ గుట్టమీదికి నడిచివెళ్లడం కష్టమనిపించలే దతనికి. ఎక్కడైనా కొంతసేపు కూర్చోవాలనిపించింది. కొండరాళ్ల నడుమ ఒక అనువైన చోటు చూసుకుని కూర్చున్నాడు. కొండమీద కొన్ని గజాల దూరంలో పాడుబడిపోయిన చిన్న దేవాలయం కనిపిస్తున్నది. గుట్టంతా ఎర్రటిమట్టితోను, చిన్నచిన్న గులకరాళ్లతోను, పెద్దపెద్ద బండలతోను, రకరకాల ముళ్లపొదలతోను కప్పబడివుంది. గుట్టపైనుంచీ చూస్తూంటే—ఊరంతా ఒక పెద్దబొమ్మల కొలువులా కనిపిస్తున్నది.

ఎప్పుడూ లేనిది ఈనాడు యింతదూరం నడిచి వచ్చినందుకు కాబోలు—రాయప్ప పొట్టలో ఆకలి మెదిలింది. తాను చివరిసారిగా కచ్చేరీమెట్లు దిగిన నాటినుంచీ గంటగంటకు ఆకలి అతన్ని పరామర్శిస్తూనే వుంది. ఆ రోజుల్లో భోజనాన్ని గురించి కూడా తా నెప్పుడూ ఆలోచించేవాడు కాదు. సోమరితనానికీ, ఆకలికీ వున్నంత సాన్నిహిత్యం మరిదేనికీ వుండదేమో!...తాను యింటికి తిరిగి వెళ్ళేసరికి వంట పూర్తయి వుంటుంది. వెళ్లగానే పీటమీద కూర్చోవచ్చును!

రాయప్ప మనోభ్రమరం భోజనంచుట్టూ పరిభ్రమిస్తూన్న సమయంలో—అతని ముఖం—కొంత దూరానవున్న శిథిలాలయాభిముఖమై వున్నది. గుడిలో నుండి హఠాత్తుగా బయటికి వచ్చిన ఒక మానవాకారం ముళ్లపొదల మధ్యగా కనిపించిందతనికి. రాయప్ప సంశయపూరిత వీక్షణాలతో ఆ ఆకారాన్ని పరకాయించి చూశాడు. ఎవరది?...వాడేనా?...ఔను!...వాడే! చింతమొద్దు! బిచ్చగాళ్ల ప్రతినిధి !

రాయప్పకెందుకో భయంవేసింది. తన ఆధికృత ఈ సమయంలో పనికిరానిదిగా అనిపించింది. ఈ ముష్టివాడికి తనపట్ల ఎటువంటి అభిప్రాయం వుంటుంది?...సందేహం లేదు...వీడికెవడైనా శత్రువు వుంటే, ఆ శత్రువు తానుతప్ప మరొకరయి వుండరు. వీడికి భిక్షం వేయనీయలేదు తాను. అంతే కాదు. కసిరికొట్టాడు. తిట్టిపోశాడు. ఆ సందర్భా

లలో తాను అవధులులేనంతటి వాక్స్వాతంత్ర్యాన్ని వినియోగించుకున్నాడు. తన ప్రవర్తన వీడి మనస్సులో ఎటువంటి ముద్రవేసి వుంటుంది?...రాయప్ప భయం రెండంతలైంది.

తన యింటిలో తానుండగా—ఎన్నయినా అన గలడు, ఏమయినా చేయగలడు. అదిస్థానబలిమి! ఇక్కడ తాను జలాశయం వీడివచ్చిన మొసలివంటి వాడు. ఈ ముష్టివాడు తననిచూస్తే, తనదారిన తాను పోతాడా?...ఏమో!...తిడతాడా?.. కొట్టకుండా తిట్టినా ఫరవాలేదు. కొడతాడా?...గోయితీసి పాతి పెట్టకుండా, కొట్టిపంపినా ఫరవాలేదు. రాయప్ప భయం మూడంతలైంది.

ఈ గుట్టమీద—పొదలచాటున—బండలచాటున వీడు ఏమి చేయాలనుకున్నా, నిర్విఘ్నంగా, నిరా టంకంగా చేయగలడు. తాను వీడి దృష్టిలో పడే లోపున ఇక్కడినుండి వెళ్లిపోవాలి. గుట్టక్రింది కాలి బాటను చేరుకోగలిగినా చాలు. బ్రతికిపోవచ్చు.

ఆ భయంకరుడి కంటబడకుండా క్రిందికి వెళ్లిపోయే ప్రయత్నం ప్రారంభించబోతుండగా—వాడు రాకూడని దిశగానే రాసాగాడు. ఇక రాయప్ప భయం కొలతకందనిదైపోయింది. తానిక తప్పించుకుపోయే అవకాశం లేదు. వాడి కంటబడకుండా దాగుకోవడం తప్ప గత్యంతరమూ లేదు.

కూర్చునివున్న రాయప్ప లేచాడు. అయితే నిల బడలేదు. పొంచివుండి పిట్టలుపట్టే వాడి భంగిమ అది. రాయప్ప నాలుగైదడుగులు వెనక్కిపోకాడు. ఒక పెద్దకొండరాతిని చాటుచేసుకున్నాడు ..వాడు వస్తున్నాడు! తనని చూశాడా?...అతడు మరికొన్ని అడుగులు వెనక్కువేశాడు. గోడలకు మల్లే నిట్ట నిలువుగావున్న రెండు బండలమధ్యకు వచ్చాడు. ఒక్క క్షణం శ్వాసతీసుకుని, బండచాటునుండ తొంగి చూశాడు. వాడు వస్తున్నాడు! రాయప్ప మరి రెండడు గులు వెనక్కి నడిచాడు. మూడో అడుగుకి నేల అందలేదు.

* * *

రాయప్పకు నడుము పట్టేసింది. ఎడమకాలు బెణికింది. కుడిమోకాలు డోక్కుపోయింది. మూలు గుతూ చిన్నగా లేచి నిలబడ్డాడు. తాను ఒక రాతి గోతిలో పడిపోయాడు! రాతిగోడ నానుకుని నిలబడి చేయి పైకెత్తాడతను. అంచు అందలేదు. మూరె డెత్తు పైకి గెంతగలిగితే, అంచును అంది పట్టుకో వచ్చు!

ముష్టివాడు ఊహలో మెదిలాడు. వస్తూన్న మూలుగును దిగమ్రింగాడు రాయప్ప. తన మూలుగు వాడు వింటే యింకేమైనా వుందా? బోనులో చిక్కు కున్న ఎలుకను బోనుతోబాటుగా నీళ్లల్లో ముంచి నట్లు తయారవుతుంది తన స్థితి.

నిశ్శబ్దంగా, నిశ్చలంగా అరగంట గడిపాడు రాయప్ప. ఆకు అల్లాడినా, పిట్ట కూతపెట్టినా అదిరి పడుతున్నాడు. ముష్టివాడు తనని చూడకుండావుంటే ఫరవాలేదు. చూచివుంటే, ఇక ఏం జరుగుతుంది?... తనకోసం వాడు పరిసరాలంతా వెతుకుతూ వుంటాడా?

భయవిహ్వలమైన ఈ ఊహలతోనే రాయప్ప తానున్న గోతిని పరిశీలించసాగాడు. అదొక రాతి దొన. లోతు సుమారు తొమ్మి దడుగు లుండవచ్చు. దొన మూడు వైపులా అట్టడుగునుండి రాయి పైకిలేచి పైకప్పులా వాలి వుంది. తాను ఏవైపునుండి పైకి ఎగబ్రాకినా, నాలుగోవైపునుండే బయటపడాలి.

సంధ్య అంతరించిపోతున్నది. మసక చీకట్లు ముసురుకుంటున్నాయి. పిట్టల కూతలతో చెవులు గింగుర్లెత్తిపోతున్నాయి.

ముష్టివాడు తనని చూసివుండడు. వాడెటో వెళ్లిపోయివుంటాడు. ఇక తాను తన యావచ్ఛక్తినీ ఉపయోగించి గట్టున పడాలి. రాయప్ప పైకెక్కడానికి ప్రయత్నించాడు. ప్రయత్నం ఫలించలేదు. చేతులకు పట్టు దొరకడంలేదు. రాతిగోడలమీద చేతులు, కాళ్లు జారిపోతున్నాయి. చేతికందిన మేర ప్రతి అంగు ళాన్ని తడిమి, పట్టు దొరకక—దొరికినా పైకెగ బ్రాకలేక—రాయప్ప దిగులు పడిపోయాడు. ఈ శ్రమలో అతని ఒంటినొప్పులు కూడా యినుమడించాయి.

ఆశ నిరాశ చేసుకుని, ఇరుసు విరిగిపోయిన బండిలా కూర్చుండిపోయాడు రాయప్ప.

చీకట్లు క్రమ్ముకున్నాయి. ఈ గోతిలోనుండి బయటపడటం యిక తన శక్తికి మించిన పని. ఆ పని

ఎవరైనా వచ్చి చేయాలి. తానిక్కడున్న సంగతి ఎవరికి తెలుసు? ఇక్కడినుండి తాను కేక పెట్టాలి. ఈ చీకటిలో ఈ గుట్టమీద ఎవరుంటారు? ఒక వేళ ఆ పాడుబడిన గుడివద్ద ముష్టివాడున్నాడేమో?

రాయప్ప కేక పెట్టలేదు. అవనతశిరస్కుడై కూర్చున్నాడు. తెల్లవారాక, మేకలకాపరులో, కట్టెలేరుకునేవాళ్ళో—యిలా, ఈ గుట్టమీదికీ రాకపోరు. అంతవరకూ తనకీ దురవస్థ తప్పదు. దొనలో శిలాతల్పంమీద శయనావస్థలోకి వాలిపోయాడతను. ఆకలి—సమస్యగా పరిణమించి అతన్ని పీడించసాగింది. తాను ఏనాడూ నిరాహారంగా వుండలేదు.

గంటలు గడిచిపోతున్నాయి. దొనలో కటిక చీకటి తనకు తోడైంది. తనలో మిగిలివున్న ఆశలా మిణుకుమిణుకుమంటూ ఆకాశంలో ఒక్క నక్షత్రం మాత్రం కనిపిస్తోంది. అతన్ని పీడిస్తున్నవి ఒకటి గాదు. ఆకలి పేగుల్ని కాల్చివేస్తోంది. గాయాలు శరీరాన్ని బాధిస్తున్నాయి. తన కిక విముక్తి లేదేమోనన్న నిరాశాభావం హృదయాన్ని కృంగదీస్తున్నది. ఏవేవో అనుమానాలు, భయాలు మనస్సులో ముప్పిరి గొంటున్నాయి.

నడిరేయివరకు అతనికి నిద్రలేదు. ఆ తరువాత అది—వర్షారాత్రిలో విద్యుద్దీపాల్లా రాకపోకలు జరిపింది...వాడు వచ్చాడు! దొనలోకి తొంగి చూశాడు! రాళ్ళ దొర్లిస్తున్నాడు! తట్టలతో మట్టిత్రవ్వి పోస్తున్నాడు! తాను సజీవంగా సమాధై పోతున్నాడు!... రాయప్ప కెవ్వుమన్నాడు. ముష్టివాడూ లేడు, మట్టిగడ్డలూ లేవు. గాలికి కొన్ని ఎండుటాకులు కొట్టుకొచ్చి తనమీద పడ్డాయి.

చీకటి కౌగిట్లో కూర్చున్న రాయప్ప మసక వెలుగుల్ని చూశాడు. పిట్టలకూతలు విన్నాడు. తెల్లవారడంకూడా చూశాడు. ఎవరో తనకోసం రాబోతున్నట్లు, వారికోసమే తాను ఎదురు చూస్తున్నట్లు మాటిమాటికి తలపైకెత్తి చూడసాగాడు. ఎవరూ రాలేదు. మనుషుల అలికిడైనా వినిపిస్తుందేమోనని చెవులు రిక్కించి విన్నాడు. అతని చెవులు అప్పటికే పనిచేయడం మాని వేశాయి. పైకి ప్రాకటానికి మరో సారి ప్రయత్నంచేసి విఫలుడై, కుప్పకూల పోయాడు.

ప్రొద్దు పైకెక్కుతూన్న కొద్దీ, అతని నాలుక దాహంతో పిడుచగట్టుకు పోతోంది. ఆకలితో కడుపు మాడిపోతున్నది. చూపు మందగించి పోతున్నది. ఈ ఆకలి మంటను మించిన యాతన మరొకటి లేదు!...ఏమైనా కానీగాక!...ముష్టివాడు వచ్చినా రానీగాక....రాయప్ప బిగ్గరగా కేకలు వేయడం ప్రారంభించాడు. ఆ కేకలు ప్రపంచమంతటా వినబడి వుంటాయనుకున్నాడతను.

రాయప్ప అలసిపోయాడు. విసిగిపోయాడు. కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకున్నాడు. ఈ పొట్టకోసం అన్ని జాగ్రత్తలూ తీసుకున్న తానుకూఆఖరికి గోతిలో పడిపోయాడు. తనకు కావలసింది గ్రుక్కెడు నీరు, పిడికెడు అన్నం...

అతడి కళ్ళు మూసుకుపోయాయి.

* * *

గుట్టమీద గోతిలో రాయప్ప కేకలు పెడుతూన్న సమయంలో—ముష్టివాడు చట్టి చేతబట్టుకుని పురవీధుల్లో నడయాడుతున్నాడు.

వాడు ఆ ఊరిలో భిక్షాటనం ప్రారంభించి యింకా మూడునెలలు పూర్తికాలేదు. వాడికి ఒక్కపూటైనా అన్నంపెట్టని యిల్లు ఆ ఊళ్ళో ఒక్కటే వుంది. ఎప్పుడూ వాలుకుర్చీకి అతుక్కుని కూర్చునే ఆ పుణ్యాత్ముడికి ముష్టివాళ్లను తిట్టే తరమడమే ఉద్యోగంలా గుంది! దేవుణ్ణి వాడు కోరుకునేదొక్కటే! మరుజన్మలో తాను ఆవాలు కుర్చీలో కూర్చోవాలనీ, అతనికింత ముష్టివెయ్యాలనీ!

ఆ యింట్లో అన్నం పెట్టించుకోలేక విసిగిపోయాడు వాడు. ప్రతిసారీ లేదనిపించుకోవడం, తిట్లు తినడం—వాడికి నామోషీగా అనిపించింది. ఇక ఆయింటి ముందర నిలబడ కూడదనుకున్నాడు.

సూర్యుడు నడినెత్తిన ప్రకాశిస్తూండగా—ఆ యింటిని సమీపించాడువాడు. అక్కడ ఆగకూడదనుకున్నాడు. ముందుకు వెళ్లిపోతూ ప్రక్కకు తిరిగి చూశాడు. ఆశ్చర్యం! వాలుకుర్చీ అయితే వుందిగానీ, అందులో రాయప్పగారు లేరు! వాడిలో ఆశ మోసు

లెత్తింది. ఈ యింటికూడు తినేప్రాప్తం తనకు వుందేమో!

'పట్టెడన్నం పెట్టుతల్లీ!'

వసారాలోనే స్తంభాని కానుకుని విషాద వదనంతో నిలుచున్న ఆ ఇంటి ఇల్లాలు ఆ కేకకు తలెత్తి చూచింది. ఒక్కసారి దీర్ఘంగా నిటూర్చి, ఇంట్లోకి వెళ్లి, కొంత అన్నమూ, కూరాతెచ్చి వాడి చట్టిలో వేసింది.

వాడు కుతూహలాన్ని అణచుకోలేక 'అయ్యగోరెక్కడమ్మా?' అని అడిగాడు, యుగయుగాల బంధువులా.

'ఏమో నాయనా! నిన్నసాయంకాలం వెళ్లారు ఊళ్లో ఎవరింట్లోనూ లేరు..ఎక్కడి కెళ్లారో, ఏమో?...'

వాడు ఏమో చెప్పబోతున్నట్లు నోరు తెరిచాడు. అయితే ఏమీ చెప్పలేదు...ఆయన నిన్న సాయంకాలం గుట్టమీద తనకు కనిపించాడు. ఎలా కనిపించాడో అలాగే మాయమైపోయాడు. ఇంటికి రాకపోతే—ఊళ్లో ఎవరింట్లోనూ లేకపోతే—మరెక్కడుండాలి?

ముష్టివాడు గిరుక్కున వెనక్కి తిరిగాడు.

* * *

ముఖంమీద చిలకరింపబడిన నీటి చల్లదనానికి గోతిలోని రాయప్ప మెల్లగా కదిలాడు. అతని పెదవులు అస్పష్టంగా కదిలాయి. నీళ్లముంత అతని పెదవుల్ని స్పృశించింది. రాయప్ప గుటగుటా నీళ్ళు త్రాగాడు. మెల్లగా లేచికూర్చున్నాడు. అతని కళ్లకు మసక మసకగా అన్నం కనిపించింది. గబుక్కున చట్టి చేతి కందుకుని, ఆనందంతో పిచ్చివాడిలా నవ్వుకున్నాడు. ఆ వురావురుమంటూ అన్నం నోట కుక్కుకున్నాడు. రెండుముద్దలు దిగమింగిన తరువాత గంభీరంగా చుట్టూ చూశాడు. ఊహించనిదేదో జరిగిపోయినంత విస్మయంతో నిశ్చేష్టుడై పోయాడు.

ఎవరు?

ఎవరది ?

నిలువునా కాలిపోయిన చింతమొద్దులావున్న ఆరడుగుల విగ్రహమూ, దిష్టిబొమ్మను తలపింపజేసే తెల్ల గుమ్మడికాయంత తల, గాజు గోళాలవంటి మిడిగుడ్లు, ముంతమామిడి కాయలాంటి ముక్కు, లావుపాటి పెదవులచిూద భయంకరమైన పిచ్చినవ్వు...

రాయప్పకళ్ళు భీతితో సంచలించాయి. పెదవులు వణికాయి.

హడలెత్తించే పిచ్చినవ్వులతో తన ప్రక్కనే కూర్చునివున్న ముష్టివాడు బిడ్డను బుజ్జగించే పిశాచంలా పెదవి విప్పాడు.

'తినండయ్యగోరూ! ముష్టోణ్ణి సూస్తే, ముష్టికాయ తిన్నట్టుందా? దేముడుచేసిన ముష్టోణ్ణి కాదు బాబూ నేను. మణిసిజేసిన ముష్టోణ్ణి! నాకడుపు మిూద కొట్టినోళ్ళు మణుసులే!...కట్టుకున్న ఆడది మట్టిలో గలిసిపోయింది...కడుపున బుట్టినోళ్లు కడుపు సేతబట్టుకుని కాకుల్లా సెదిరిపోయినారు. మిగిలింది, నేను. మారాజుకైనా, ముష్టోడికైనా జానెడు పొట్టే గదా బాబూ; జానెడుపొట్టకు పట్టెడు మెతుకులు సాలు! ఈ పట్టెడు మెతుకుల కోసరం నేను—ముష్టెత్తు 'కుంటున్నానుగానీ, యింకే పాపమూ సెయ్యలేదే!...

ముష్టివాడి కళ్ళలో కన్నీళ్ళు!

'తినండయ్యాగోరూ! అట్ల జూస్తారేం నా వంక? నన్ను మిూ రెరగర్లేండి. మిూరు మాత్రం నా కెరికే! ఇరవయ్యేండ్లుగా నేన్నమ్ముకున్న మూడెకరాల పొరం కోకును—లంచం తీసుకుని—మా వూళ్లో మోతుబరి పరంజేసింది మిూరే కదా!...మణిసి తినేది మెరుగు బంగారం కాదు బాబూ! పట్టెడు మెతుకులే! తినండయ్యగోరూ, తినండి!'

రాయప్ప కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి.

ఆర్యవైశ్యుల శాసనాల్లో "మైలారదేవర" ప్రసక్తి

శ్రీ తురగా కృష్ణమూర్తి

ఆర్యవైశ్యులుగా పేరందిన మూటయిబ్బంద్రు గోత్రములవారికి 'నగరేశ్వరుడు' ఇలవేల్పు. 'వింధ్యవాసిని' నగరేశ్వరునిదేవి. 'కన్యక' ఆర్యవైశ్య కులజుల కెల్ల నారాధ్యదేవత. ఈ వైశ్యులు తమ బేరసారముల కొనసాగించుటకు దేశము నలుమూలల పర్యటించు సందర్భములలో నాయాప్రదేశములలోగల శివ, కేశవాలయముల దర్శించి, పూజాదికముల నిర్వర్తింపుచు, యోపినంతవరకు దాన, ధర్మముల నొనరించి, శాసనాదికముల నిలిపి యున్నారు. అట్లు నిలుపుటలో వారు తమ వంశాదిక ప్రసక్తుల నుట్టంకించుచు, తా మొనరించిన దాన వివరముల నుల్లేఖింప జేసియున్నారు. ఆర్యవైశ్యులు సందర్శించిన దేవాయతనములలో నెక్కుడుగా శైవ సంబంధములగు దేవళములే కాన్పించుచున్నవి. వైష్ణవ సంబంధములగునవి సక్కుతుగా గాననగుచున్నవి. యిందులకు కారణము—వా రెక్కువగా శైవ మతానుసారులగుటయు వారి యిష్టదైవము 'నగరేశ్వరు' డగుటనై యుంటయు నని నా యభిప్రాయము.

తాము సందర్శించిన క్షేత్రములలో నార్యవైశ్యులు తమ శక్తికొలది దానముల నొసంగి వ్రాయించిన కొన్ని శాసనములలో నొక విచిత్రాంశ ముట్టంకింపబడుట దృశ్యమానమగుచున్నది. అది శివాలయముగానిందు, విష్ణ్వాలయముగానిందు, ఆర్యవైశ్యు లిచ్చిన శాసనములలో 'మైలారదేవర' ప్రసక్తి కనబడుచున్నది. ఇట క్రింది కొన్ని శాసనముల నుదహరించి వాని పరామర్శ నావల చేయ యత్నింతును.

(1) గుంటూరుజిల్లా, గుంటూరు తాలూకా, ఎనమదల గ్రామమందు శ్రీ రామస్వామి దేవళమున నొక శిలాస్తంభముపై చెక్కబడిన శాసనము :

స్వస్తిశ్రీ శక వరుషంబులు 1310 అగు నేం
టి విభవ సంవత్సర మా[ఘ] శు 5 గునాండు
మకర మాస పుణ్యకాలాన నగరేశ్వర దేవ
దివ్య శ్రీపాద పద్మారాధకుండును పె[ను]ం
గొండ పురవరాధీశ్వరుండున్నూ వెనుకోల
గోత్ర పవిత్రుండును వైశ్యకులోత్తముండు
ను నైన కొండమల్లు తమ తం[డ్రి]
పెద్దిశెట్టికిన్ని త
మ తల్లి అన్నసానికిన్ని పుణ్యముగాను [మూ]
లస్థానం మైలార దేవరకు రంగ మ
[ధ్య]ము కంభము సేయించి అఖండ
దీపానకు మొదవులి
చ్చెను [1] మంగళమహా
శ్రీ శ్రీం జేయు [ను]

(2) గుంటూరుజిల్లా(తాలూకా) గుంటూరు పట్టణమందు అగస్త్యేశ్వరాలయమున నొక శిలాస్తంభముపైన చెక్కబడినది. శా॥ శ॥ 1310.

స్వస్తి. శ్రీ శుభశక వరుషంబులు 1310 అగు
నేంటి విభవ్య సంవత్సర మాఘ శు 5 గు నాం
డు మకర మాస పుణ్యకాలాన నగరేశ్వరదేవ ది
వ్యశ్రీపాద పద్మారాధకుండును [పె] నుంగొం
[డపు[రవరాధీశ్వరుండును, పునగోసిలగోత్ర
[పవి] త్రుండును వైశ్యకులోత్తముండు
[న్నూ]...నై

......కలాం...గంగిశెట్టి తమతండ్రి వల్లభిసెట్టికి
న్ని తమ తల్లి పోతసానికిన్ని పుణ్యముగాను [కొ]
ండేశ్వ [రి] మూలస్థా [న] ము మైలారదేవరకు ర
ంగ మధ్యము కంభముసే ఇంచ్చి—అఖండ దీప
నకు మొద [వు] లు 5 [ం] మంగ[ళ] మహాశ్రీ
[శ్రీశ్రీ]

(3) నర్సారావుపేట తాలూకా, గుంటూరు జిల్లా, కొండవీడు గ్రామమందలి యొక మసీదులో మూడవ స్తంభముమీదను, నాలుగవ స్తంభము మీదను వేర్వేరుగా (రెండుగా) చెక్కబడియున్నవి.

స్వస్తి. శ్రీ శుభ శక వర్షంబులు 1332 అగు
నేంటి మ
న్మథ సంవ్వంత్సర ఫాల్గుణ శు 13 సో [1]
కొండవీటి మూల [స్థా]
నము మైలార దేవర మధ్య రంగము కంభము నగరే
శ్వరదేవది [వ్య] శ్రీపాద పద్మారాధకుండ్డును పెనుం
గొండ పురవరాధీశ్వరుండ్డును వైశ్యకులోత్తముండు
ను వెనుమకొల గోత్ర పవిత్రుండునైన కొండ్డ
ప్రోలు స [వ్వి]న్
సెట్టి తమ తండ్రి ప్రోలుసెట్టికి [న్ని] తమతల్లి
[చిట్టి] సా [ని]కిన్ని
పుణ్యముగాను మధ్యరంగము కంభము
చేయిం[చ్చి]ఎత్తించెను [2×] శ్రీశ్రీశ్రీం జేయు.

పై మూడు శాసనములను విమర్శనా దృష్టితో వీక్షింతుమేని, మూడు ముఖ్యాంశములు గోచరమగును.

(1) దాతలు ముప్పురున్ను పెనుగొండ పురవరాధీశులే !

(2) ముప్పురున్ను నగరేశ్వరదేవ దివ్యశ్రీ పాద పద్మారాధకులే !

(3) ముప్పురున్ను వేర్వేరు మతములకు చెందిన మూడు పవిత్రదేవ మందిరములలో తమ శాసనముల నిల్పిన వారలే!

(అనగా నొకరు విష్ణ్వాలయములోను, వేరొకరు శివాలయములోను, యింకొకరు తురకమసీదులోను తమ దానప్రదానముల శాసనస్థము గావించిన వారలన్నమాట)

ఈ విషయములే కొంత వింత గొల్పుచుండ నిందుట్టంకింపబడిన 'మూలస్థానం మైలారదేవర' ప్రసక్తియొకటి వింతలలోకెల్ల వింతగా చూపట్టుచున్నది!

పెనుగొండ పురవరాధీశులు ముప్పురు నార్య వైశ్యోత్తములు. నగరేశ్వరస్వామి దివ్యపాద పద్మారాధకులు. వారికి నగరేశ్వరుడు కులదైవము. అట్లగుట శైవ సంబంధములగు సంస్థలకే వారెక్కుడుగా దాన ధర్మముల నొనరించుట సర్వసాధారణము. అట్లని వైష్ణవమతమునందు వారు సహనము లేనివారని నిర్ధరింపజనదు. నగరం వారిలోకూడ వైష్ణవమత సాంప్రదాయ మనుసరించు వారలు గలరు. వారు శ్రీ జనార్దనస్వామిని యర్చింతురు. అయిన నిట నగరేశ్వరుని పాదపద్మారాధకుల మన్నవారు, యనమదల లోని శ్రీ రామస్వామి దేవళములో దానశాసనము నిల్పుచు, నాదేవునకుగాక మూలస్థానం మైలార దేవర కఖండ దీపమునకై మొదవుల నర్పించిట్లు శాసనమును వ్రాయించిరి. అట్లనే గుంటూరులోని అగస్త్యేశ్వర స్వామి దేవళములో దానశాసనము నిల్పుచు, నా దేవునకుకాక కొండేశ్వరి మూలస్థానం మైలారదేవరకు అఖండదీపమునకై మొదవు లర్పించినట్లు శాసనము ను వ్రాయించిరి. 'శివాయ విష్ణురూపాయ—శివరూపాయ విష్ణవే'యను యభేధ భావముననట్లు చేసినారని సమర్థించు కొందమన్న యట్లిచ్చినది విష్ణునకుగాక, శివునకుగాక 'మైలారదేవునక'ని స్పష్టమగుచున్నది. ఇంత కంటె విడ్డూరమైన విషయము కొండవీడులోని మసీదులోవారు వేయించిన దాన శాసనము! తురకల ప్రార్థనా మందిరమున నగరేశ్వరస్వామి పాదపద్మారాధకులమను ఆర్యవైశ్య శిఖామణులు తురకల దైవమునకు గాక కొండవీటి మూలస్థానం మైలారదేవరకుమధ్య రంగము కంభమెత్తించుటనెట్లు సమర్థింపవలెనో? ఒకవేళ మహమ్మదీయులు హిందూ దేవాలయముల

ధ్వంస మొనర్చి వాని శిలలతో నీ మసీదును నిర్మించి యుండి యుందురనుకొన్న, కాఫిరులదైన ప్రసక్తి యున్న యీ శిలను పరిహరించి, వేరొక దాని నుప యోగింపక నా తురకలెట్లు తమ మసీదును కట్టుకొనిరో? అంతమాత్రముచేత నిది శంకా కులితమైనదనుట చెల్లదు. ఏమందురా?—చతురక్షర సంయోగముగానీ శాసనము మన కండ్లెదుట తురకల మసీదులో నొకటి గాదు రెండు స్తంభములపై చెక్కబడి, ప్రత్యక్ష సాక్ష్యముగ నిలిచియున్నది. యిట్టివి క్రొత్తలు గావు! తురకల మశీదులో నాగరశ్రేష్ఠులు మైలారదేవునకు మధ్య రంగమున కంభదానము సేయుట, యీవృత్తాంతము శాసనస్థమై తురకల ఆమోదభాగ్యము నంది యలరుట కడుంగడు చోద్యము!

మిత్రులు శ్రీ జి. ఆర్. వర్మ (తాడేపల్లి గూడెం)గారీ మధ్య 'మైలారదేవ' యను నొక గ్రంథ మును వ్రాసి ప్రచురించినారు. అందు వారు గావించిన పరిశోధనా ఫలితముల నక్షర రూపమున వెలువరించి నారు. ఈ మైలారదేవుని పుటు పూర్వోత్తరముల, నేయే రూపమున నేయే స్థలముల నర్చన లందుకొను చున్నది, యీ దేవునకు ఖండఖండాంతరములలో గల వివిధ సారూప్యదేవతల ప్రశంస, అర్చనా విధానము. ప్రజానీకములో వారియందుగల భక్తిప్రపత్తులు మొద లగు వివిధ విషయముల నుల్లేఖించియున్నారు. అయితే— మైలారదేవుని ప్రసక్తి కాకతీయుల పాలనా కాలములో నెక్కువ ప్రచారములోనికి వచ్చినట్లు తెలియనగు చున్నది. వల్లభామాత్యుని 'క్రీడాభిరామము'లోనీ 'మైలారదేవుడి'ట్లు వర్ణింపబడినాడు.

సీ. శనివారసిద్ధి సజ్జన పారిజాతంబు
వరదాత యాదిత్యవార భోగి
మాడచీ రమణుండు మాయావినోదుండు
మాళవీ ప్రియభర్త మహితయశుడు
పల్లెంబ నాయకుం డెల్ల వేల్పుల రాజు
గినపవేటల వేడ్కకాండ్రడ భర్త
కత్రశాలస్వామి కరుణాపయోరాశి
పుణ్యకీర్తనుడైన ప్రోలియయ్య

గీ॥ మంచుకుంచాల గొలువంగ మాయలేళ్ల
బట్టికట్టంగ నేర్చిన బాసవెల్లి
భైరవుని తోడి జోడు మైలారదేవు
డోరుగంటి నివాసి మేలొసగు గాత.

ఈ మైలారదేవుని యుత్సవ విశేషములను గూడ నా గ్రంథ మిట్లు వర్ణించుచున్నది:

సీ. అవటువమందు నెట్టని చంద్రమల్లెల
చోద్యంపు గుండాలు చొచ్చువారు
కరవాడియలుగును గినప పాతర్లలో
నుట్టిచేదులుగోసి యురుకువారు
గాలపుగొంకి గంకాళ చర్మము గ్రుచ్చి
యుడువీధినయ్యల లూగువారు
కటికి హొన్నాళంబు గండకత్తెర వట్టి
మిసిమింతులునుగాక మ్రింగువారు

గీ॥ సందులను నారసంబులు సలుపువారు
యెడమ కుడిచేత నారతు లిచ్చువారు
సాహసము మూర్తిగైకొన్న సరణివారు
ధీర హృదయులు మైలార వీరభటులు॥

గీ॥ వీరు మైలార దేవర వీరభటులు
గొండ్లి యాడించుచున్నారు గొరగపడుచు
నాడుచున్నది మూర్ధాభినయము
తాను నెట్టిక సీలంతగాని లేదు॥


మైలారుభటు లొనర్చు వీరకృత్యములు బస వేశ్వర ప్రతిపాదిత వీరశైవ మతావలంబులగు మాహే శ్వరభక్తులు తమ భక్తిని ప్రదర్శించుటకుగా నొన రించుకొను అంగచ్ఛేదన, కుక్షిచ్ఛేదన, నేత్రోత్పాట నాది వీరకృత్యముల కుద్దికలై కానుపించుచున్నవి! కాకతీయుల రాజ్యకాలమునాడే యీ బసవేశ్వరమతము కడువ్యాప్తినొంది, పైన పేర్కొన్న సాహసకృత్యముల ప్రదర్శన కాలవాలమైనట్లు తెలియుచున్నది. ఆ కాల ముననే వీరారాధనముకూడ వ్యాప్తిలోనికి వచ్చెను. జన సామాన్యములో వర్ణభేదము నశింపజేసి ప్రచారమునందిన వీరశైవ, వీరవైష్ణవ మతములా కాలములోనే ప్రవ ర్తిల్లినవి. ప్రజాసామాన్య మెక్కుడుగా నేకవీర, మైలార

దేవ, భైరవ, చమడేశ్వరి, వీరభద్ర, బౌద్ధ, కుమార, మసానమ్మల పూజల బహుళముగా నభిమానించి, నిర్వర్తించుచూ వచ్చినది.

ఆర్యవైశ్య కుటుంబినుల కిష్టదైవమైన 'కన్యక' యగ్నిప్రవేశ కాలమున విష్ణువర్ధనుని యకృత్యము గర్హించి, కోమటుల విశుద్ధవర్తన నీతినియములకు సమ్మోహితులై తమ ప్రభుని కొలువు విరమించి వైశ్యులపక్షముచేరి, పోరాడిన విష్ణువర్ధనుని వీరభటులను మైలారులని, వీరముష్టులని యిప్పటికినీ వైశ్యులు గౌరవించి, పూజించుట కాననగుచున్నది. కాకతీయులనాటి మైలారులకు, వీరముష్టులకు 'కన్యక' యగ్నికుండ ప్రవేశమునాటి మైలారులకు, వీరముష్టులకు గల సంబంధమేమియో తెలియరాకున్నది. అటులనే నాటి 'మైలారదేవరకు' పైన యుదహరించిన శాసనములలోని 'మూలస్థాన మైలారదేవర'కు గల సంబంధము కూడ నెరుగ రాకున్నది.

మైలారదేవుడు గౌరవల దైవమని శ్రీ జి. ఆర్ వర్మగారు నిశ్చితార్థము చేసినారు. పలుతావుల, పలు విధములుగా నీత నారాధించు జాతుల వర్ణించినారు. అయితే—మైలారదేవునకు నార్యవైశ్య కులమువారికి గల సంబంధ మేమియో తెలుపలేదు. మైలారదేవుడు వైశ్యజనారాధ్య దైవమని యెక్కడను విననట్లు లేదు. వారు నగరేశ్వరుని పాదపద్మారాధకులు. కన్యకా పరమేశ్వరి భక్తులు. అగుచో—పై శాసనములలో వైశ్యులు 'మూలస్థాన మైలారదేవర' ప్రసక్తి నెందులకు తెచ్చినట్లు? అందునా—శైవ, వైష్ణవ, మహమ్మదీయ దేవ మందిరములందు నిల్పిన శాసనములలో నా దేవునకు గల సంబంధ మెట్టిదని?

ఈ విషయము పరిశోధనీయము. పండితులు వివరముగా చర్చించి, యిందలి యాదార్థ్యమును వెలువరింతురు గాక!



శ్రీ వేంకటేశ స్తవమ్

(తోటకవృత్త స్తబకమ్)

శ్రీ యామిజాల పద్మనాభస్వామి

అరుణారుణకాంతుల నష్టదిశల్
మెరుగెక్కెను శ్రీపతి ! మేల్కొనవే !
అరుదెంచిరి దేవతలందరు నీ
చరణాంబుజ పూజలు సల్పుటకై

వికసించెను తామరవేయికనుల్
ప్రకటించెను భానుడు భవ్యరుచుల్
శుకభాషణ పోషణ సూక్తులతో
సకలర్షులు వచ్చిరి సామి ! కనన్

చతురానన సుస్వర సంస్తుతులన్
మితభాషిణి శారద మేల్కొలుపన్
కృతకృత్యులజేయగ కింకరులన్
స్మిత సుందరభాషణ ! మేల్కొనవే !

చిరునవ్వుల పువ్వుల చెల్వముతో
మురిపెమ్ముల పల్కుల ముచ్చటతో
అరుదెంచిన వారల నాదుకొనన్
విరిసెజ్జను వీడవె విశ్వవిభూ !

హరిచందన రమ్య లతాంతములన్
హరి నీ పదపద్మము లాదృతిమై
పరిచర్యలు సల్పగ వచ్చె నికన్
విరిసెజ్జను వీడవె విశ్వవిభూ !

వరుణుం డరుదెంచె సువర్ణఘట
స్ఫురదబ్ధిజలమ్ములు పూని జగ

చ్ఛరణా! అభిషేకము సల్పుటకై;
విరిసెజ్జను వీడవె విశ్వవిభూ!

ధనదుండిడె సత్పరిధానములన్
కనకాభరణమ్ముల గైకొని నిన్
మనసా కయిసేయ నుమాపతితో
చనుదెంచెను లే! వృషశైలపతీ!

సురకిన్నర పన్నగ సుందరులున్
పరిచర్యలు సల్పగ వచ్చిరిదే;
కరుణింపవె సేవలు కైకొనవే
విరిసెజ్జను వీడవె విశ్వవిభూ!

రవిసోమ విలోచన! రమ్యగుణా!
స్తవనీయ లసచ్చరితా! జనతా
భువనావన! విశ్వవిభూ! నృహరీ!
మిముల న్నుతియించెద మేల్కొనవే!

శ్రుతిభూషణ తోటక సూనములన్
మతిమెచ్చగ కూర్చితి మాలికగా
అతిభక్తి నొసంగతి నా ధృతితో
స్మితసుందర భాషణ! చేకొనవే!

(నా వేంకటేశ్వర సాహస్రి నుండి)

ఉత్తర హరివంశము - పాఠ పరిష్కారము

శ్రీ టి. పి. భాష్యకారాచార్యులు

నాచన సోమనాథుని ఉత్తర హరివంశము 1918 నుండి నేటివరకు పలుముద్రణములనందిన యుద్గ్రంథము.

'ప్రాచీనాంధ్ర కవి కృతులలో దురవబోధము లనఁబడు వానిలో సోమనాథుని కృతి ప్రధానమైనది. అప్రతీత పదప్రయోగ బహుళమైన ఉత్తరహరివంశము నెన్నిమారులు చదివినను పూర్తిగా నర్థము గాని పద్యములింకను మిగిలియే యుండును.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారిచే సంస్కరింపఁబడి ముద్రింపబడిన తరువాత నుత్తర హరివంశ మెన్నిమారు లచ్చొత్తింపఁబడినను పాఠాంతరము లేవియు నిర్ణయింపఁబడలేదు.

ఉత్తర హరివంశమునం దసాధారణ కవితా ప్రాగల్భ్యముచేత సోముఁడే, పాఠకుని ముప్పుతిప్పలు పెట్టుచుండ నిఁక దీనియందీ లేఖక ప్రమాదములు, పాఠాంతరము, సంస్కరణములు చేరి యింకను కవి హృదయమును దెలియనీయక పుస్తకమునందలి పద్యము లచ్చటచ్చట నగాధములవలె కానవచ్చుచున్నవి. కొన్ని తావులందుఁ పద్యములు సుబోధములయ్యు నన్వయము నందో యర్థమందో క్లిష్టత గోచరించుచున్నది—అని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారు ప్రకటించిన పీఠికలో చెప్పబడినది. (పీఠిక. పుట 49)

సుమారు 1918 నుండి యిప్పటి దనుక పలుమారులు ముద్రితమయిన యీ గ్రంథమున కొన్ని పట్టులలో చక్కని పాఠములు అధోజ్ఞాపికయందు ప్రదర్శింపబడినది. వానిలోఁ గొన్నిటిని ప్రధానముగా పాఠాంతరముగా చూపదగినవి ప్రధాన పాఠములయినవి.

అకాడమీవారు ప్రకటించిన ఉత్తర హరివంశము పీఠికలో సంస్కృత హరివంశమును మూలముగా చూపి కొన్ని పద్యములను మాత్రము సంస్కరించి ప్రచురించి యుండుటను దెలిపియున్నారు. ఉన్నంతవఱకు మూలముతో పూర్తిగా సరిచూచియే గ్రంథమును ప్రకటించి యుండవలసినది. అంగబలము అర్థబలము గల అకాడమీవారి కది దుస్సాధ్యము కాదు. కాని ఏలనో వారంత శ్రద్ధ చూపరైరి. వారి సంస్కరణమునందలి లోపములను ఎత్తి చూపి మఱి కొన్ని సంస్కరణములను గూడ చూపించుటయే యీ వ్యాస రచనోద్దేశము.

ప్రథమాశ్వాసమునందలి 8 వ పద్యమున

'బలియు నాగాయుత బాహు జగత్ప్రాణ
తనయు గదాకేలి దర్పమడఁచె'

అని కలదు. ఫుట్‌నోటులో 'బాహు' అను చోట 'ప్రాణ' అని పాఠాంతరముగా ప్రదర్శింపబడినది. అదియే ప్రధానముగా గ్రంథ భాగమున నుండదగును. మూలమున

'నాగాయుత బలప్రాణో ।
భీమోభీమ పరాక్రమః ॥

(సం. హరివంశము. విష్ణుపర్వము. 62. అధ్యా. 7 శ్లో)

అని యున్నది. ఎఱ్ఱనయును తన హరివంశమున మూలానుసారముగా

'పదివే లేనుఁగు లంతలావున
భువిం బ్రఖ్యాతుఁడై నట్టి'

(హరివంశము. ఉత్తరభాగము 4 ఆశ్వా. 8 పద్య)

అనియే యీ పట్టున ననువదించియున్నాడు. నాగ+ అయుతం=పదివే లేనుఁగులు. (శతం సహస్రమయుతం) ప్రాణః=లావు ప్రాణో జీవాత్మ పరమాత్మనోః,

ఆయుర్రిన్ద్రియ సత్త్వేషు' (నానార్థ రత్నమాల) అను నర్థమే మూలానుసారి యగును. 'నాగాయుత బాహు' అనుట అర్థవంతము కాదు. మూలానుసారియు నర్థవంతమునగు 'ప్రాణు' పాఠమును పరిహరించి 'బాహు' అను దానిని ప్రధాన పాఠముగా నేల గ్రహించిరో దురూహ్యము. అట్లే

"లోకా లోక నగంబు డింపలకు..." (ప. 133)

అను పద్యమునందు 'నగంబు డింపలకు' అని కలదు. అచట 'డింపలకు' పాఠాంతరములుగా 'డాపలకు' (దెంపలకు) 'డంపులకు' 'చెంపలకు' అని ఫుట్ నోటులో చూపియున్నారు. వావిళ్ల వారును 'డింపలకు' అనియే ప్రధాన పాఠముగా ముద్రించి 'డింపులకు' అనుదానినిగూడ గీత కింద చూపియున్నారు. పాఠాంతరముగా ప్రదర్శింపబడిన 'చెంపలకు' అను దానినే ప్రధాన పాఠముగా గ్రహించిన బాగుండెడిది. ఇందుల కుపబలకముగా నొకటి రెండు ప్రయోగములు.

'ఆది శాక్వరము విహారంబు సలుపు
నీ కొండచెంపల గోవు కోడె వోలె'

(వరాహ పురాణము ఆ. 6. పద్య. 87)

'ఆ బోయవాండును నా పిల్లఁజుట్టిగాఁగొని
పట్టుకొనిపోయి కొండచెంపలఁ జంపువాఁడై'

(భోజరాజీయము. ఆశ్వా. 4. పద్య. 187)

పయి ప్రయోగములనుబట్టి 'కొండచెంపలు' అనునది బహుకవి వ్యవహారమున నున్నమాట అని తెలియును. 'చఱియ' అను నర్థమున 'డింప' అను పదము ప్రయుక్తమయిన దనుటకు పయోగాంతరము చూపట్టదు.

పూర్వ ముద్రణములలో నీ క్రింది పద్య మిట్లు ముద్రింపఁబడి కానవచ్చును.

'కత్తివాతులతో నూరు గాచి తిరిగి
యాడు మురు పాశములఁ గాంచె నాఱువేల
వానిలోని పిశాచముల్ వచ్చివచ్చి
పాదున నన్నింటిఁ దునుకల ప్రోపుచేసె.

(ఆ 1. ప. 140)

1926 లో ముద్రింపబడిన వావిళ్లవారి ప్రతిలో 'మురుపాశముల' అనుటకు 'మురపాశముల' అని ఫుట్‌నోటులో చూపఁబడినది. ఈ పద్యములోని పాదసంస్కరణమునుగూర్చి సుదీర్ఘముగా చర్చించిన సంపాదకులు 'సర్వతంత్ర స్వతంత్రుఁడయ్యు ప్రధాన విషయ నివేదనావసరములందు మూల కారుని దప్పక పాటించుచు రచన గావించుట సోమనాథుని యనువాద విధానము. కావున నీ సందర్భమునందు సయితము నాచనసోముఁడ మూలానుసారియై

'కత్తివాతులతో నూరుగాచి తిరిగి
యాడు మురుపాశముల గాంచె నాఱువేల'

ననియే రచించి యుండును. ఆ పాఠమే వ్రాతప్రతులందుండగా నది లేఖక ప్రమాదముగా భావించి యంత కన్న నెక్కు డర్థవంతముగాఁ దోచునదియు, అక్షరములందంతగా భేదము లేనిదియునగు 'మురుపాశముల'ను పాఠము సంస్కరింపఁబడినది. కాని మూల హరివంశమును జదివిన తరువాత నీ సందర్భమునం దుత్తర హరివంశమునందు సంస్కరింపఁబడిన పాఠము ప్రామాణికము కాదనియు, పాఠభేదముగ నొసఁగఁబడిన తాళపత్రప్రతి పాఠమే సరియైనదనియుఁ దోఁచినది. కావున నీ పూర్వపాఠమే ఈ ముద్రణమునందు గ్రహింపఁబడినది.' (పుటలు 50—51) అని పీఠికలో వ్రాసికొనిరి వీరు 'ఉన్న పాఠము — సంస్కరింపఁబడిన పాఠము—వ్రాత పతి పాఠము అని యుదాహరించిన పట్టు లన్నింటియందును 'మురుపాశముల' అనియే యేడుసార్లును నుదాహరించిరి. ఏది పూర్వపాఠము· పూర్వ సంస్కర్త పొరబడి నిర్ణయించిన పాఠ మేది? మూలానుసారముగా సోమన రచించి యుండునని వీ రూహించిన పాఠ మేది? పూర్వపు సంస్కర్తల మాట యటుండ వీరు నీ పద్యపు పాఠ నిర్ణయమున పొరబడి యుండుట గుర్తింపఁదగియున్నది. మూలమున

'క్షురాంతాన్ మౌంవాన్ పాశాన్
షట్సహస్రాన్ దదర్శహ'

(హరి. విష్ణుపర్వం. అధ్యా. 63. శ్లో. 46)

పూర్వపు ముద్రణములలో (వావిళ్ల 1937) పాఠాంతరముగా చూపఁబడిన 'పాశముల' అనునదియే మూలానుసారియై యున్నయది. అకాడమీవారును దానినే మూలమున ముద్రించిరి. ఇది యెల్ల పయి

పద్యములోని తొలి రెండు పాదములనుగూర్చి మాత్రమే. మూడవ పాదములోని 'పిశాచము'లను గూర్చి వా రేమియుఁ జెప్పరయిరి. పూర్వ ముద్రణములలోని దానిని అట్లే ముద్రించుకొనిరి. 'పాశము రువేలు. వానిలో పిశాచములు' అర్థము కుదురకున్నది. ఇక్కడ నేరెవరును పాఠాంతరమును చూపకుండుటయే పరిష్కర్తలిట నూరకుండుటకు కారణమై యుండ నోపును. ఇంతకు 'పిశాచ' పీడా నివృత్తికి మార్గము లేదా ? కలదు. ఆ పద్య మిట్లుండవలయును

'కత్తివాతులతో నూరుగాచి తిరిగి
యాడు మురుపాశములఁగాంచె నాఱువేల
వారిలోనవు పాశముల్ వచ్చి వచ్చి
పొదువ నన్నింటిఁ దునుకల ప్రోవుచేసె.

పై పద్యములోని యుత్తరార్థమునకు సంబంధించి మూలము ఇట్లు కలదు.

'సంఛిద్య పాశాన్ సర్వాం స్తాన్......'
(హరి. వి. పర్వం. అధ్యా 63 శ్లో. 56)

మూలము ననుసరించి యిట 'పిశాచము'లు అని కాక 'పాశము' లనియే యుండదగును. ఇట పాఠాంతర మేదియు లేకుండుటయు దీనికి మూలశ్లోక మయినను పూర్వార్థమునకు సంబంధించిన శ్లోకము నకు పది శ్లోకములకు తరువాత నెక్కడనో సుదూర మున నుండుటయు కారణములుగా ఇందలి 'పిశాచ ములు' ఏ సంస్కర్తల దృష్టిలోను పడలేదు. మూలము జోలికి పోక తెలుగు పద్యమును మాత్రము చదివిన లేఖకులును సంస్కర్తలును 'పాశముల్' అను దానిని అర్థము కుదురకుండుటచే అర్థవంతమగు నని తలంచి 'పిశాచముల్' అని మార్చుకొనిరి. ఇప్పట్లును మూలానుసారముగ నొనర్చిన ఎఱ్ఱన అనువాదమును, సంవాది రచనమగు పోతన పద్య మును జూచియుండిన సంస్కర్త లిట్లు పొరబడి యుండరు. అవి ఇవి.

'మురదైత్యుచేత నుద్ధర నిజ మాయా బ
లంబునఁ బ్రాగ్జ్యోతిషంబు చుట్టు
నొడ్డంగఁబడి నిశితోగ్ర నిరంతర
గురు ముఖంబులు గల్గి సురభుజంగ
గరుడ గంధర్వాదు లొరసినఁ బేర్చు వి
స్ఫార పాశంబులు బహుసహస్ర
సంఖ్యంబు లొరుల కసాధ్యంబు లాతండు
గావించినవి తీవ్రకఠిన చక్ర
ధార నన్నియుఁదునిమి.........
(హరివంశము. ఉ. భా. ఆ. 4 ప. 132)

'......గరుడారూఢుండై హరిగగన
మార్గంబునం జని...మురాసు
ర పాశ పరివృతం బయిన
ప్రాగ్జ్యోతిషపురంబు డగ్గఱి'
'ధీ ప్రదుఁడై వాలునఁ ద్రుంచెఁ
గృష్ణుఁడు మురప్రచ్ఛన్న పాశంబులన్'
(పోతన భాగ. దశమ స్కం.
ఉత్తర భా. పద్యములు 156, 157.)

పూర్వ పరిష్కర్తలు 'పాశములు = దండు, దండు విడియుచోటులు' అని 'వానిలోనివి పిశాచ ములు' కాని 'పాశములు' కావనియుఁ తలంచి పై పద్య మును సంస్కరించి ప్రకటించి యుండనోపు. కథలకె మూలము గలదని వారు తలంచిరి. పద్యములును మూలానుసారముగ నుండునని వారప్పుడు తలంపలేదు. చూడుడు ఉత్తర హరివంశము పీఠికలో శ్రీ వేటూరి వారు 'మన నాచన సోమన తెల్గు హరివంశమునకు మూలమయిన సంస్కృత హరివంశ మున్నదేమో యెఱుఁగరాదు......మూలమునుండి కొన్ని కథలను మాత్రమే కయికొని...యీ హరివంశము రచించి యుండునని నేను దలఁచుచున్నాడను.'

మూలమును గుర్తించిన ఈ పరిష్కర్త లీ పద్యము నిట్లరకొఱగా సంస్కరించి యేల ప్రక టించిరో తెలియరాకున్నది.

'మఱొక్కచోట

మ॥ అనుచుం గృష్ణుండు వోయినం
బిదప బాణామర్త్యవైరీశ్వరున్
ఘన చక్రాయుధ నిష్ఠురక్షత
గళ దక్స్రార్ద్ర సర్వాంగు న
భ్యను భూతా ప్రతిమ ప్రగల్భ

పరివాగాం తర్హ్వితో ద్వి(క్రముస్
జనితా స్త్రాదిక........వశ్యాత్మనిన్.
(ఉ. హ. ఆ 6. ప. 226)

ఈ పద్యమునందలి రెండవ పాదమున యతి భంగము గానవచ్చుచున్నది. ఈ పద్యమునందీ తావున పాఠాంతరములుగాని సంస్కరణములుగాని చూపింపం బడలేదు. అనన్యసామాన్య కవితా ధురీణుండైన నాచన సోమనాథుండియ్యెడ యతి దోషమును పాటింపక రచించెననుటకన్న నిచ్చటలేఖక ప్రమాదమువల్ల దొరలిన పొరపాటుచే నీ యతిభంగము గల్పింపఁబడినదని తలంచుట లెస్స ఇక నిప్పుడీ పద్యమునందు రెండవ పాదమున ఘన యని యున్నచోట దన యని సవరించి పద్యము ముద్రింప బడినది. దీనివల్ల పద్యమునకు యతిభంగము గలుగక యర్థముగూడ కొంతవరకు తృప్తికరముగనే యలికినది. ఈ సంస్కరణము కుదురనిచో విఘ్నలేదేని యుత్తమ పాఠ మొసంగ ప్రార్థితులు. (అకాడమి వారి హరివంశ పీఠిక. పుట 51) అని ఘనముగ వ్రాసికొనిరి. దీన పరిష్కర్తలు పూర్వపు ముద్రణములను జూడలేదనుట తెలిసి వచ్చినది. ఇప్పట్టును శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యులవారు ప్రౌఢ వ్యాకరణమున 'కొన్నియెడల ప్రామాణిక ప్రయోగంబులం దుత్వంబున కచ్చుపరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి' యను సూత్రమునకు లక్ష్యముగ జూపియున్నారు. అందువారు '......వైరీశు నుద్ఘన చక్రాయుధ...'యని యుదాహరించి యున్నారు. ఉత్తర హరివంశము పూర్వముద్రణములలో గొన్నిట ఈ పద్యపాదమిట్లే గలదు. ముద్రణములు జరుగ జరుగ 'ద్ఘ' లో 'ద' జారిపోయినది. చివరకు మూలమున 'ఘ' మాత్రము మిగిలిపోయినది. వావిళ్లవారు 'రీశునుద్ఘన' పాదమును అధోజ్ఞాపికలో చూపియున్నారు. కాన పరిష్కర్తన 'తన-ఘన' పరిష్కరణమునుగూర్చి వ్రాసికొనినదంతయు నిరర్థకము. ఇంతగ శ్రమించి సోమన రచనముతో యతిభంగము లేకుండ జేసితిమనియెంచిన వీరు పద్యమునందలి మూడవ పాదములోని దోషమునేల గుర్తింపరైరో. పీఠికలో వారుదహరించిన పై పద్యము మూడవ పాదమిట్లు గలదు.

'సర్వాంగున భ్యనుభూతా ప్రతిమ పగల్భ పరి వాగాంతర్హ్వితోద్వి(క్రముస్' ఇందు 'పరివాగాం తర్హ్విత' అనుచో పూర్వపు ముద్రణములలో 'పరివాదాం తర్హ్విత' అని గలదు. 'వాద'ను 'వాగ'గ నేల మార్చిరో. అచ్చుతప్పా? అవును. మూలమున వారును 'పరివాదాంతర్హ్విత' అనియే ముద్రింపించిరి. ఇట్టిదే పై 'ఘన-తన' కూడ. పూర్వపు పరిష్కర్త లోపముగ చూపుటకుగాని, తమ ఘనతను ప్రకటించుటకుగాని తగిన తావు కాదది. అసలు పై పద్యములోని తొలి మూడు పాదములును పూర్వముద్రణమున నిట్లు గలదు.

'అనుచుం గృష్ణుఁడు వోయినం
బిదప బాణామర్త్యవైరీశును
ద్ఘన చక్రాయుధ నిష్ఠురక్షత
గళద్రక్తార్ద్ర సర్వాంగుని
స్ననుభూతా(ప్రతిమ ప్రగల్భ
పరివాదాంతర్హ్వితోద్వి క్రముస్'

వివరణాపేక్షితములు సంస్కరణాపేక్షితములు నగు మఱికొన్ని పట్టులు. ప్రథమాశ్వాసములో 'అంజెదవుగాక' అని మొదలుగాగల పద్యమొకటి గలదు. (ఆ. 1. పద్య. 75) అకాడమీ ప్రతిలో పూర్వముద్రిత మగు వావిళ్ల పాఠము యథాతథముగ ముద్రితము నది. కాని యిటీవలే వెలువడిన అకాడమీ ప్రచురణ మగు 'లక్షణసార సంగ్రహము'న నీ 'అంజెదవుగాక' అని మొదలుగాగల పద్యము సోమనాథుని హరివిలాసము లోనిదిగ ముద్రితమయినది. (పుట. 17) ప్రకాశకులు వ్రాయించిన చక్కని సమీక్షలోకూడ పై 'అంజెదవు గాక' పద్యము నాచన సోమనాథుని హరివిలాసములోని దిగనె పేర్కొనబడినది. (అనుబంధము--1) పైగ పద్యమునందు కొంత మార్పుకూడ జూపఁబడియున్నది. ఇది ఉత్తర హరివంశములోనిది

'అంజెదవు గాక నమ్ముం జెం
తం జేరఁగనీక యెంత దఱిగిన మిఱియా
లుం జొన్నల సరి పోవే
లంజెతనములందు గొమిరెలన్ గెలువవటే

లక్షణసార సంగ్రహమున సోమన హరివిలాసములోనిదిగ జూపబడిన పద్యము

'అంజెదవు గాక నను చెం
తం జేరఁగనీక యెంత తగ్గిన మిరియా

లుం జొన్నలు సరిగావే
లంజె తనమునందు కొమరులం గెలువనొకో'

దీన పద్యప్రతిపాద్యమగు విషయమే **వేరు**పడు చున్నది. పై పద్యమున నరకుఁడు ఊర్వశిని లక్ష్యము జేసి చెప్పినట్లుండ రెండవ పద్యమున 'తన్ను' గూర్చిన విషయ ప్రతిపాదనమే చెప్పబడినది. ఇంతకును ఈ పద్యము ఉత్తర హరివంశములోనిదా? హరివిలాసము లోనిదా? ఒక గ్రంథమునకే రెండు పేర్లును గలవా? శ్రీమతి యశోదారెడ్డిగారుగాని శ్రీమాన్ ఆచార్యులవారు గాని తేల్చి తెలుపరైరి.

'త్వష్టకు నుదాహరకుఁ
జతుర్దశి యనంగ నొక్క కూతురు...
(ఉ. హరి. ఆ 1. ప 82)

ఇందులకు మూలమనదగినది

'త్వష్టు ర్దుహితరం భౌమః ।
కశేరు మగమత్ తదా
గజరూపేణ జగ్రాహ ।
రుచిరాంగీం చతుర్దశీం॥
(సం. హరివం. అధ్యా. 63. శ్లో. 7)

సోమనాథుఁడు పై పద్యమున పేర్కొనిన రీతిగా 'త్వష్టకు' 'ఉదాహర' భార్య యనియు 'చతు ర్దశి' కూతురు అనియు మఱెచటను గానరాదు. ఎఱ్ఱన ఇట 'వేఱె యొకతె విశ్వకర్మకూతు విశద లావణ్య సముజ్జ్వలఁ జేకొని (హరి. ఉత్తర భా. ఆశ్వా 4. ప. 46) అని వారి పేర్లను బేర్కొనకుండగనే తప్పించుకొనెను. తరువాత మూలమున

'సజహార తదా భౌమస్త్వచ్ఛనాధి చకార సః' (హరి. విష్ణు పర్వం. అధ్యా. 63. శ్లో. 11) అని యుండగా ఎఱ్ఱన 'చేకొని' యని మాత్రము అను వదించుకొనెను. మన సోమనాథుఁడో 'కవసి నరకా సురుండు సౌఖ్యములఁదేలి'యని నోరారజెప్పి ఊర్వశీ విషయమునందువలె మనసు దీర్చుకొనెను. ఇంతకును పై మూలములోని 'చతుర్దశీం' అనుదానికి 'పదు నాలుగేండ్లప్రాయముగల' అని వ్యాఖ్యాతృ వివరణము గలదు. మూలానుసారముగ 'త్వష్టకూతురు పేరు 'కశేరువు'. ఆమె పదునాలుగేండ్ల ప్రాయము గలది. అట్టిదానిని రుచిరాంగిని నరకుడు గజరూపముతో గ్రహించెను' — అని రచింపవలసిన సోమనాథుఁడు 'త్వష్టకు ఉదాహర పేరుతో ఒక భార్యను—చతుర్దశి పేరుతో ఒక కూతురిని కల్పించెను. మూలములోని 'కశేరువు'ను బరిహరించెను. ఇట్లతడు మార్పు చేయు టకు కారణము? సోమనాథునికి దొరకిన సంస్కృత హరివంశములో తదర్థకములుగా పాఠాంతరము లేవైన నుండెనేమో?

ఇటమీఁద నాకు నరకుఁడు
కుటిల మతింగీడు చేయఁగోరెడు
(ఆ. 1. ప. 135)

ఇని దేవేంద్రుని వాక్కులు. ఇంతదాక నరకు డింద్రుని కేమియు కీడుచేయలేదా? ఇఁక మీఁద నేనా చేయఁబోవుట? ఇప్పటికే ఇంద్రుఁడు నరకుని మూల ముగా అనుభవించిన నరకవేదన ఇంతింతకాదు గద? దీనికి మునుపటి పద్యములలో నున్న ఇంద్రుని గోడు అదే గదా. మఱి యిదేమై యుండును. ఇప్పట్టను ఎఱ్ఱన

'నీ తేజంబు సైరింపకు
గ్రావప్రంభత నిన్నునుందొడరి
నీకాఙింబరీ భావమున్
గావింపన్ భవదండకంబు
మదినా కాక్షించు నెల్లప్పుడున్'
(హరివంశము. ఉ. భా. ఆశ్వా 4 ప. 120)

అని సందర్భోచితముగా ఇంద్రునిచే చెప్పించెను. సోమ నయు దానినే బేర్కొనెను. కావున పద్యమిట్లుండ వలయును.

'ఇటుమీఁద నీకు నరకుఁడు
కుటిల మతింగీడు చేయఁగోరెడు' అని.

ప్రథమాశ్వాసములోని 161 వ పద్యమున

'తంత్రీ వినోదంబు తడవు సైపని వ్రేళ్ల' అని గలదు. సంగ్రామ సీమలో 'పాణితలంబు' 'ఎలుంగు' 'పదంబు' 'విలోచనంబులు' గెలుపు గైకొన్నట్లే 'వ్రేళ్ల'ను మొక్కలంపు గెలుపు గైకొనినవి. కాన 'వేళ్లు' అనియే ఇట నుండవలెను. శ్రీ మానవల్లి వారి గ్రంథ చౌర్యమునందు ఛాయాపహారమున కీ పద్య

ముదాహరింపఁబడినది. అందు వారును '(వేళ్ల' అనియే ముద్రింపించిరి.

'ఏఁచు నుపేంద్రునిం బదక మిమ్మని రుక్మిణి మున్ను.... (ఆ 1. ప. 168)

ఇది అకాడమీవారి ముద్రిత పాఠము. ఇటు 'ఏచును (ప్రేమతో' అని వీరేశలింగముగారి పాఠము. 'ఏఁచిన (పేమతోఁ బదక మిమ్మును రుక్మిణి' యని నడకుదుటి (కూచిమంచి తిమ్మకవిగారి గంథ సంచయపుఁ (బతిలోని)వారి పాఠము. సుందరార్థ (ప్రతిపాదక మగుటచే నియ్యదియే పరిగ్రాహ్యము. (విమర్శ తరంగిణి. పుట 132)

'అంతట దానవాంతకుఁ డహంకరణంబునఁ జేర్చి...(ఆ 1. పద్య. 175)

ఇందు నాల్గవ పాద మిట్లు గలదు.

'క్కంతగ నేలఁ గూలె దనుజాకృతి (తాసున దూప భూతముల్' అని కలదు. సంస్కృత హరివంశమును, సంవాది రచనములను జూచినచో భూతముల్ (తాసున దూచుట' యేమో స్పష్టమగును.

'చక్ర ద్విధాకృతం తస్య శరీర మపతత్ భువి' (సం. హరి. విష్ణు. ప. అధ్యా 63 శ్లో 121)

'తం భౌమం నరకం బలీ క్షిప్త్వా చక్రం ద్విధాచక్రే చక్రీ దైతేయ చక్రహా (సం. విష్ణు పురాణం)

'ఘోరాసురోత్తమ చక్రంబగు చేతి చక్రమున
దైత్యధ్వంసి ఖండించె ర
త్న మయోదగ్ర వినూత్న కుండల
సమేతంబైన తన్మూర్ధమున్

(పోతన భాగవతము. స్కంధము 10. ఉత్తర భా. పద్యము 198)

ఇందు వేనియందును '(తాసు, భూతములు, తూచుట' కానరావు. ఇంక మూలానుసారి ఎఱ్ఱన యనువాదమును పరికింతము. అతడు.

'శోణితో దక పూరంబునః
దేలె దైత్యుఁడు జగత్సం(తాస విచ్ఛిత్తిగాన్'
(హరి. ఉత్తర భా. ఆ. 4. ప. 178)

అని రచించి యుండెను. ఇప్పట్టున సోమన 'చక్రము నరకుని జీల్చె'ననుటను మూలాను సారముగ రచించి ఆ విధమును దెలుపుటలో ఎఱ్ఱన రచనమును పుణికి పుచ్చుకొనెను. అపుడు ఎఱ్ఱన 'జగత్సం తాస విచ్ఛిత్తి' సోమన రచనమున '(తాసము దూల భూతముల్'గ నగుపింపవలయునుగాని '(తాసు — తూచుట—భూతముల్' అని కారాదు గద.

మఱియు నీ పద్యమున నన్వయ క్లేశమును గలదు. నేల గూలినదేది? కూల్చినదెవరు?'ఒక్కొంత'గ అనినచే 'ముక్కలు ముక్కలు' అని యర్థము. అపుడా (వక్కలెందులకు? (ఒక్కంతగ=ముక్కలు ముక్కలను టకు' అంతటఁబోక మూఁడు నిశితాస్త్రయు యుద్ధతి నేయఁ జూపమొ క్కంతగఁ(దుంచి' (జై. భార. ఆ. 2. ప. 68) ఈ సందేహములకు బరిహారముగఁ బద్యమునిట్లు చదువుకొనవలయును.

'......సదరంబుగ దెందము దాఁకి చక్రమొ
క్కంతగ నేలఁగూల్చె దనుజాకృతిఁ
(దాసము దూల భూతముల్'

ఎఱ్ఱనగారి 'జగత్సం(తాస విచ్ఛిత్తికి'
సరియగు ననుకరణమే ఈ సోమన రచన.
పూర్వ ముద్రణములో

'......భుజగాంతకు తెక్కల కొక్కలాగునం'
(ఆ. 1. ప. 154)

అనియుండ, అకాడమీవారు

'భుజగాండకు తెక్కలొక్క లాగునం' అని ముద్రింపించిరి. ఏలనో? మఱియొక సవరణము

'చెవులం బెట్టికొనంగ రాని పురిగాసిం బెటి (ఆ. 1. ప. 184) అని ముద్రణ పాఠము. అర్థము కుదురకున్నది. కాన 'కొనంగరాని పురి'ని 'కొనంగరాని రిపు'గా మార్చుకొనవలయును—ఇట్టివే (గంథమందంతట సంస్కారాపేక్షములయిన సందర్భములు పెక్కులు కలవు. అవి యెల్ల పరిశీలితములగుచో ఉత్తర హరివంశము సుపరిష్కృతమగు నవకాశము కలదు. ఆ పైనే దాని వ్యాఖ్యాన రచనమునఁ బరిశ్రమింపఁ దగును—

నేయార్థము - ఒక పరిశీలన

శ్రీ గువ్వా శంకర రావు

పాండిత్య ప్రకర్షగాని ప్రదర్శనగాని ఈ వ్యాస రచనా ముఖ్యోద్దేశం కాదు. నేను అలంకార శాస్త్రం పుక్కిటబట్టితి ననుకోవటంలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 1970 లో ఎమ్. ఎ. చదువు కొంటున్న రోజులలో కావ్యాలంకార సంగ్రహంలోని గుణదోష ప్రకరణం పాఠ్యభాగం కావటంతో అధ్య యనం చేయవలసివచ్చింది. అప్పటిలో దానికి బృహ ద్వ్యాఖ్యానం చూడటం తటస్థించింది. తద్వ్యాఖ్యా తలు వైయాకరణాలంకారిక శిరోమణులు, కవి పండిత శిఖామణులు అయిన శ్రీ సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారు. వారి వ్యాఖ్యాత వ్రాసిన వ్యాఖ్యానం సంతృప్తి నివ్వలేదు; సరిగదా! అసంతృప్తి నిచ్చింది. అప్పుడు విశ్వవిద్యాలయంలో సెమినార్‌లో చదివి విని పించినదే ఈ వ్యాసము.

శ్రీ శాస్త్రిగారి వ్యాఖ్యానంతో ఉన్న గ్రంథానికి మలిపలుకు 13 వ పేజీ 2 వ పంక్తినుంచి వ్రాసిన వ్రాత చదివాను. ఈ క్రింది విధంగా ఉంది. 'ఈ ఉన్న గ్రంథములలో గావ్యాలంకార చూడామణి నరస భూపా లీయములు విశ్వవిద్యాలయ పరీక్షలకు బాఠ్యములు. ఈ గ్రంథకర్తలకు అలంకార శాస్త్రమునం గూలంకష మగు ప్రజ్ఞ లేదన్నట్లు వారి గ్రంథములే సాక్ష్య మిచ్చుచున్నవి. అట్టి గ్రంథములవలన విద్యార్థుల కెంత యలంకార శాస్త్రవిజ్ఞానం లభించును?'

దీనివల్ల వీరి పాండిత్యము గంథకర్తలకంటే మించిఉంటుందని, అట్టి వ్యాఖ్యానం చూడటం నా భాగ్యమే కాక ఆంధ్రుల భాగ్యమని ఉవ్విళ్లూరాను. అయితే నా ఆశ నిరాశ అయింది. గ్రంథకర్తలకు కూలంకష ప్రజ్ఞ లేదని నిర్ధారించిన వీరి వ్యాఖ్యా నము వెలుగు కిరణము ప్రసరించ లేకపోయింది. ముఖ్యంగా గుణదోష ప్రకరణంలో పదగత దోషము లలో నేయార్థము వ్యాఖ్యానం దానికి తార్కాణ మయింది.

'వాక్యమ్ రసాత్మకమ్ కావ్యమ్' అని విశ్వ నాథుడు, 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్' అని జగన్నాథ పండితుడు, 'అదోషౌ సగుణౌ సా లంకృతీ పునః క్వాపి' అని మమ్మటుడు, 'గుణాలంకార రీతి రసోపేతః సాధు శబ్దార్థ సందర్భః కావ్య'మ్మని వాగ్భటుడు కావ్యనిర్వచనం చేసినారు.

కవి కర్మ కావ్యమే అయినా రమణీయార్థ ప్రతిపాదక శబ్దములు రసాస్వాదకములై కావ్యత్వం పొందుతున్నాయి. ఆనందవర్ధనుని మతమున కావ్యము లకు రసము ప్రధానము. దీనికి ధ్వని ముఖ్యమని అతని మతము. వస్తు, అలంకార, రసధ్వనులని మూడు విధములుగా ధ్వని ప్రధాన భేదముల నతడు పేర్కొ న్నాడు. అతని మతాన్ని అనుసరించియే మూర్తి కవి తన కావ్యాలంకార సంగ్రహమున [నరస భూపాలీయ మున] ఇలా అన్నాడు.

'తనువగు శబ్దార్థంబులు
ధ్వని జీవ, ము అలంక్రియా వితానము సొమ్ముల్
తనరు గుణంబులు గుణములు
ఘనవృత్తులు వృత్తులౌర కావ్యందిరకున్'
(2 వ ఆశ్వాసము, 53 వ పద్యము)

దీనినిబట్టి కావ్యాత్మ ధ్వని అనిన్నీ, కావ్యశరీరము శబ్దార్థములనిన్నీ తేలింది. కావ్యము రసాశ్రయము కాగా తద్రసము శబ్దార్థాశ్రయము అవుతూ ఉంది. ఆత్మ శరీరగతమైనట్లే, రసము శబ్దార్థగతము.

'తదల్ప మపినోపేక్ష్యమ్ కావ్యే దుష్టమ్ కథం చన స్యాత్ వపుః సుందరమపి శ్విత్రేణ ఏకేన దుర్భగమ్'

అని దండి తన కావ్యాదర్శమున దోషమునుపేక్షింప రాదనివాడు. 'అదోషౌ సగుణౌ' అన్నమమ్మటుఁడు, 'సాధు శబ్దార్థ సందర్భః కావ్యమ్' అన్న వాగ్భటుడు కూడా సాధు శబ్దార్థజ్ఞానము అవసరమని భావించిన వారే. అందువల్లనే దోషప్రకరణం కూడా పఠనీయ మైనది. దోషములు 1. శబ్దగత 2. అర్థగతములని రెండు విధాలుగా కావ్యాలంకారములో పేర్కొవటం జరిగింది. అందు శబ్దదోషాలను 1. పదగత దోషములు 2. వాక్యగత దోషములు అని నరసభూపాలీయ కర్త రెండుగా విభజించినాడు. ఆ సందర్భంలో పదగత దోషాలను

సీ. అప్రయుక్తంబ పుష్టార్థంబు నేయార్థ
మసమర్థకంబు' 'నిరర్థకంబు' అంటూ

17 దోషములను పేర్కొన్నాడు. అందు మూడో దోషమైన నేయార్థము మనకు ప్రస్తుత చర్చనీయాంశము.

ఈ నేయార్థము అనే దోషానికి లక్ష్య లక్షణములను కావ్యాలంకార సంగ్రహంలో కిందివిధంగా పేర్కొవటం జరిగింది.

క. 'ఇలఁదన సంకేతంబున
నిలిపిన పదమెంచి చూడ నేయార్థం బౌఁ
బలు దేనె తిండి గమి నగు
నల సాగర కర్ణయాన యలకల నంగన్.'

(4 వ ఆశ్వాసము; 7 వ పద్యము.)

ఈ పద్యమున ముందు రెండు చరణాలలోనూ నేయార్థ లక్షణము చెప్పి తరవాతి రెండు చరణాల లోనూ దానికి లక్ష్యము చూపినాడు. 'కవి తన సంకేతంబున నిలిపిన పదము నేయార్థము' అని లక్షణము. 'అల సాగర కర్ణయాన అలకలు పలుతేనె తిండి గమిన్ నగున్' అవేది దానికి లక్ష్యము.

దీనికి శ్రీ సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారి వ్యాఖ్య యథాతథంగా చూపుతున్నాను.

'సుప్రసిద్ధమగు సంకేతార్థము నందుగాక కవి కల్పించుకొన్న సంకేతమునందుఁ బ్రయుక్తమైన శబ్దము నేయార్థకము.' సాగర కర్ణయాన' అనునెడ సాగర=[ఏనుగు చెవియందలి] మదము; కర్ణయాన= చెవులలోగల యనగా గజముయొక్క యానమువంటి యానము గలస్త్రీ. 'సాగరకర్ణ' శబ్దమునకుఁ గవి 'గజ' మని సంకేతము గల్పించుకొనెను. ఇది సుప్రసిద్ధముగాదు. కావున నేయార్థకము అని గ్రంథకర్త యుద్దేశము.

ఇట లక్ష్యలక్షణములు రెండును సరిగావు. ఏలన నేయార్థమున 'రూఢి ప్రయోజనములు లేకయు గవి స్వేచ్ఛగాఁ గల్పించుకొన్న లక్ష్యార్థము.' రూఢియో, ప్రయోజనమో యున్నఁగాని లక్షణ వర్తిల్లదని మున్నుదెలిపితిమి. అట్టి రూఢిప్రయోజనములను లెక్కింపక కవి స్వతంత్రముగాఁ గల్పించు కొన్న లక్ష్యార్థము నేయార్థము. ఎట్లన 'చందమామ దన్నుసతి మొగంబు' అనునెడ 'దన్ను'నని 'జయించు'నని లక్ష్యార్థము. మొగము ఎట్లు తన్నును ? కావున ముఖ్యార్థ బాధకలిగినది. అప్పుడు లక్షణ చెప్పుకొనవలెను. లక్షణ చెప్పుకొన వలయునన్న రూఢి ప్రయోజనము లుండవలెను. 'తన్ను' ధాతువు 'జయించు'నను నర్థమున రూఢము గాదు. ఇక బ్రయోజనమును గానరాదు. (లెస్సగా జయించునని ప్రయోజనము చెప్పుకొనగూడదా? అందు రేని ఉపమానమగుటవలన నుత్తమ గుణములు గల చంద్రుని, నుపమేయమగుటచే న్యూనగుణములు గల మొగము దన్నుననుటచే మర్యాద యెఱుగనిదని యర్థము వచ్చి వర్ణ్యమగు మొగమున కపకర్షమే గలుగును.) కాన రూఢి ప్రయోజనములు లేవు. కాన నిది నేయార్థకము. 'సాగర కర్ణయాన' అనుచో 'సాగర కర్ణ' పదము నేయార్థము గాదు. 'సాగరము కర్ణమున గలది' అను వ్యుత్పత్త్యర్థముచే 'గజమ'ను నర్థమున నా పదము రూఢమే యగుచున్నది గదా! అయితే ఇది సుప్రయుక్తము గాదు. కావున నప్రయుక్త దోషమగును. కావున లక్ష్య లక్షణములు రెండును దుష్టములే.'

వీరి వ్యాఖ్యాన సారాంశ మేమంటే లక్ష్యలక్షణములు రెండును దుష్టములే.

మూర్తికవి ఇచ్చిన లక్షణము:— కవి తన సంకేతంబున నిలిపిన పదము నేయార్థము.

శాస్త్రిగారు ఇచ్చిన లక్షణము:—రూఢి ప్రయోజనములు లేకయు గవి స్వేచ్ఛగాఁ గల్పించుకొన్న లక్ష్యార్థము—నేయార్థము.

మూర్తికవి ఇచ్చిన లక్ష్యము: 'అలసాగర కర్ణయాన అలకలు పలుతేనెతిండిగిమిన్ నగును.'

శాస్త్రిగారు ఇచ్చిన లక్ష్యము:—'చందనూమదన్ను సతి మొగంబు.'

పై వాటిని పరిశీలిస్తే లక్షణము వేరొకటి ఇచ్చినారే కాని నరస భూపాలీయమున చెప్పిన లక్షణము ఎట్లా తప్పు అన్నారో బోధపడదు. వారిది మతాంతరమగునేమో కాని ఇది తప్పనటానికి హేతువు కానరాదు. లక్షణము విషయంలో వారి నిరాకరణకు అర్థం కానరాదు. ఏ వ్యాఖ్యాతకైనా ముందు గ్రంథకర్త చెప్పిన లక్ష్యలక్షణములకు సమన్వయము చూపవలసిన బాధ్యత ఉంది. అవి కుదరనప్పుడు మాత్రమున్నూ లేదా వానికంటే ప్రసిద్ధమైనవి చెప్పదలచి నప్పుడున్నూ ఇతర లక్షణములను చెప్పవచ్చు.

వాస్తవానికి లక్షణము విషయంలో ఆ విధమైన విప్రతిపత్తి లేదనుకొంటాను. ఏమంటే ప్రతాపరుద్రీయాని కనువాదమైన మన నరసభూపాలీయమున మూర్తికవి చెప్పిన దానిని ప్రతాపరుద్రీయకారుఁడగు విద్యానాథుఁడు కూడా అట్లే చెప్పినాడు.

'స్వసంకేత ప్రసిద్ధార్థమ్
నేయార్థమ్ పరికీర్త్యతే
శబ్ద శాస్త్ర విరుద్ధమ్
యత్చ్యుత సంస్కారముచ్యతే'

(5 వ శ్లోకము.)

ఇందు రెండో పాదంలో చ్యుత సంస్కారమనే దోషానికి లక్షణముంది. ఇంక 'స్వసంకేత ప్రసిద్ధార్థమ్ నేయార్థమ్' అన్న లక్షణమునే మన మూర్తికవి 'తన సంకేతంబున నిలిపిన పదమెంచి చూడ నేయార్థంబౌ' అని అనువదించినాడు. అందువల్ల లక్షణము సరిగాదన్న శాస్త్రిగారి అధిక్షేపణము సరిగాదు.

ఇంక లక్ష్యమును పరిశీలిద్దాము. ప్రతాపరుద్రీయమున విద్యానాథుఁడు ఇలా అన్నాడు.

అనర్థక నేయార్థచ్యుత సంస్కార సందిగ్ధాని యథా :— విహాయచ గృహాంస్తాన్వై వ్యత్యస్త నవ వృత్తయః, కదా భవిష్యతే వాసః కటకేషు మహీభృతామ్?, అత్రవై ఇతి నిరర్థకమ్. వ్యత్యస్త నవ శబ్దేన వనప్రతీతి, స్వసంకేత మాత్రాయుక్తేతి నేయార్థకం. 'కదా భవిష్యతే వాసః కటకేషు మహీభృతామ్?' అనేది చ్యుత సంస్కార దోషమునకు లక్ష్యము. అది మనకు అప్రస్తుతము. ఇక్కడ 'వ్యత్యస్తనవ వృత్తయః' అనేది నేయార్థమునకు లక్ష్యము. దీనికి లక్షణ మెట్లా పట్టిందీ కొంచెం పరిశీలిద్దాం. వ్యత్యస్తమయిన నవ వృత్తులు కలవారని అర్థం బోధపడుతుంది. దీనివల్ల కొత్త వృత్తులు తారుమారయినట్లు అవగతమౌతుంది. కాని స్వసంకేత ప్రసిద్ధార్థము ఇందులో ఇమిడిఉంది. వ్యత్యస్తమనే పదంలో కవి ఒక సంకేత ముంచినాడు. దానివల్ల 'నవ వృత్తయః' అనే దానిలో 'నవ'ను వ్యత్యస్తముచేసి అర్థమును యోచించండి అని కవి సంకేతమన్నమాట. దీని అర్థము అప్పుడు 'వన వృత్తయః'కు గ్రహించవలసి ఉంటుంది 'వన వృత్తులు కలవారు' అనే అర్థము బోధపడుతుంది. ప్రతాపరుద్రునివల్ల ఓడిన రాజులు వనవృత్తులు కలవారయినారని కవి తాత్పర్యము. ఇక్కడ 'నవ' శబ్దానికి 'వన' ప్రతీతి లేదు. కాని 'వ్యత్యస్త' అని ఒక పదముచే దానిని కవి సంకేతించినాడు. ఇది తెలియనప్పుడు అర్థము స్ఫురించదు. దానివల్ల రసభంజకత ఏర్పడుతుంది. అందువల్లనే నేయార్థము దోషములలో చేరింది. ఇది విద్యానాథుని ప్రకారం నేయార్థానికి లక్ష్యలక్షణ సమన్వయము. అట్టి సమన్వయాన్ని మూర్తికవి ఇచ్చిన లక్ష్యంతో చూడవలసిఉంది. కాని శ్రీ సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు 'సాగరకర్ణ' శబ్దంలో కవి నేయార్థానికి లక్ష్య మిచ్చినాడని అనుకొని అది తప్పు, దుష్టము అంటూ ఏమేమో వ్రాసినారు. వేరొక లక్ష్యమును ప్రసాదించినారు. వారిచ్చిన లక్ష్యము నేయార్థానికి సరిఅయినదే అయితే అది భట్టుమూర్తి ఇచ్చిన లక్ష్యంలోకూడా ఉందికదా! మరి వీరి వ్యాఖ్యానాని కర్థ మేమిటో తెలియటంలేదు.

'చందమామను దన్ను సతి మొగంబు' అనేది శ్రీ శాస్త్రి గారిచ్చిన లక్ష్యము. దీనిమీద వీరి వ్యాఖ్యానం చూడండి 'సతి మొగము చందమామను దన్నును' అనటంవల్ల 'తన్ను' ననగా జయించునని అర్థము రూఢముకాదు. ఇది లక్షణవల్ల ప్రాప్తించింది. 'సతి మొగము తన్నును' అనటం పడదు. కాలు తన్నును గాని మొగము తన్నదుగదా! అందువల్ల ముఖ్యార్థ బాధ గలిగింది. అందువల్ల లక్షణ చెప్పుకోవలసి వచ్చిందనీ దానివల్ల 'జయించు'నని అర్థము వస్తుందని శాస్త్రిగారు సెలవిచ్చినారు. నిజానికి ఇట్టి లక్షణ మూర్తికవి ఇచ్చిన లక్ష్యంలోనూ చెప్పుకోవచ్చు. 'పలు తేనె తిండి గమివగు నలసాగర కర్ణయాన అలకల నంగన్' అనేది మూర్తికవి చూపిన లక్ష్యము. అల సాగర కర్ణయాన అలకలు (ముంగురులు) పలుతేనె తిండి గమిని (తుమ్మెదల మొత్తాన్ని) నగును (నవ్వును) అని అర్థము. మొగము తన్నదు. కాలు తన్నును. అందువల్ల ముఖ్యార్థ బాధ గలిగింది అన్నారు శాస్త్రి గారు. అట్లే ముఖము నవ్వునుగాని ముంగురులు నవ్వవు గదా! అందువల్ల ముఖ్యార్థబాధ గలిగింది. ఇప్పుడు లక్షణ చెప్పుకోగా 'నగున్' అనుధాతువుకు 'అవహసించును' 'అధఃకరించును' అని అర్థాలు వస్తాయి అని లక్ష్యము, వారి ప్రకారము సరిగా ఉన్నదని చూపవచ్చుగదా! కాని అలంకార శాస్త్రమున కూలంకష మగు ప్రజ్ఞ గ్రంథకర్తలకు లేదన్న వారి ఊహ దానికి అంగీకరించనివ్వలేదు. శాస్త్రిగారు సెలవిచ్చినది లక్ష్యార్థ మవుతుందేమో కాని నేయార్థము కాదు. కాగా శాస్త్రిగారి మతానుసారము లక్ష్యార్థానికి నేయార్థానికి భేదం లేదు. అందువల్ల మరో మార్గమనుసరించడం ఆరోగ్యకరము. మూర్తికవి రెండు పాదాలను లక్ష్యంగా ఇచ్చినాడు. కాని 'సాగరకర్ణ' శబ్దమును అధోరేఖచే నేయార్థ మున్నట్లు సూచించలేదు గదా! మరి అందే లక్ష్యము ఉందని భ్రమించి తప్పు పట్టుట మెందుకో బోధపడదు.

ఇంక భట్టుమూర్తి ఇచ్చిన నేయార్థ లక్ష్య లక్షణాలను సమన్వయం చేయడానికి ముందు, కొన్ని శ్లోకాలను పద్యాలను అర్థము చెప్పి వానిలో నేయార్థము ఉన్నట్లు ధ్రువపరిచి అట్టి ప్రక్రియ నెరిగిన మన భట్టుమూర్తి పద్యములను వసుచరిత్రనుండి ఒండు రెండు చూపుతాను.

> శ్లో. అధునా మధు కరపతి నా, గిళితోఽపి అపకార
> దంపతీయేన త్రాతస్స పాల యేన్మామ్ విగత వికారో
> వినాయకో లక్ష్మ్యాః.

అర్థము:—మధుకరపతినా=మధుకరపతిచే; గిళితః అపి=పీడింపబడినప్పటికీ; అపకార దంపతీ = అపకార దంపతి; యేనత్రాతః=ఎవరిచే రక్షింపబడిందో; సః=ఆ; లక్ష్మ్యాః=లక్ష్మీదేవియొక్క; విగత వికారః వినాయకః=విగత వికారుడైన వినాయకుడు; మామ్ పాలయేత్=నన్ను రక్షించవలెను. దీనివల్ల అర్థస్ఫూర్తి కలుగలేదు.

ఇప్పుడు విద్యానాథుడు 'వ్యత్యస్త' పదమువల్ల 'నవ' శబ్దాన్ని 'వన' చేసినట్లే ఇక్కడ కూడా కొన్ని సంకేతము లున్నాయి అని గ్రహించవలె. 'అధునా మధు కరపతినా'='ధు' లేని మధుకరపతిచే అనగా మకరపతిచే అని అర్థము. ఇది 'అధునా' శబ్దము ఉపయోగించి మధుకరపతిని మకరపతిని స్వసంకేత ప్రసిద్ధిచే చేసినాడు. అట్లే 'అపకార దంపతీ' అంటే 'ప' లేని దంపతీ అంటే దంతీ=ఏనుగు, యేనత్రాతః=ఎవ్వరిచే రక్షింపబడిందో; సః విగత వికారః వినాయకః లక్ష్మ్యాః = ఆ 'వి' పోయిన, లక్ష్మీ వినాయకుడు అంటే లక్ష్మీ నాయకుడు; మామ్ పాలయేత్=నన్ను రక్షించు గాక! అని అర్థము. ఇక్కడ 'అధునా' 'అపకార' 'విగత వికారః' శబ్దములచే కవి సంకేతించినాడు. మధుకర పతి మకరపతియైనాడు. 'దంపతీ' శబ్దము 'దంతి' అయినది. 'వినాయకః' శబ్దము 'నాయకః' అయింది. అది నేయార్థముకాక మరేమిటి?

> శ్లో॥ రామచంద్రే రణప్రాప్తే
> మధ్యమం నాకయోషితః
> ఆదిమం లేభిరే వీరాః
> భీరవశ్చాది మం రణమ్॥

రామచంద్రుడు రణరంగమందుండగా నాకయోషితః మధ్యమం రణ లేభిరే అనిన్నీ వీరాః ఆదిమం రణం లేభిరే అనిన్నీ; భీరవః చాదిమం రణం లేభిరే అనిన్నీ అర్థము. అంటే నాకయోషితః=దేవతా

స్త్రీలు, మధ్యను రణం పొందిరి అనిన్నీ; వీరులు ఆది మ,రణం పొందిరి అనిన్నీ; భీరువులు (భయంకలవారు) చాది మ,రణం పొందిరి అనీ అర్థము. మధ్యను రణం అనగా 'రణం' అనే దానికి మధ్య 'మ'గల దానిని అంటే 'రమణం' అని అర్థము. దేవతా స్త్రీలు రమణం పొందిరి. అనీ, వీరులు ఆది 'మ'గల 'రణం' అంటే 'మరణం' పొందిరి అనీ భీరువులు 'చ' ఆది నుందుగల 'రణం' అంటే 'చరణం' పొందిరి అనీ అర్థము. ఈ సంకేతములు కవి కల్పించుకొన్నవి. అందుచే ఇవి నేయార్థములు.

తే. గీ. అతివ కచనాభి జఘన దేహననము త
మీన దర సాల తారాజ పానిరాక
రణ మనంత మనాది నేత్రగళ భుజన
ఖోష్మ కుచవచో దంతంబులు భయగతుల||
(చాటుపద్య మణిమంజరి 149 వ పేజీ)

ఇందుస్త్రీ అవయవ వర్ణన గలదు. (1) కచ, నాభి, జఘన, దేహ, ఆననము-క్రమంగా—తమీ, నద, రసా, లతా, రాజ, పాని రాకరణము. అనంతము. 2 నేత్ర, గళ, భుజ, నఖ, ఓష్ఠ—క్రమంగా తమీన ధర సాల తారా జపా నిరాకరణము. అనాది. (3) కుచ, వచో, దంతంబులు —క్రమంగా—తమీన దరసాల తారాజపా నిరాకరణము ఉభయ గతులు.

ఈ పద్యంలో కవి (1) అనంతగతి (2) అనాది గతి (3) ఉభయగతి అనే పదాలలో ఒక సంకేత ముంచినాడు. అది తెలిసేటంతవరకు అర్థం సుగమం కాదు. ఈ పద్యంలో స్త్రీ అవయువాలను మూడు సార్లు పేర్కొన్నాడు. ఉపమానమును ఒక్కసారే చెప్పాడు. అయితే ఈ ఉపమాన సమాసమునే అనంత గతి (చివరి అక్షరము లేనిది); అనాదిగతి (తొలి అక్ష రము లేనిది); ఉభయగతులు రెండు ఉన్న విధంగానూ చూసుకొమ్మని కవి సంకేతము. అందుచేతవే నేయార్థ మున్నదని చెప్పటానికి వీలవుతూ ఉంది.

ఇప్పుడు ఉపమాన సమాసము దాని అనంతగతి చూద్దాం.

తమీన దరసాల తారాజపా—ఉపమాన సమా సము.

తమీ, నద, రసా, లతా, రాజ—అనంతగతి—అంటే చివరి అక్షరమైన 'పా' లేనిది అయింది. ఇప్పుడు అర్థం చూద్దాం. కచము- తమీ నిరాకర ణము. తమీ=చీకటిని నిరాకరిస్తున్న కచము అని అర్థము. నాభి—నద—నిరాకరణము. జఘనములు— రసా (భూమిని)—నిరాకరణము. దేహము—లతా— నిరాకరణము; ఆననము-రాజ (చంద్ర) నిరాకరణము.

ఇంక అనాదిగతితో అన్వయం చూడండి. మీన, దర, సాల, తారా, జపా, నిరాకరణము. ఇందులో తొలి అక్షరము 'త' లేదు. నేత్ర, గళ, భుజ, నఖ, ఓష్ఠములు క్రమంగా అన్వయిస్తే నేత్రములు—మీన నిరాకరణము; గళము—దర (శంఖము) నిరాకరణము, భుజములు - సాల (ఎత్తైనవి)—నిరాకరణము; నఖ ములు=తారా—నిరాకరణము; ఓష్ఠ—జపా (మంకెన పూవు) నిరాకరణము అని అర్థం అవుతుంది.

ఇంక ఉభయగతులు చూడండి. కుచ, వచో, దంతములు—తమీన, రసాల, తారా నిరాకరణము అని అర్థము.

చ. అలఘున చంద్రబింబ సమమై
తన రారెడు వక్త్రమందులో
గలిగిన నామ భేదముల కైవడి
నొప్పెడు కప్పుకొప్పు. చె
క్కులు, రదనాంశు కంబులవి
గుబ్బలకున్ సరిరాకపోయె; చే
తులు సరులాయె దాని గతి దోచును
పొంకపుటారు బోటికిన్.
(చాటుపద్య మణిమంజరి 150 వ పుట)

ఈ పద్యంలో కూడా కవి స్త్రీ అవయవ వర్ణన చేసినాడు. కాని 'అందులో గలిగిన నామ భేదముల కైవడి నొప్పెడు' అన్న దానిలో కవి ఒక సంకేతమును ఉంచినాడు. అది తెలిసేటంతవరకు అర్థం సుగమం కాదు. 'బోటికిన్ వక్త్రము అలఘున చంద్రబింబ సమమై తనరారెడున్' అంటే 'స్త్రీకి ముఖము పూర్ణచంద్రబింబ సమమై యొప్పును' అని అర్థము. కప్పుకొప్పు=నల్లని కొప్పు—దేని సమమై ఉంటుందో తెలిలేదు. 'అలఘున చంద్రబింబ' శబ్దములలో నామ ముల కైవడి నొప్పెడునని అర్థము. అలఘున సమమై,

కొప్పు—అలచంద్ర సమమైె చెక్కులు — అలబింబ సమమైె రదనాంశుకంబులు (పెదవులు) ఒప్పుతాయని అర్థము. ఇప్పుడు నామ భేదాలను గ్రహించాలి. ఘన మంటే మేఘము—నామ భేదము—పయోధరము—అవి గుబ్బలకు సరిరాక పోయినాయి. అవి నీటిని మాత్రమే ఇస్తాయి. ఇవి పాలను ఇస్తాయికదా. చేతులు సరులాయె అన్నదానికి అర్థం చూద్దాం! చంద్రునికి—నామభేదము—అబ్జ—ఇప్పుడు చేతులు అబ్జ సమమయినాయి. అంటే కరాబ్జములని అర్థము. ఇంక 'దానిగతి దోచు పొంకపు టారు' అనేదానికి అర్థం చూద్దాం. చంద్ర బింబమునకు — నామ భేదము సుధాంశువు—దాని గతి గలవి చీమలబారు—రీతి—దోచును—ఆరు—నూగారు అని అర్థము. సుధాంశువు అంటే అమృత బిందువు లేదా తేనె బిందువు, గతి గలవి అంటే చీమలబారు అని అర్థము. స్త్రీ యొక్క నూగారు చీమల బారుతో పోల్చటం కవి సమయమే. ఇందునేయార్థము లేదన గలమా?

గీ॥ అధరముఖ వర్ణ శూన్యంబు లతిపకుచము
లానన నాకార రహిత మబ్జాక్షి మేను
అజ జఘన మండలము లంచయాన కురులు
చరమ బాధిత కరములు చామ తొడలు.

(చాటుపద్య మణిమంజరి, 149 వ పుట)

అతివకుచములు=స్త్రీ స్తనములు; అధరముఖ వర్ణశూన్యంబులు అంటే 'అధర' శబ్దంలో తొలి వర్ణము లోపించినవి. ధరములు=కొండలు అని అర్థము. అబ్జాక్షిమేను=స్త్రీ శరీరము; ఆనన ఆకార రహితము అంటే 'ఆనన' శబ్దంలో 'ఆ' కారము లేనిది 'నన' అని అర్థము. అంచయాన కురులు=స్త్రీయొక్క కొప్పు; అజ జఘన మండలములు అంటే 'జ' లేని 'జఘన మండ ములు' అంటే ఘన మండలములని అర్థము. మేఘ మండల సదృశములని అర్థము. చరమ బాధిత కరములు చామ తొడలు అంటే 'కరములు' శబ్దంలో చివరి అక్షరము బాధింపబడగా అంటే లోపించగా 'కరము' నిలుచును. 'కరము' అంటే 'ఏనుగు తొండము' దానితో సమానమైనవి ఆ స్త్రీ తొడలు అని అర్థము. ఇవి అన్నీ నేయార్థములే.

ఈ విధమైన ప్రక్రియ లెరిగిన భట్టుమూర్తి వసుచరిత్రలోని ఈ క్రింది పద్యాలు కూడా గమనించండి.

ఉ. స్వైరవిహార ధీరలగు సారస
లోచనలున్న చోటికిన్
బోరన లాతివారు చొరబూనినచో
రసభంగమంచు నే
జేరక పువ్వుదీవియం చెంతనె
నిల్చి లతాంగి రూపు క
న్నారగ జూచివచ్చితి నవాంబు
రుహాంబక నీకు దెల్పగన్.

(2 వ ఆశ్వాసము 54 వ పద్యము)

ఈ పద్యంలో 'సారసలోచన' లున్నచోటికి లాతివారు చొరబూనినచో రసభంగమవుతుందిట. అంటే 'సారసలోచన' శబ్దంలో 'రస' పోతుంది. అప్పుడు 'సాలోచన' లవుతారు. ఇది కూడా నేయార్థకమే.

ఉ. జాతికి నెల్ల రాజపరిచర్యయు
గాలికి నెక్కుడన్న వి
ఖ్యాతియు రా, గురంగములు గట్టున
నేమి తపం బొనర్చెనో?
యాతత శృంగభార రహితాత్మ
మహాముఖ కాంతతాప్తి నా
రా తనరారె నన్నియు దురంగములై
తదభీష్ట సంపదన్.

(5 వ ఆశ్వాసం. 43 వ పద్యం.)

ఈ పద్యంలో కురంగములు (లేళ్లు) వాటి జాతికి అంతటికి రాజపరిచర్యయు (రాజసేవయు; చంద్రసేవయు); గాలికి నెక్కుడు (గాలికన్న వేగము కలవి; గాలికి వాహనమైనవి) అన్న విఖ్యాతి రాగా కొండపై (కోలహల పర్వతంమీాద) ఏమి తపస్సు చేసినాయో గాని ఆతత శృంగభార రహితము లయి (దీర్ఘమైన కొమ్ముల భారము లేనివయి) ఆత్మ=తన సంబంధమైన, మహాముఖ కాంతత=గొప్ప ముఖ సౌందర్యముయొక్క; ఆప్తిన్=ప్రాప్తిచేత, అన్నియు, తదభీష్ట సంపదన్=వాటి కోరిక ప్రకారము, తురంగములై=గుఱ్ఱములయి; ఔరా! తనరారెన్=ఆహా!

ఒప్పినవిగదా! కురంగములు తురంగములయినాయని కవి చెప్పినాడు. ఔరా! అని ఆశ్చర్యమును వ్యక్తీకరించటంలో పాఠకులను పునరాలోచించ మన్నాడు. ఆ సంకేతమును గ్రహించి చూద్దాం. క్+ఉ+రంగము= కురంగము అవుతుంది. అలాగే త్+ఉ+రంగము= తురంగము అవుతుంది. 'క్' పోయి 'త్' వస్తే 'కురంగములు' తురంగములు అవుతాయికదా! దానినే కవి నేయార్థంతో సాధిస్తున్నాడు. 'ఆతత శృంగభార రహిత ఆత్మ మహోముఖ కొంత తాప్తి' అనే దానిలోనే దీనిని ఇమిడ్చినాడు. మొదటి అర్థము 'శృంగ'మంటే 'కొమ్ము' అని చెప్పుకొన్నాం. కాని 'శృంగము' అంటే ఉత్ సంజ్ఞకమగు కొమ్ము అని అర్థం ఇప్పుడు చెప్పుకోవాలి. 'ఆతత శృంగభార రహితమైన' అంటే 'ఉ' కారము లేనిదైన అని అర్థము చెప్పుకోవాలి. ఆత్మ మహోముఖ=తనయొక్క ముఖ వర్ణము అంటే తొలి అక్షరము అని చెప్పుకోవాలి. 'కురంగ' శబ్దంలో 'క' కారము తొలివర్ణము గదా! క+అంత=కాంత='క' అంతమై 'త' ప్రాప్తించగా కురంగములు తురంగములయినాయి' అంటున్నాడు కవి. ఇవి నేయార్థములు కావా?

ఇప్పుడు కావ్యాలంకార సంగ్రహంలో చెప్పిన పద్యానికి నేయార్థ లక్ష్యము సమన్వయం అవుతుందేమో పరిశీలించండి.

ఈ విషయం పరిశీలించడానికి ముందు మనం శాస్త్రిగారు సెలవిచ్చినట్లు 'సాగరకర్ణ' శబ్దంలో నేయార్థము మూర్తికని భావించలేదని గ్రహించటం అవసరం.

'అలసాగర కర్ణయాన అలకలు పలుతేనె తిండి గమిని నగున్' అనే దానిలో ఎక్కడ ఉన్నదీ చూద్దాం. ఈ శబ్దాలను ఈ రీతిగా పదచ్ఛేదము చేస్తే వస్తుందని నా ఊహ. అలస+అగరకర్ణ+యాన=అలసాగర కర్ణయాన అవుతుంది. అలస=మందమైన; అగరకర్ణ= మధుర శ్రుతి, యాన అని అర్థము, 'మంద మధుర శ్రుతి యాన' ముంగురులు తుమ్మెదల మొత్తాన్ని నవ్వుతాయని అర్థం వస్తుంది. 'అగర కర్ణ'కు 'మధుర శ్రుతి' అని అర్థము ఎవ్వరైనా అంగీకరింపరేమో! గరళము, గరము సమానార్థకములు. కళకంఠుడు 'గరకంఠ' భవమని ప్రౌఢ వ్యాకరణకారులైన శ్రీ సీతారామాచార్యుల వారన్నారుకదా! 'గరము' అంటే విషము. గరము కానిది 'అగరము' అవుతుంది. అంటే అమృతము మధురము అని అర్థాలు వస్తాయి. కర్ణము, శ్రుతి రెండూ సమానార్థకాలే. అందువల్ల 'అగరకర్ణ' అంటే 'మధుర శ్రుతి' అర్థము సిద్ధమే. ఇది సామాన్యార్థము. ఇంకనేయార్థానికి వస్తే ఈ విధంగా అన్వయించుకోవాలి. 'అలస+అగరకర్ణ+యాన' అనే దానికి క్రమంగా 'అలస+'గరకర్ణ' లేనిది+యాన' అని అవుతుంది. 'గరకర్ణ' శబ్దం లేదన్న మాట. అప్పుడు 'అలసయాన' మాత్రమే మిగులుతుంది. దాని అర్థము 'మందయాన'. ఇప్పుడు మొత్తానికి అర్థం చూడండి. 'మందయాన ముంగురులు తుమ్మెదల మొత్తాన్ని నవ్వుతాయి' అని అర్థము వస్తుంది. ఇది నేయార్థమేకాక మరేమవుతుంది?

ఇంత సుకరంగా అర్థసిద్ధి, లక్ష్యసిద్ధి కలుగుతూ ఉండగా లక్ష్య, లక్షణాలు రెండున్నూ దుష్టములని శాస్త్రిగారు సెలవివ్వటం తొందరపాటు మాత్రమే కాగలదని నా ఊహ. ఈ రకమైన తొందర పాట్లు, పొరపాట్లు పలుతావుల ఆ గ్రంథంలో ఉన్నాయి. పని పడ్డప్పుడు, అవకాశం చిక్కినప్పుడు వాటిని గురించి ప్రస్తావిస్తాను.

ఆంధ్ర, ఉస్మానియా, మద్రాసు విశ్వవిద్యాలయాలలోను, ఆంధ్రసారస్వత పరిషత్తు వారిచేతను ఈ గ్రంథము పాఠ్యముగా నిర్ణయింపబడింది. మలిపలుకులో శ్రీ శాస్త్రిగారు వేసిన తేదీ 26-11-1945. నేటికి 28 సం॥లు క్రిందట వ్రాసినారనుకోవచ్చు. వీరికి ముందు వ్యాఖ్యానించినవారు శ్రీ వింజమూరి కృష్ణమాచార్యులు, శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులవారు. శాస్త్రిగారి సంశయాలు తీర్చినవారు శిరోమణి శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు. ఇంత మందిలో ఏ ఒక్కరుగాని దీనికి సరిఅయిన రీతిని సమన్వయం చేయరైరి. ఇప్పటికి సుమారు అర్థ శతాబ్దిగా ఈ సమన్వయ మిట్లే ఆంధ్రదేశమున ప్రచార మందుండటంవల్ల ఇంత వివరణ వ్రాయవలసివచ్చింది. విద్వాంసులు దీనిలోని నిజానిజాలను, సారమును గ్రహించ ప్రార్థన.

ఎఱ్ఱ గులాబీ

శ్రీ వి. వి. బి. రామారావు

"ఏయ్! కొంచెం చూసుకోకూడదూ? ఏమిటా హడావుడి' అంటూ లేచాను. కూలివాడు తెస్తున్నపెట్టె కాలివేళ్లకు తగిలింది. రాత్రి చాలా సేపు క్రింద బర్తుమీద రైల్వే గుమాస్తాతో మాటాడుతోంటే గడచిపోయింది. తెల్లవారేసరికి విజయవాడ స్టేషన్లో కోలాహలం. ఎలానూ తెలివి వచ్చేసిందికదా అని క్రిందకి దిగి చూశాను. రైల్వే గుమాస్తా ఎవరితోనో మాటాడుతున్నాడు.

'ఇంక రైలుమీదకి పోదు సార్. ఇక్కడ దిగి ఊళ్లోకి వెళ్లడం మంచిది. ఉక్కు కర్మాగారం ఆందోళనకారులు ఎక్కడంటే అక్కడ రైళ్లు ఆపేస్తున్నారట.'

'చచ్చాం' అనుకున్నాను.

'ఏమండీ. అయితే ఇప్పుడేం చేద్దాం?'

'ఈ ఊళ్లో మీ వాళ్లెవరూ లేరా?'

'లేరండీ, అయినా పండగ శలవలకని బయలుదేరాను. ఇల్లు వదలి అప్పుడే ఆరునెలలైంది. రేపయినా బయలుదేరుతుందా?'

'అబ్బే అది ఎవరికీ తెలియదండీ. ఒక రోజుతో పరిష్కారమయ్యేటట్టులేదీ సమస్య.'

'పోనీ బస్సులేమన్నా ఉన్నయ్యేమో?'

'చూద్దాం రండి. నాకూ విశాఖ వెళ్లాల్సిన జరుగురు పని ఉంది. ఎందుకేనా మంచిది రిటైరింగ్ రూమ్‌లో సామాన్లు పడేసి పోదాం. ఓ రోజు అద్దెపోతే పోతుంది.'

ఇద్దరం స్నానాలుచేసి క్రింద రెస్టారెంటులో కాఫీ ఫలహారాలు ముగించుకుని బస్ స్టాండ్‌కు వెళ్లాం. ఓ అరగంటక్రితం రాజమండ్రి వెళ్లవలసిన బస్సు వెళ్లిపోయిందన్నారు. కాని పూర్తిగా గమ్యం చేరుతుందనే నమ్మకం ఎవరికీ లేదట. పోనీ లారీ ఏదైన ప్రయత్నం చేద్దామన్నా సామాన్లు తెచ్చుకొనేవరకు వాడుండవద్దూ? చేసేదిలేక రిటైరింగు రూమ్‌కి వచ్చాము. సాయంకాలం ఊసుపోక ఇద్దరం సినిమాకు వెళ్లాము. ఏదో హిందీ సినిమా చూసి పదింటికి గదికి చేరాం.

ఎప్పటికప్పుడే రైలు వచ్చేస్తుందనుకున్నాము. రెండు రోజులు గడిచాయి. పరిస్థితి మెరుగుపడలేదు. నా జేబులో డబ్బులైపోయాయి. ప్లాటు ఫారంమీద ఆగిపోయిన ప్రయాణీకులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. వాళ్ల ధర్మమా అంటూ గది అద్దె కూడా అడగలేదు. మాకు భోజనం బేరర్ గదికే తెచ్చేవాడు: మీల్స్ పాకెట్స్‌కోసం క్యూలో నిలబడ్డ వాళ్లను చూస్తే జాలివేసేది. ఉచిత భోజనం చేస్తూ రెండు పూటలయ్యింది. ఏం చెయ్యడమా అని ఆలోచిస్తున్నాను రోజు పొద్దున్నే. రైల్వే గుమాస్తా రమణమూర్తి ఆదరాబాదరా లోపలికి పరిగెత్తుకొచ్చాడు. 'టాక్సీ ఒకటి హైదరాబాదు పోతోంది. మళ్లీ గొడవలు చల్లబడిన తరువాత విశాఖపట్నం వెళ్లవచ్చు. నేవస్తా రావుగారూ' అంటూ పెట్టె బెడ్డింగు పట్టించుకుని వెళ్లిపోయాడు.

నాకు మతి పోయినట్టయింది.

'గది చిమ్మమంటారా?' అంటూ ఒకమ్మాయి వచ్చింది చేతిలో చీపురుంది. లేకపోతే గది చిమ్మే అమ్మాయిలా కనపడలేదు. 'ఎంత నాజూగ్గా ఉంది'

అనుకుని బయటకువచ్చి నిలబడ్డాను. ఆ అమ్మాయి గురించే ఆలోచిస్తున్నాను. గది తుడిచి అమ్మాయి వెళిపోయింది. నాకు తక్కున జ్ఞాపకం వచ్చింది మామయ్య సంగతి.

అప్పటి నాకైదారేళ్ళుండవచ్చు — తాతగారింటి వద్ద పెద్ద రాద్ధాంతం. ఆ సంఘటన నా మనస్సుకు గట్టిగా హత్తుకుపోయింది. మామయ్యను తాతగారు గట్టిగా కొట్టారు. మామయ్యంటే నాకెంతో ఇష్టం. నాతో ఆటలాడేవాడు. కథలు చెప్పేవాడు. 'కమ్యూనిస్టు' అంటే అప్పుడు నాకేం తెలిసేది కాదు. ఏదో ఘోరమైన తిట్టు అనుకునేవాడిని. ఆ మాట తాతగారనేసరికి మామయ్య తాతగారిమీద ఎదురు తిరిగాడు. 'ఛీ, వెధవా, నీ మొహం నాకు చూపించకు. ఎలా బ్రతుకుతావో; బ్రతుకు, ఫో.' రాజమండ్రి కాలేజీలో చదువుకున్న మావయ్య మళ్ళీ ఇంటికి రాలేదు. అడపా తడపా నాన్నగారు, అమ్మ మామయ్య గురించి మాటాడుకుంటున్నప్పుడు వింటుండేవాడిని. మామయ్య సంఘసంస్కర్తగా మారాడట. నిరీశ్వరవాది ఐపోయాట్ట. హరిజనుల అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడట. నాన్నగారు నామీద కోపం వస్తే 'ఓయ్, నీ కొడుకు మీ అన్నలా తయారౌతాడేమోనే' అంటూ ఉండేవారు.

తాతగారు, అమ్మమ్మ మామయ్య గురించి ఎప్పుడూ మాటాడేవారు కాదు. కాని దిగులుగా ఎప్పుడూ, ఏదో ఆలోచిస్తూ ఉండేవారు. అమమ్మ పోయినప్పుడుకాని మరో రెండేళ్ల తరువాత తాతగారు పోయినప్పుడుకాని మామయ్య మరి రాలేదు. తాతగారు ఆస్తి అమ్మపేర వ్రాశేశారు. ఎంత సంఘసంస్కర్త అయితే మాత్రం తల్లిమీదా, తండ్రిమీదా అంత అక్కసా అనుకునేవాడిని. మామయ్య హరిజనుల అమ్మాయిని ఎలా చేసుకోగలిగాడో వాళ్లకూ మనకూ ఎలా కుదురుతుంది? ఆశ్చర్యంగా ఉండేది నాకు.

మామయ్య ఏదో పత్రికకు సంపాదకుడిగా విజయవాడలో ఉంటున్నాడని జ్ఞాపకం వచ్చింది. ఆ పత్రిక పేరు జ్ఞాపకంలేదు...డబ్బులైపోయాయి. పోనీ మామయ్యకు కబురు పెడితే...

రూం ఎటెండెంట్ వచ్చాడు.

'అబ్బాయ్, ఓ పనిచేసి పెడతావా?'

'చెప్పండి సార్...ఎవరైనా ... అమ్మాయి... నసిగాడు.

ముందు నాకు బోధపడలేదు. తరువాత తట్టింది. 'చచ్చాం' అనుకున్నాను.

'ఏంలేదబ్బాయ్, ఈ ఊళ్ళో శాంతిస్వరూప్ అనే ఆయన ఉన్నాడు. ఆయన కెక్కడో ఓ ప్రెస్ ఉందట. ఆయన ఎక్కడుంటాడో నీ కేమైనాతెలుసా?'

'పత్రికాయన కదండీ...ఆ మాలోళ్ల అమ్మాయిని కట్టుకున్నాయనేనా ?' నా కేమనాలో తోచలేదు.

'నీవు వెళ్లి అతనికో ఉత్తరం ఇస్తాను. ఇచ్చి రాగలవా ?'

డైరీలో కాయితం చింపి రెండు వాక్యాలు రాశాను. 'ఓ వంద ఇస్తారు పట్టుకురా.'

'సరే సార్' అంటూ బయలుదేరాడు.

వాడు వెళ్ళి గంటన్నరయింది. 'నన్నుచూసి ఏ ఇరవైఏళ్ళో అయింది. నేను జ్ఞాపకం ఉంటానా' అనుమానం వేసింది. పోనీ ఎడ్రసు కనుక్కొని నేనే వెళ్లిఉంటే. ఎందుకు పంపానా అనుకున్నాను. ఒకవేళ మామయ్య డబ్బిచ్చి వీడే నన్ను మోసంచేస్తే...గది చిమ్మడాని కొచ్చిన అమ్మాయి జ్ఞాపకం వచ్చింది... పోనీ వెళ్లకపోడమే మంచిది.

ఎప్పుడు నిద్రపట్టేసిందో. క్రింద ఆందోళన కారులు చేస్తున్న చప్పుళ్లకి తెలివి వచ్చింది. ప్లాటుఫారంమీద గడియారాలన్నీ ముక్క ముక్క లయ్యాయి. వెయింగ్ మెషీన్లు అస్థిపంజరాల్లో నిలబడి ఉన్నాయి. ఎడ్వర్టయిజుమెంటు బోర్డులు, షోకేసులు ముక్క ముక్క లయ్యాయి. నే కిందకొచ్చి చూసేసరికి ప్లాటుఫారం నిర్మానుష్యంగా, జుత్తు విరగబోసుకుని ఏడుస్తున్న స్త్రీ విషణ్ణవదనంలా ఉంది. 'ప్లాటుఫారం నాశనంచేస్తే ఉక్కు కర్మాగారం వస్తుందా' అమాయకంగా అనుకున్నాను.

మళ్ళీ గది కెళ్ళేసరికి రూమ్ ఎటెండెంట్ వెనక మరో ఆయనతో వస్తున్నాడు.

'ఏం అబ్బాయ్, డబ్బు తెచ్చావా ?'

'లే దబ్బాయ్, నేనే వచ్చాను, ఇంటికి పద.' వెనకాల వచ్చిన మనిషి మావయ్యే.

'ఏం మావయ్యా, ఎన్నాళ్లకు చూశాను!' మిగిలిన విషయాలు మరచిపోయాను.

'రైళ్లు ఎప్పుడు బయలుదేరుతాయో, ఇలా ఇక్కడెన్నాళ్లుంటావ్. పద ఇంటికి పోదాం' అన్నాడు మామయ్య.

స్వయంగా తానే వస్తాడనుకోలేదు. వెళ్లకపోతే మామయ్య ఏమనుకుంటాడో...వాళ్ల సంసారం ఓ సారి చూడాలనిపించింది. బెడ్డింగ్ సర్ది గదితాళం అధికారులకిచ్చి మామయ్యవెంట బయలుదేరాను.

మామయ్య లోపలకెళ్లి చెప్పాడు గామోసు. 'రా బాబూ' అంటూ ఆవిడ బయటకు వచ్చింది. మాట చాలా యాసగా ఉంటుందనుకున్నాను. కాని ఉచ్చారణ స్పష్టంగానే ఉంది.

'అత్తయ్యా' అనడానికి మనసు రాలేదు కాని 'బాగున్నారా' అని మాత్రం కుశల ప్రశ్న వేశాను.

నన్నుచూసి తలుపు వెనకాల ఓ అమ్మాయి మసలుతున్నట్టయింది.

'అలా లోపల దాక్కుంటావేం. రా అమ్మాయ్, ఇదిగో ఇతను నీ మేనత్త కొడుకు. రావ్‌జీ' అన్నాడు మామయ్య.

ఇవతలకొచ్చి 'నమస్కారం' అంది. మొహం దించుకుని కూర్చున్న వాడిని గుండె దడదడలాడుతుండగా తలెత్తి చూశాను. చామన చాయ. పొడుగ్గా ఉంది. నవ్వితే సొట్లుపడే బుగ్గలు. అమ్మాయి నవ్వు తొందరిపించింది. చక్కని పలువరుస. మాటలు తేటగా ఉన్నాయి. నా కంట్లోకి సూటిగా చూసి మాటాడుతోంది. నేనే కళ్లు తిప్పుకున్నాను.

'వడ్డించాను' అని లోపలనుండి పిలిచింది మామయ్య భార్య. భోజనం చెయ్యనని అనలేదు నేను. లేచి కాళ్లు కడుక్కున్నాను.

బెజవాడ స్టాండర్డ్ మెనూ, దోసకాయ పప్పూ, గోంగూర పచ్చడీ, ఆవకాయా, కొంచెం కారం ఎక్కువైనా కమ్మగానే ఉన్నాయి. తలవంచుకుని తింటున్నాను.

'ఏం రావ్‌జీ, నాన్నా అమ్మా బావున్నారా?'

'బాగున్నారు' అని ఆపేశాను.

'ఏం చేస్తున్నావ్. చదువు పూర్తయ్యిందా... ఐఏయస్ లిస్టులో పేరుచూసి నువ్వేమో అనుకున్నాను.'

'అంత అదృష్టం లేదు మామయ్యా. బి. య్యే పాసయి ఇన్‌కమ్‌టాక్స్ ఇన్స్పెక్టర్ (ట్రెయినింగవు తున్నా హైదరాబాదులో. నాన్నగారు ఇంకా ఆ చిన్న ఉద్యోగమే చేస్తున్నారు. నా చదువుకు డబ్బు చాలా కష్టం అయింది.'

కష్ట సుఖాలు తెలిసిన వాడివి. ఉద్యోగరీత్యా నీ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించి మనమంతా ఉవ్విళ్లూరుతున్న సామ్యవాద సిద్ధాంతాలను అమలుపరచి దేశాభివృద్ధికి ఇతోధికంగా కృషిచెయ్యి. ఎంత మెల్లగా నడచినా మరో నాలుగు తరాలలో దేశం పూర్తిగా మారి పోతుంది. కొద్దిమంది కోట్లమందిని దోచుకు తినే అనాగరిక వ్యవస్థను కూలదొయ్యడానికి కృషి చెయ్యాలి మనమందరం. సామ్యవాద రథ సారథుల్లో ఒకడివి. దేశాభ్యుదయంకోసం పనిచేసి మామకు తగ్గ...' ఆగిపొయ్యాడు మామయ్య. దగ్గు నటించి 'మజ్జిగ పొయ్యవోయ్' అన్నాడు.

మామయ్య ఉద్రేకం నాకు అర్థం కాకపోలేదు. తను నమ్మే సిద్ధాంతాలకోసం అనల్పమైన త్యాగాలు చేశాడు తను.

'ఇన్నాళ్లు స్టేషన్లో ఎందుకున్నావ్ బాబూ, నేరుగా వచ్చేసే పనికదా?' మళ్లీ ఆమె కదిపింది.

'ఆ ఏం లేదండీ, ఎప్పటికప్పుడే బయలుదేరుతాయేమోనని.' మీా సంగతి నేను మరచిపోయానన్న నిజం చెప్పడానికి ధైర్యం లేకపోయింది.

'ఏదోలే బాబూ. మీ అమ్మకీ, నాన్నగారికీ కూడా మేం శత్రువులమైపోయాము. మమ్మల్ని చూస్తే వారికి అసహ్యం.' అన్నాడు మామయ్య.

'పోన్లెద్దురూ, అవన్నీ ఇప్పుడెందుకు!' 'అత్తయ్య' సులువుగా ఫర్ గెట్ ఎండ్ ఫర్ గివ్ అన్న సిద్ధాంతాన్ని నమ్ముతున్నట్టనిపించింది.

'మావయ్యా, నా గురించే అడిగావుకాని మీ అమ్మాయి సంగతి చెప్పావు కాదు.'

'అమ్మాయి పేరు కరుణ. స్టెల్లామారిస్‌లో బి. య్యే చదువుతోంది. నాకు తగ్గ కూతురు... ఏమే అమ్మాయ్ అలా సిగ్గుపడతావేం.'

కరుణ మొహం సిగ్గుతో గులాబీలు పూసింది.

'ఏం, కరుణా, మీ ఊళ్లో చూడవలసిన వేమిటో చూపిస్తావా' చొరవచేసి మాట్లాడాను.

'నీకు ఏమి చూడాలనుందో చెబితే...'

'పోనీ నీకు చూపించాలనుకున్నవే చూపించు. సాయంకాలం వెళదాం.'

సాయంకాలం ఎండ తగ్గినతరువాత బయలుదేరాం. సన్నటి జరీ అంచున్న గులాబీచీర కట్టుకుంది కరుణ. ఎంతో సింపుల్‌గా ఉన్నా ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఘంటసాల పాత పాట 'సంజ వెలుంగులో...శశిరేఖవె నీవు' జ్ఞాపకం వచ్చింది. సంజ వెలుగు, పసిడిఛాయ, నారింజచెట్టు బ్యాక్‌గ్రౌండు ఎంత సన్నిహితంగా ఉంటాయి, సిగ్గులు చిందిస్తున్న గులాబీ సుందరి ఆకర్షణ విజయవాడలోని వేడిని మరిపింప చేసింది.

అలజడిదార్ల స్లోగన్స్‌తో ప్రతీ గోడా నాయకుల్ని ఆవేశపరచేటట్టున్నాయ్ (వాళ్లు వాటిని చూస్తే కద!). ఊళ్లో వాతావరణం టెన్షన్‌గా ఉంది. కొంచెంసేపు మేము మౌనంగానే నడచాము. ఆడపిల్లల వెనక నడిచే అలవాటు లేదు నాకు. కొంచెం దూరం వెళ్లిన తరువాత 'కాఫీ తాగుదామా?' అన్నాను.

ఇద్దరం ఓ హోటల్లో జొరబడ్డాం. కాఫీ ఆర్డరు చేశాను. ఏం మాటాడాలో తోచలేదు. కనకదుర్గ గుడి ఎక్కడో తెలుసా?'

తెలుసంది.

కాఫీ త్రాగి బయలుదేరాం.

'కారు' అంటూ చెయ్యిపట్టుకు లాగాను.

'మా కలవాటే బావా' బావ అని పిలుస్తే ఇంత తియ్యగా ఉంటుందన్నమాట.

'నువ్వె ఫడేనా నన్ను ఉంటావా గుడికి?' ప్రశ్న పూర్తయిన తరువాత జ్ఞాపకం వచ్చింది మామయ్య మాట.

'గుడికా, నీకు దేవుడిమీద నమ్మకం ఉందా బావా?'

'బావుంది. దేవుడిమీద నమ్మకం లేకపోతే మరి దేనిమీద ఉంటుంది?'

'అయితే నువ్వు భాగవతాన్ని, రామాయణాన్ని, మహాభారతాన్ని నమ్ముతావన్న మాట.'

'నమ్మకపోడమేమిటి. అవి మనజాతి సంస్కృతికి ప్రతిబింబాలు. మన మత గ్రంథాలు.'

'ఇంతచదువూ ఏం చదివావు బావా నువ్వు. అవి మత గ్రంథాలా? కేవలం లెజండ్స్. ఇతిహాసాలు. రామాయణం మహాభారతం కేవలం కవులు వ్రాసిన కావ్యాలు కాపోతే చాలా ప్రాచీనమైనవే. భగవద్గీత ఇతిహాసంమీద ఆధారపడిన ఓ ఇంటరెక్చ్యుయల్ డిప్ కోర్స్.'

'పోనీ ఏసు క్రీస్తుని నమ్ముతావా?' స్టెల్లామారిస్‌లో చదవుతోందికదా అని అడిగాను.

'పోబావా! కన్యకు మాతృత్వ మెలా సాధ్యం. పార్థినో జెనిసిస్, నేటి మానవుడి ఇంటలిజెన్స్‌కే అవమానకరం. కాని ఏసుక్రీస్తుని ఆదర్శమానవుడిగా మనందరికి ఓ మోడల్‌గా ఒప్పుకోడానికి నా కభ్యంతరం లేదు.'

ఇంత మత విద్రోహకరమైన మాటలు ఇంత చిన్నపిల్ల. చక్కనిది అంటుంటే కష్టమనిపించింది. నా మొహంలో ఆవేశం మండింది.

'అయితే మరి నువ్వు దేన్ని నమ్ముతావు?'

'మనిషికి మనిషి తోడ్పడాలనీ, తోటిమనిషికోసం స్వార్థాన్ని కొంచెం సేపయినా మరిచిపోయి వీలైనంత సహాయం చేయాలనీ...'

'దానికీ దేముడిలో నమ్మకం ఉండడానికీ సంబంధం?'

గుడివీధి వచ్చేసింది.

కరుణకు అవకాశం దొరికింది మాట మార్చడానికి.

గుడివీధిలో ఎవరింట్లోనో పెళ్లి. మైకులోంచి మంత్రాలు వినపడుతున్నాయి.

'పెళ్లి మంత్రాలు మైకు ముందర చదువుతారేం' అనుకున్నాను. నా ముఖం చూసి

'అవి అలా చదివితే మైలపడిపోతాయనా, అంత బాధపడుతున్నావ్ !'

నేనేమీ అనలేదు.

'పూర్వకాలం పెళ్లిళ్లలో ఫెర్టిలిటీ రిచ్యులల్స్ చేసేవారు. మన కిప్పుడు కావలసినది అది కాదు. నువ్వింకా అమ్మమ్మ తాతగారిలాగే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నావా, బావా.'

నేనేం అనాలో తోచలేదు.

గుడి దగ్గరకు వచ్చేసాం.

'అదిగో బావా కనకదుర్గగుడి. నువ్వొక్కడివే వెళతావా, నన్ను రమ్మన్నావా, లోపలకు రావడానికి నాకేం అభ్యంతరంలేదు.

ఆడపిల్లను ఒక్కర్తిని బయట వదలివెళ్లేంత శివ్రలి లేనివాడని కాదు.

'రా లోపలకు పోదాం, ఇంతలో నువ్వు భక్తురాలవైపోవులే' అంటూ టెంకాయ, పళ్లు, పూజా ద్రవ్యాలు కొని లోపలికి తీసుకెళ్లాను. పూజారి మంత్రాలు చదువుతూ నా పేరడిగాడు చెప్పాను. 'గోత్రం?' చెప్పాను.

నేను చెప్పిన సమాధానాలు వినిపించుకున్నట్టే లేదు. వల్లించేస్తున్నాడు...ధర్మపత్నీ సమేతస్య...మమ అనుకోండి...సహకుటుంబస్య, మను ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ ఫల పురుషార్థం...' నేను కళ్లు మూసుకుని చేతులు జోడించాను. కరుణ చేతులు జోడించిందో లేదో చూడలేదు.

అర్చన ఐపోయినతరువాత మళ్లీ బయటపడ్డాం. ఓ పది గజాలు వెళ్లాక 'హలో కరుణా' అంటూ పలకరించాడు ఓ యువకుడు నన్ను పరిచయం చేసింది' ఈయన కుమార్ అని ఓ కార్యకర్త. చాలా సరదా ఐన మనిషి.' ఏదో చెబుతోంది. ఇద్దరం ముందుకు నడుస్తున్నాం. మరి కొంతదూరం పోయాక ఎవరో రోడ్డు తుడిచే మనిషిలా ఉంది. ఆమెను కరుణ పలకరించింది.

'ఏం గౌరీ, మూడు రోజులై పాతానికి రావడం లేదు?'

'చంటాడికొంట్లో బాగులేదమ్మా. రేపటినుండి వస్తా. వీరెవరమ్మా?'

'మా బావ లే,' ముసి ముసి నవ్వులు నవ్వింది.

నాకు ఆరాటం ఎక్కువైంది విశాఖ చేరడానికి.

దూరంనుండి రైలుకూత మేఘ ఘర్జనలా వినపడింది.

నాగానందము:

గుణాఢ్యుడు - హర్షుడు

డా. ముదిగొండ శివప్రసాద్

సంస్కృతంలో భాస కాళిదాస భవభూతుల తర్వాత ప్రముఖస్థానాన్ని ఆక్రమించిన నాటకకర్త హర్ష చక్రవర్తి. ఈయన కన్యాకుబ్జాన్ని (కనోజ్) రాజధానిగా చేసుకొని 7 వ శతాబ్దంలో పరిపాలించిన ప్రభువు. బౌద్ధమతస్థుడు. గౌతమ బుద్ధుని అవతారమని చెప్పబడే జీమూత వాహనుని కథను 'నాగానంద' నాటకంగా రచించి యశస్సును పొందాడు. ఈ నాటకాన్ని గత ఇరవై సంవత్సరాలనుండి ఏదో ఒక రూపంలో ప్రతినిత్యమూ చదివే అదృష్టం నాకు లభించింది. నేను ఎం. ఏ. చదివేటప్పుడు దానిని సంస్కృతంలో పాఠ్య గ్రంథంగా చదివాను. ఆ తరువాత ఏదో ఒక తరగతికి పాఠ్య పుస్తకంగా బోధిస్తూనే వున్నాను. ఈ నాటకం ప్రస్తావనలో సూత్రధారుడు నాద్యంతంలో ప్రవేశించి 'ఇటీవల హర్ష చక్రవర్తి రచించిన నాగానందమనే నాటకాన్ని విద్యాధర జాతకకథా నిబద్ధమైన దానిని ఈ ఇంద్రోత్సవ సందర్భంలో ప్రదర్శించ బోతున్నాము' అని చెపుతాడు. ఈ విద్యాధర జాతక కథ ఎక్కడిది?? పైశాచీ ప్రాకృతంలో గుణాఢ్యుడు రచించిన 'బృహత్కథ'లోనిది. దానిని క్రీ. శ. 10 వ శతాబ్దంలో సోమదేవసూరి 'యధామూలకంగా' కథా సరిత్సాగరం అనే పేర సంస్కృతంలో రచించాడు. అందులో నాల్గవదైన నరవాహనదత్త జననలంబకంలో రెండవ తరంగంలో ఈ కథ వుంది. గర్భవతి అయిన వాసవదత్త విమానంలో ఉదయనునితోను యౌగంధరాయణునితోను కలసి విహారయాత్రచేస్తూ వుంటుంది. ఆమెకు అంతకుముందు తాను ఆకాశంలో ఎగురుతూ వుంటే విద్యాధర కన్యకలువచ్చి గానంచేస్తూ తన్ను సేవిస్తున్నట్లు స్వప్నం వస్తుంది. అందుకని ఈ విద్యాధరులనుగూర్చి వినగోరుతున్నానని ఆమె అడుగగా యౌగంధరాయణుడు 'అమ్మా! మీకు వచ్చింది దివ్య స్వప్నం. మీ గర్భాన విద్యాధరుడెవరో జన్మించ బోతున్నాడు. విద్యాధరులంటే మహాత్ములు. ఉదాహరణకు మహాసత్వుడూ, దానవీరుడూ అయిన జీమూతవాహనుడనే విద్యాధరుని కథను చెపుతాను వినండి' అని ఆ కథ చెపుతాడు—దీనిని హర్షుడు తన నాటకానికి ఇతివృత్తంగా స్వీకరించాడు.

హర్షుడు బౌద్ధమతస్థుడు. గుణాఢ్యుని కథలోనే జీమూతవాహనుడు 'దయాళువూ — బోధిసత్వాంశుడూ' అని పేర్కొనబడింది. అందువల్ల ఈ కథను హర్షుడు గ్రహించాడు. అయితే మూలకథను యథాతథంగా కాక నాటకానికి అనుగుణంగానూ తన బుద్ధికి నచ్చినవిధంగానూ కొన్ని మార్పులూ చేర్పులూ చేశాడు. ఈ పనిని బాసుడుకూడా చేశాడు కదా! వత్సరాజు కథ రెండు, మూడు లంబకాలలో వుంది. అందులో స్వప్నవృత్తాంతం లేదు. అది భాసుని కల్పన. అలాగే హర్షుడు కూడా అమూలకమైన కొన్ని కల్పనలు చేశాడు. అలాగే మూలాన్ని కొన్ని చోట్లు వదిలివేశాడు. ఆ తులనాత్మక పరిశీలనాన్ని ఈ వ్యాసంలో వివరిస్తాను. చిత్తగించండి:

వదిలివేసినవి

(1) మూలంలో జీమూతకేతువు ఉద్యానవనంలో ఒక కల్పవృక్షం వుంది. దానిని జీమూత

వాహనుడు మానవాళికోసం దానం చేస్తాడు. హర్షుడు ఈ వృత్తాంతాన్ని వదిలివేశాడు.

(2) గుణాఢ్యుని కథ ప్రకారం జీమూత వాహన—మలయవతులు పూర్వజన్మలో కూడా భార్యాభర్తలే. ఆ జన్మలో శివుని శాపంవల్ల వలభీ నగరంలో మహాధనుడనే వైశ్యునికి వసుదత్తుడనే కుమారునిగా ఒక విద్యాధరుడు జన్మిస్తాడు. అతని భార్య మనోవతి. స్నేహితు డొక శబరుడు. వీడే మరుజన్మలో జీమూతవాహన, మలయవతీ మిత్రావసువులుగా జన్మిస్తారు. ఈ కథ రమణీయంగా సుదీర్ఘంగా సాగుతుంది. అయినా హర్షుడు నాటక నిర్మాణ ఔచిత్యం దృష్ట్యా దీనిని వదిలివేశాడు.


(3) మూలంలో సౌపర్ణోపాఖ్యానగాథ వుంది. దీనిని వివరంగా శంఖచూడుడు జీమూతవాహనునికి చెపుతాడు. హర్షుడు ఈ గాథను మొత్తాన్ని వదిలివేశాడు. ఈ కథవల్ల గరుడుని ఔన్నత్యం సద్గుణం వ్యక్తమవుతున్నదే కాని ప్రతి నాయకత్వం ద్యోతకం కాలేదని బహుశా హర్షుడు ఉపసంహరించి ఉండవచ్చు.

కల్పనలు

అలాగే మూలంలో లేనివి కొన్ని హర్షుడు కల్పించాడు. కొన్ని సంఘటనలను తన అవసరానికి తగినట్లు మార్చి వాడుకున్నాడు.

(1) హర్షుడు చేసిన మొదటి పెద్దకల్పన, మలయవతీ ప్రణయ వృత్తాంతం. జీమూత వాహనుడు మలయవతిని ప్రేమిస్తాడు. కాని ఆమె మలయవతి అని తెలియదు. అందువల్ల మిత్రావసువువచ్చి మలయవతిని చేసుకోమంటే 'నేను వేరే స్త్రీని ప్రేమించాను. కాబట్టి మలయవతిని చేసుకోను' అంటాడు. ఇది విని మలయవతి ఆత్మహత్య చేసుకోబోతుంది. అప్పుడు నాయకుడువెళ్లి ఆమెను రక్షిస్తాడు. తాను ప్రేమించిన యువతియే మలయవతిఅన్న రహస్యం

Pearl
BINDI
PENCIL
పెరల్ బిందీ పెన్సిల్
మీ అందచందాలకు తగ్గట్లు
రంగు రంగులలో
ఇప్పుడు లభిస్తుంది
ఉత్పత్తిచేయువారు :
ది మద్రాసు పెన్సిల్ ఫ్యాక్టరీ
3. స్ట్రింగర్స్ వీధి, మద్రాసు-1



తెలిసిపోయి వాతావరణమంతా ఆనందంగా మారి పోతుంది. హర్షుడు ద్వితీయాంకం మొత్తమూ ఈ కల్పనతో నడిపాడు. ఇది పూర్తిగా అమూలకం.

(2) మూలంలో నాగుల దురదృష్ట వృత్తాంతాన్ని జీమూత వాహనునికి శంఖచూడుడే చెపుతాడు. అప్పుడు మిత్రా వసువుకూడా వింటాడు. ఆ తర్వాత శంఖచూడుడు గోకర్ణం పోగానే మిత్రావసువును ఏదో మిషబెట్టి నాయకుడు ఇంటికి పంపివేసి తాను వెళ్లి ఆత్మార్పణ చేసుకుంటాడు. దీనిని హర్షుడు పూర్తిగా మార్చివేశాడు. నాగానందంలో మిత్రావసువు ద్వారానే నాయకుడు నాగుల కథను వింటాడు. విన్న వెంటనే మిత్రావసువునెళ్లి పోవడం జీమూతవాహను డొక్కడే మిగలడం సంభవిస్తుంది. అప్పుడుకాని శంఖ చూడుడు రాడు. ఈ విషయంలో హర్షుని కల్పనమే ఉచితంగా వుంది. ఎందుకంటే శంఖచూడుని ముఖంగా నాగుల వృత్తాంతం విన్న తర్వాత మిత్రావసువు నాయకుణ్ణి ఒంటరిగా వదలి పోవడం అసంభవం, ఎందుకంటే జీమూతవాహనుని దాన వీరగుణం బావ మరిదికి బాగా తెలుసుకదా!

(3) నాగానందంలో జీమూతవాహనునికి పెండ్లి కానుకగా రెండు రక్తవస్త్రాలు తెచ్చి ఇస్తారు. వాటిని ఉపయోగించుకొని నాయకుడు శంఖచూడుని ప్రదేశంలో కూర్చొని గరుడుని మోసబుచ్చుతాడు. ఇదీ నాటకీయమైన చక్కని కల్పనమే—అమూలకం.

(4) నాగానందంలో నాయకుడు శంఖ చూడుని తల్లితో 'అమ్మా! నీ కుమారునికి బదులుగా నేను బలిదానం చేస్తాను' అని అంటాడు. దాని నామె తిరస్కరిస్తుంది. ఇదంతా అమూలకమే!

(5) నాగానందంలో నాయకుని చూడామణి జీమూతకేతువు ముందు పడుతుంది. అప్పుడు శంఖ చూడుడు వస్తాడు. 'నాయనా ఈ చూడామణి నీదా?' అంటాడు జీమూతకేతువు. 'నాది కాదు త్రిభువన చూడామణియే అపహరింపబడింద'ని నాయ కుణ్ణి సుపర్ణుడు తీసికొనిపోయిన వృత్తాంతం చెపు తాడు. దానితో నాయకుని తల్లితండ్రి భార్య నిప్పుతోసహా గరుడుడున్న ప్రదేశానికి బయలుదేరుతారు రోదిస్తూ. ఇది పూర్తిగా అమూలకం. చక్కని నాట కీయమైన కల్పనం.

(6) నాగానందంలో గరుత్మంతుడు నాయకుని పాదాలపైబడి తన తప్పును మన్నించమంటాడు. మూలంలో తార్క్ష్యుడు నాయకుని మాటలు 'గురూప దేశం'గా స్వీకరించాడని ఒక్కమాట మాత్రమే వుంది.

(7) మూలంలో గౌరీదేవి నాయకుని అమృతం చల్లుతుంది. నాగానందంలో గౌరి అనుగ్రహంవల్లనే నాయకుడు లేచి కూర్చుంటాడు. అమృత ప్రసక్తి లేదు.

(8) మూలంలో నాయకుని ఆత్మార్పణం వివాహమైన 'కొంత'కాలానికి జరిగినట్లు--ఈ లోపల జీమూతవాహన మలయవతులు సుఖించినట్లూ వుంది. దీనిని హర్షుడు మార్చివేసి పెండ్లిఅయిన వెంటనే బలిదానం చేసినట్లు వర్ణించాడు. ఇదికూడా నాటకీయ మైన కల్పనమే ! !

ఇలా హర్షుడు ప్రశంసాపాత్రమైన మార్పులు కొన్ని చేసినమాట వాస్తవమే! అయితే హర్షుడు తన్నుగూర్చి తాను 'నిపుణుడైన కవి' నని సూత్ర ధారుని ముఖతః చెప్పుకున్నాడు కదా, దీనికి పెద్దలు చూపే ఒక ప్రముఖ తార్కాణం మత సామరస్యం. మలయవతి బోధిసత్వావతారంయొక్క భార్య. అయినా ఆమె గౌరిని పూజిస్తుంది. గౌరివల్లనే భర్తను బ్రతికించుకుంటుంది. సుపర్ణుడు విష్ణువు వాహనం. అయినా బోధిసత్వుని పాదాలపైబడతాడు. ఇలా వైదిక—బౌద్ధమతాలమధ్య సామరస్యం హర్షుడు సాధించాడని అంటారు. మూలం చూచేవరకూ నేనూ నిజమే ననుకున్నాను. కాని ఇదంతా గుణాఢ్యుని కథ లోనే వున్నది కదా! అమూలకం కాని ఈ కథా కౌశలానికి హర్షుడెలా ప్రశంసాపాత్రుడు ?

హర్షుడు క్రీ. శ. 7 వ శతాబ్దంవాడు. గుణాఢ్యుడు శాతవాహనుని సమకాలికుడు. అంటే క్రీ పూ. రెండవ శతాబ్దం వాడు. సోమదేవసూరి క్రీ. శ. 10 వ శతాబ్దం వాడు. కాబట్టి హర్షుడు

సోమదేవసూరిని చదవలేదనీ బృహత్కథనుండే తనకు కావలసిన కథను చదివి ఎన్నుకున్నాడనీ స్పష్టమవుతుంది. అయితే నాగానందంలోనూ కథాసరిత్సాగరంలోనూ చాలా పంక్తులు ఒకదానికొకటి పోలి వున్నాయి.

(1) ఉదాహరణకు నాగానంద నాటకం ప్రథమాంకం. జీమూతవాహనుడు ఈ జగత్తు నశించేదే సుమా! అని చెప్పే బౌద్ధతత్వ బోధతో ప్రారంభమవుతుంది. ఈ వాక్యాలు యథాతథంగా సోమదేవసూరి గ్రంథంలోనూ వున్నాయి.

(2) అలాగే నాయకుడు గరుడుని నిందించడం, గరుడుని రెక్కల శబ్దానికి సముద్రం ఘూర్ణిల్లడం వంటి వెన్నో రెండింటిలోనూ సమానంగానే వున్నాయి.

అయితే సమయానుగుణంగా హర్షుడు చమత్కారాలు కొన్ని ప్రదర్శించాడు. 'నా రెక్కల తాకిడికి ఈ శబ్దమూ పుష్పాలూ వచ్చివుంటాయి' అని గరుడుడనుకుంటాడు నాయకునిపై దేవతలు పుష్ప వృష్టి కురిపించి దేవదుందుభులు మ్రోగించినప్పుడు. మూలంలో, 'ఈ పూలు ఎక్కడివా?' అని మాత్రమే సుపర్ణుడు ఆశ్చర్యపోతాడని ఒక్కవాక్యం మాత్రమే వుంది. ఇలాంటివెన్నో !!

మూలమూ, నాగానందమూ రెండూ చదివితే ఇద్దరూ మహాకవులేనని అనిపిస్తుంది మనకు. హర్షుడు స్వకపోలకల్పితమైన చమత్కారాలూ కవితా సౌందర్యాలూ చాలా తన నాటకంలో ప్రదర్శించాడు. నాయిక ముఖాన్ని కుసుమాకరోద్యానంతో పోలుస్తూ తృతీయాంకంలో నాయకుడు చేసిన వర్ణనమూ 'వర్ణ' శబ్దాన్ని శ్లేషించి విదూషకునివద్ద కల్పించిన హాస్యమూ 'నీ శరీరమే నీకు ఆభరణం వేరే ఆభరణాలు దేనికి?' అని నాయకుడు మలయవతిని వర్ణించడం వంటివెన్నో ఇందుకు ఉదాహరణగా చూపవచ్చు. కొన్ని చోట్ల (తృతీయాంకంలో) నేటి భావకవులను మించిన అత్యాధునిక వర్ణనలూ, భావాలూకూడా హర్షునిలో మనకు కనపడతాయి. అయితే తన గొప్పతనానికి లోపం వస్తుందనే భయంతో గుణాఢ్యుడు వాడిన ఎన్నో అలంకారాలను పూర్తిగా హర్షుడు వదిలివేశాడు. సౌపర్ణోపాఖ్యాన కథలో అమృతం నాక దలచిన నాగుల నాలుకలు చీలాయని చెపుతూ 'మిక్కిలి లోలగుణం కలవారు పరిహాసం పాలు కాకుండా ఎలా వుంటారు?' అని అర్థాంతర న్యాసాలంకారంలో చెపుతాడు గుణాఢ్యుడు. శంఖచూడుడు జీమూతవాహనునితో 'నాకొరకు నీవు బలిదానం చేయవద్దు. గాజుముక్కకోసం మౌక్తికాన్ని పోగొట్టుకుంటావా?' అంటాడు. గరుడుడు చల్లిన అమృతంతో బ్రతికిన నాగులు వేలావనంలో తిరుగుతూ పాతాళం వెళ్లుతూవుంటే 'వైనతేయుని భయం తీరి తమ ప్రాణదాత అయిన జీమూతవాహనుని దర్శనార్థం పాతాళమే పైకి వచ్చిందా అన్నట్లు ఉన్నదని ఉత్ప్రేక్షిస్తాడు గుణాఢ్యుడు. జీమూతవాహన మలయవతుల అన్యోన్య సందర్శనం 'వారి మనోమృగాలను పట్టదలచిన మదనుడు పన్నిన వలలాగా వున్నదంటాడు. ఇవేవీ నాగానందంలో లేవు. అందుకు కారణం గుణాఢ్యుని అలంకారాలు యథాతథంగా వాడుకున్నాడని ఆక్షేపిస్తారేమోనన్న హర్షుని భయమే కారణం కావచ్చు — అంతేకాని ఈ గుణాఢ్యాలంకార చమత్కృతులు నచ్చకపోవడం కారణంకాదు.

గుణాఢ్యుడు కొన్నివేల పాత్రలను బృహత్కథలో సృష్టించాడు. అందులో జీమూతవాహను డొకడు. కాని హర్షుడు తన నాగానంద 'నాటకానికి ఇతణ్ణి ఏకైక నాయకుణ్ణిగా ఎన్నుకోవడంతో ఇంకా ఎక్కువ శ్రద్ధ చూపించే అవకాశం కల్గింది. అందువల్లనే మూలంలో లేకున్నా నాగానందంలో నాయకుడు సంగీత చిత్రలేఖనాది విద్యలలో మహాప్రవీణుడనేందుకు ఎన్నో ఉదాహరణలు చూపాడు. సర్వకళాపాండితీ సంశోభితుడనీ సర్వాంగసుందరుడనీ అదృష్టరేఖలతో పుట్టినవాడనీ (ప్రథమాంకం — ముని వాక్యాలు) హర్షునిచేత వర్ణింపబడ్డాడు. ఇలా మూలకథ అనే బంగారాన్ని హర్షుడు సు'వర్ణ' కమలంగా 'దృశ్యం'గా తీర్చిదిద్దాడు.

కలగూరగంప

శ్రీ నోరివారి "నిలుస్తుంది — నిలవదు"

ఈనాడు అన్ని పత్రికల్లోనూ గ్రంథ సమీక్షల స్థాయి ఒకే విధంగా ఉంటున్నది. సమీక్షకుని 'హోదా' వచ్చిన ప్రతివాడూ—రచయితతో తనకు గల రాగద్వేషాలనుబట్టి, తనకున్న నిశ్చితాభిప్రాయాలనుబట్టి, అభిరుచులనుబట్టి సదరు 'హోదా'కు తగిన దర్పాన్ని ప్రదర్శిస్తూ 'విస్సన్న చెప్పిందే వేదం' అన్న ధోరణిలో ఏకపక్షంగా తీర్మానాలుచేసి పారెయ్యడమేగాని, నిర్వికార నిరంజన స్థితిలోఉండి రచనను సానుభూతితో పరిశీలించి సహృదయత ప్రదర్శించే యోగ్యత గలవాడు నల్లపూసై పోతున్నాడు. భారతి గ్రంథ విమర్శల స్థాయిగూడా ఈ మట్టాన్ని దాటి విస్తరించిన ఉదాహరణాలు అనేకంగా లేవు. పీఠికలోని రచయిత అభిప్రాయాలతో విభేదించి అంతే విమర్శ అని ఒకరంటే; ఫుట్ నోట్సుమీద విరుచుకుపడే వారు ఒకరు. మొత్తంమీద గ్రంథ సమీక్ష పేరుతో తమకు తెలిసిన విషయాలను వీలైనన్నిటిని ప్రదర్శించి నాపాండిత్యం చూశారా అని పోజుపెట్టే వారేగాని—సమీక్ష అన్నది ఒక సున్నిత వ్యవహారం అన్న నాణెం చూపేవారు చాలా అరుదు. సమీక్షకులు సాధారణంగా 'పీఠాధిపతుల హోదా'ను భజిస్తున్నారంటే, అది కొందరికి అతిశయోక్తి అనిపించవచ్చునేమో!

దరిదాపుగా నేను గమనించిన మేరకు శ్రీ నోరి నరసింహశాస్త్రిగారి సమీక్షా పద్ధతి యిలాంటిదే. మరి ఒకరిద్దరు ఇట్టి 'కులపతులు' ఉన్నారు. వారు తమ పేనాతో టిక్కుపెట్టిన పుస్తకాలు శిలా శాశ్వతంగా సర్వ సహృదయరంజకంగా ఉంటాయని; ఇంటూ కొట్టి పెదవి విరిచిన గ్రంథాలు ఇంక బ్రతికి బట్టకట్టవని—నిజంగా తమకా విశ్వాసం ఉందో లేదో తెలియదుగాని, ఇతరులనుమాత్రం—బేషరతుగా నమ్మవలసిందని తమ హోదాను పురస్కరించుకొని జడ్జిమెంటు ఇచ్చేస్తారు. ఐతే శ్రీ నోరి వారికివలెనే విమర్శ పరంపరకు మనస్సు చెడిపోయి ఆసుపత్రికి పోవలసిన దౌర్బల్యము, అన్యాయంగా విమర్శించి నా నిబ్బరం కోల్పోయి మాట్లాడే దౌర్బల్యం గ్రంథ రచయితలకు గూడా చాలామందికి లేదన్న సంగతి వారూ ముందు గుర్తించుకోగలరని ఆశిస్తున్నాను.

భారతి 1974—జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాలలో వచ్చిన 'అరవై యేళ్ల ఆంధ్ర సాహిత్యంలో నిలిచేది' అనే వ్యాసం చూచిం తర్వాత నేను పై నిశ్చయానికి రావలసి వచ్చింది. భారతి సంపాదకులు సదరు 'వ్యాసంలో వెల్లడించిన భావాలు రచయితవే' అని చెప్పి ప్రచురించినట్లే, దానికి సంబంధించిన కొన్ని భావాలు నావికూడా ప్రచురించగలరని వారిని అభ్యర్థిస్తున్నాను.

ఈ అరవైయేళ్ల (1913—74) ఆంధ్ర సాహిత్యంలో వారు చూచినవే బహుస్వల్పం. తమ 13 వ సం. నిండిందగ్గరనుంచీ 74 ఏళ్లు వచ్చేదాకా వారు చూచినవి; మిత్రుల జాబితాలు చూచి, సహృదయులతో సంప్రతించి యిటీవలి అయిదారు సంవత్సరాలుగా మథనపడి, పుస్తకం పేర్లతో సహా మరచిపోయిన, అలభ్యమైన, అముద్రితమైన వాటిని గూడా చేర్చుకొంటే 2 నెలలుగా వారు ఒక నిర్ణయానికి వచ్చి వ్రాసిన ఈ 11 పుటల వ్యాసంలో వారు పేర్కొన్న గ్రంథాలన్నీ కలిపి 150 కి—లోపే—మించలేదు! 'వదలినవి చూడవద్దు' అని నోరు విప్పి అడిగింతర్వాత వదలినవాటి జాబితా ఒకటి యిక్కడ అనవసరం.

వారు పేర్కొన్న గ్రంథాలలో 'ఇది నిలుస్తుంది—ఇది నిలవదు' అంటూ, అంతా తమ యిష్టమే అయినట్లు గిరిగీసి వేశారు. మాట వర

సకు మాత్రం రచన నిలిచేందుకు ప్రధాన కారణము 'రసవత్త్వము' అన్నారు. అంటూనే అదీ సాహిత్య సూత్రాలకు కట్టుపడదు కాబట్టి, నా మనసు చెప్పిందే ఫైనల్ డెసిషన్ దానికింక తిరుగు మంత్రం లేదన్నట్టు అభిప్రాయం వెలిబుచ్చారు.

సంస్కృతంలో కాలనిర్ణయం చేయ వీలులేని వేదాలు 'నిలిచి ఉన్నాయి' అంటున్నారు నోరివారు. నిలవ ఉండడము అంటే గ్రంథాలయాలలో నిలవ ఉండడము కాదని, అట్లయితే వస్తుప్రదర్శనశాలలలో లక్షల సంవత్సరాలనాటి జీవకోటుల అవశేషాలు కూడా నిలిచిఉన్నవనే అనుకోవలసివస్తుందని గూడా వారే అంటున్నారు. శ్రీవారి 'నిలుస్తుంది—నిలవదు' నిర్ణయానికి ఒక కొలతబద్ద వారికే లేదన్నమాట, వారి యిష్టానిష్టాలు తప్ప. వారు చెప్పిన గ్రంథపరమైన రసవత్త్వము లయ, ఛందస్సు, కాదంబరివంటి చిక్కని గద్యము, ఆత్మీయత—ఇట్టివి సాహిత్య స్థాయికి కొలమానాలని పేర్కొన్నారుగాని, తీరా వారి తీర్మానాలు మాత్రం వీటికి పొందుపడటంలేదు'

రచయితనుబట్టి, ఆయన కులమునుబట్టి (శ్రీ జాషువా ఆ జన్మ క్రైస్తవుడు), ఆయన గుణగణాలనుబట్టి (శ్రీ శ్రీ పబ్లికు జీవితము ప్రస్తావన), ఆయన వ్రాసిన పుస్తకంయొక్క 'లావు—లంబు'లను బట్టి, వాటికి వచ్చిన బహుమతులను—అవి యిచ్చిన సంస్థలనుబట్టి, తమ అభిరుచిని—ఇష్టానిష్టాలను—బట్టి, తమ దృష్టిలో వాటికున్న ప్రచారాన్నిబట్టి 'ఇది నిలుస్తుంది: ఇది నిలవదు' అన్నారు! తాము పేర్కొన్న గ్రంథాలలో తమవి పది పేర్కొన్నారు. తమకే నచ్చక తమవి రెండు నవలలు నిలవవని పేర్కొన్నందున వారికి పక్షపాతం ఆరోపించే వీలు లేదని 'లాయర్ పాయింట్' వేశారు. వారివే మూడు రూపకాలు, మూడు నవలలు, ఒక పెద్దకథ, ప్రస్తుత వ్యాసమూ నిలిచేవాటిలో చేర్చుకొన్నారు! అంటే వారు నిలుస్తుందంటే నిలుస్తుంది; నిలవదంటే నిలవదు—అన్నమాట గద!

వీరికున్నది—కట్టమంచివారికి ఆరోపించబడ్డ అధికార గర్వాంధ్యము లేదనుకుందాము—వినయమో, అతివినయమో — తెలియదు. అతివినయానికి పోయి మీ రచనలు వదలబోకండి అని ఒక యువమిత్రుడు వ్రాసినాడట. ఆయన సలహా పాటించి ఈ వ్యాసం గూడా నిలిచేవాటిలో చేర్చదలచినాను అంటున్నారు నోరివారు! తమను గురించి తాము, 'ఈ వ్యాసకర్త... పొందదలచినాడు; (నేను) ఒడిగట్టినాను' అని కొంత దూరం వచ్చాక, 'మా దృష్టిలో, మాకు సాహసము చాలదు, నాబోంట్ల సందేహము, అది నిలుస్తుందను కుంటాము, అనుకోము' అని దరువు మారుస్తారు! మొత్తానికి తమకు తాము పెద్దరికం ఆరోపించుకొని ఇతరులను పేర్కొనడంలో తారతమ్యం గూడా చూపారు నోరివారు. కొందరికి శ్రీ చేరుస్తారు. కొందరికి లేదు. కొందరికి గారు ఉంటుంది. మరికొందరికి వారు ఉంటుంది, కొందరికి ఏదీ ఉండదు. ఒకరిని ఉన్నాడు అని, ఒకరిని ఉన్నారు అని పేర్కొంటారు. 'శ్రీ శివశంకరులు' అని ఒకరికి గౌరవ బహువచనం—ఇట్లా మర్యాదలో గూడా ఒక రీతి లేదు.

ఖండకావ్యాలు, చిన్నకథలు కట్టగా ప్రభలని తోసివేశారు. కాని వారే గురజాడ పూర్ణమ్మకథ, చింతా దీక్షితుల హనుమంతునితోక, శ్రీ శ్రీ మహాప్రస్థాన గీతము, ఆయనదే ఒక సినిమాపాట ఇవి నిలుస్తాయంటారు! ఎంకిపాటలు, కాంతం కథలు—వీటిల్లో, ఇవి చిన్నచిన్న రచనల సంపుటులైనా, ఎంకి—కాంతం—అన్నిటిలోను ఒకే నాయిక అనుబంధంగా ఉంటున్నారు గనుక నిలుస్తాయట! కొన్ని రచనలు 'నిలుస్తవి—నిలవవు' అనడానికి రకరకాల సబబులు ఎక్కడికక్కడ తోచినవి తోచినట్టు—తూకంలేని మాటలు—చెప్పారు.

'కావ్యము మరీ పెద్దదైనా నిలచే గుణము ఉండడము కష్టసాధ్యము. ఏ వాల్మీకియో వ్యాసుడో చేయి చేసుకుంటేతప్ప! ఈకాలంలో ఆంధ్రదేశంలో వ్యాస వాల్మీకులు పుట్టలేదు.' అని నోరివారి తీర్పు. ఆనాటి వ్యాస వాల్మీకులే—పోనీ పుట్టలేదనుకుందాము : ఇంక పుట్టరని గూడా అనుకుందామా?—ఒకవేళ యిప్పుడు పుట్టితే వాళ్లు భారత రామాయణాలే వ్రాస్తారా? అభ్యుదయ

విప్లవ కవితలు వ్రాస్తారా? ' నిషాద!' అంటూ శోకించి శ్లోకించిన వాల్మీకి ఇప్పుడు పుడితే ఏ 'రామా యణం'ఎంతది వ్రాస్వాడో బుద్ధి జీవులు సహృదయులు ఆలోచించాలి! అసలు రచనను బట్టి రచయితకు విలువ వస్తుందా? రచయిత విలువను బట్టి రచన నిలుస్తుందా? ఇదిగూడా ఆలోచించవలసిన విషయమని, నా మట్టస మైన బుద్ధికి అరవని సంగతి అని దీన్ని మీకు వదిలేస్తున్నాను.

'మా దృష్టిలో 'కల్పవృక్షము మరీ పెద్దదై పోయినది. వ్యాస వాల్మీకులశక్తి ఆధునికులకున్న దన డానికి మాకు సాహసము చాలదు. అదిగాక అది వాల్మీకికి వ్యాఖ్యాన మంటున్నారు కవి. వ్యాఖ్యానాలు కావ్యాలు కావుగదా! దానికి జ్ఞానపీఠ పురస్కారము వచ్చినందుకు ఆనందమే, దాని విలువ లక్షరూపాయలు గనుక!' ఇట్లంటున్నరి నోరివారి మాటలు! బాల వ్యాకరణ రమణీయము నిలచి తీరుతుంద ! కారణాల కంటె నోరివారి నమ్మకము ముఖ్యము. వారు కల్ప వృక్షము నిలువదన్నారు కాబట్టి నిలువదు రమణీయము నిలచి తీరుతుందన్నారు కాబట్టి నిలచి తీరుతుంది. అంతే. వేదాలు నిలిచి, వ్యాకరణ వ్యాఖ్యానాలు నిలిచి, వ్యాఖ్యాన ప్రాయమైన కావ్యమే అగు కల్పవృక్షము నిలవవంటారు నోరివారు. వారి నోరికి బదులు చెప్పుట కేమున్నది? వ్యాఖ్యానాలలో రసవత్త్వము ఉండునా, ఉండదా?

జాషువా శ్రీశ్రీల కుల గుణ ప్రస్తావనలు అసంబద్ధము. ఏమిటా వ్యాస వాల్మీకుల కులగుణములు— పల్లికు జీవితములు—కంటె చెడిపోయినదా శ్రీశ్రీది?

'శ్రీ బాపిరాజుకు భావనా బల మున్నంతగా భాషాబలం లేదు. ఆ లోపము హిమబిందులోమాత్రం కనబడదు ఎక్కువగా. దాని భాషను శ్రీ కురుగంటి సీతారామయ్యగారు పరిష్కరించినట్లు తెలియవచ్చినది.' ఇట్టి అక్కరలేని మాటలు ఈ వ్యాసం నిండా పంచు కొన్నవి. ఉదాహరణకు మరికొన్ని చూపి ముగిస్తాను.

1. దాన్ని (ఎంకిపాటలు) నిలచే వాటిలో పరిగణించకపోతే దాని అభిమానులు బ్రతుకనివ్వరు.

2. ఆయన (శ్రీ దువ్వూరి రామిరెడ్డి) మంచి కవి అనడానికి శ్రీ అక్కిరాజు ఉమాకాన్తంగారి తీవ్ర విమర్శకు గురికావడమే పెద్దతార్కాణ.

3. హనుమద్రామ చంద్రభక్తి విస్తారమున్న ఆంధ్రంలో అది (హనుమంతుని తోక) తప్పక కల కాల ముంటుంది

4. అది (కీన్తు చరిత్ర) నిలుస్తుందను కుంటాము. కేంద్ర సాహిత్య అకాడమీ బహూకృతి లభించడము ఈ అభిప్రాయానికి బలం చేకూరు స్తున్నది.

5. ఆంధ్ర విశ్వవిద్యాలయము మొదట శ్రీ విశ్వనాథ 'వేయి పడగల'కు శ్రీ బాపిరాజు 'నారా యణరావు'కు బహుమతి పంచినది. వాళ్ల పేర్లు చూచి అని తోస్తుంది.

6. అది (లీలాసుందరి) కొత్తగా వచ్చిన రోజులలో, మా పిల్లలు చదివి పేజీలకు పేజీలు వరదాగా కంఠపాఠం చేశారు లీలాప్రాయంగా!

ఈ పై వాక్యాలు కొన్ని శ్రీ నోరివారి పరి శీలనా పాటవానికి మచ్చుతునకలుగా ప్రస్తావించాను. భారతి పాఠకులను బడిపిల్లలుగాఎంచి పై వాక్యాలను నేను వ్యాఖ్యానించి వివరించి అసంబద్ధతలు ఎత్తి చూపడం అపచారంగా భావిస్తాను. నోరివారు ఈ అరవైయేళ్ల సాహిత్యాన్ని ఎట్లా పఠించి తూకం వేశారో పై అంశాలు తెలుపుతాయి.

'అరవై యేళ్ల ఆంధ్ర సాహిత్యం' అంటే వారు చదివిన సాహిత్యమున్నమాట. తమ 13 వ యేటినుంచి చదివిన వాటిలో తమకు ఇప్పటికి జ్ఞాపక మున్న వాటిని—జ్ఞాపకం లేనివి పోయాయన్న మాట— మళ్లా చదివి, కొన్ని లభ్యం కాకపోతే ఆ పూర్వపు దృష్టితోనే వాటిని ప్రస్తావించి 'నిలుస్తవి—నిలవవు' అని తేల్చారు. తాము చదవని, తమ దృష్టికిరాని సాహిత్యం; అసలు తాము సాహిత్యమనే అనుకొనని సాహిత్యంకూడా ఉండవచ్చునన్న స్పృహ వారికి ఉన్నా దాన్ని పట్టించుకోవలసిన అక్కర లేదన్న 'ధీమా'తో

ఏది నిలుస్తుందో నిలవదో తమ యిష్టానిష్టాలనుబట్టి నోరు తెరవనీకుండా నిర్ణయించేశారు.

'కాలో హ్యయం నిరవధిః' అదొక్కటే చెప్ప గలదు—ఏది నిలుస్తుందో, నిలవదో! తక్కిన నిర్ణయా లన్నీ అభిప్రాయ భేదాలు; అభిరుచి నిర్దేశాలు మాత్రమే. —శ్రీ బండి నాగరాజు.

ముఖలింగంలోని లకులీశుని విగ్రహం


శ్రీకాకుళంజిల్లా యందలి ముఖలింగం గ్రామం ఒకప్పుడు ఉత్తరకోస్తా ఆంధ్రప్రాంతము నేలిన తూర్పు గాంగవంశరాజులకు ఆరు శతాబ్దములకు పైగా రాజధానియై భాసిల్లినది. తూర్పు గాంగరాజు లలో ప్రముఖుడైన అనంతవర్మ చోడగంగదేవుడు ఉత్కళమును జయించి, తన రాజధానిని క్రీ. శ. 1135 లో ఒరిస్సాలోని కటక్ నగరమునకు మార్చిన పిదప ముఖలింగపు ప్రాముఖ్యత క్రమముగా తగ్గిపోయి నది. ఆనాటి వైభవమునకు తార్కాణముగ ముఖ లింగంలో మూడు శైవ దేవాలయము లున్నవి. ముఖ లింగ ప్రాంతములో పాశుపత శైవమత ప్రాబల్యము నకు నిదర్శనముగ అచ్చటి ఆలయములలో లకులీశుని విగ్రహములు పెక్కు కలవు.

లకులీశుడు తను మత స్థాపకుడనియు, అతడు శివుని అవతారమనియు పాశుపత శైవ మతస్థులు నమ్మెదరు. శైవమత గ్రంథములలో కూడ లకు లీశుడు శివుని అవతారమనియే పేర్కొనబడెను. లింగ పురాణములో లకులీశుడు శివునియొక్క 28 వ అవ తారముగ చెప్పబడెను. కాని లకులీశుడు మానవు డనియు, అతడు గుజరాత్ రాష్ట్రములోని కాయా రోహణము (కార్వాన్) పట్టణమున క్రీ. శ. రెండవ శతాబ్దములో జన్మించెననియు మనకు శాసనముల ఆధారముగ తెలియుచున్నది.

లకులీశుడు ఎల్లప్పుడు లకుటమును ధరించు టచే అతనికి ఆ పేరు వచ్చెను. అతడు పాశుపత శైవమత సిద్ధాంతములకు ఒక రూపము దెచ్చి, ఆ మత ప్రచారము చేసెను. లకులీశుని శిష్యులలో ముఖ్యులు కుశికుడు, మిత్రుడు, గార్గ్యుడు, కౌరుష్యుడు అను వారు. లకులీశుని నిరంతర కృషివలన ఆతని శిష్యు లును, పాశుపత శైవ మతస్థుల సంఖ్యయు నానాటికి పెరిగెను. మధ్యయుగము నాటికి పాశుపత శైవ మతము నకు బహుళ ప్రచారము లభించి, ఆ మతస్థులలో లకులీశుడు దైవసంభూతుడే యను నమ్మకము గాఢ ముగ యేర్పడెను.

మధ్యయుగ కాలములో పాశుపత శైవమతము గుజరాత్, రాజస్థాన్, రాష్ట్రములనుండి మధ్యప్రదేశ్, అస్సామ్, బెంగాల్, ఒరిస్సా, ఆంధ్ర, తమిళనాడు, మైసూరు ప్రాంతములకు వ్యాపించి జనాదరణ పొందెను.

ముఖలింగ ప్రాంతమునకు పాశుపతశైవ మతము క్రీ. శ. 8 వ శతాబ్దములో ఒరిస్సానుండి వ్యాపిం చెను. ముఖలింగములోని లకులీశుని విగ్రహములు భువ నేశ్వరములోని లకులీశుని విగ్రహములను పోలియుండును.



సోమేశ్వరాలయములో లకులీశుని విగ్రహం, **ముఖలింగం.**

ముఖలింగంలోని లకులీశుని విగ్రహములలో ముఖ్యమైనది. సోమేశ్వరాలయపు గర్భగృహపు దక్షిణపు గోడపై వెలుపల ఒక గూటియందు ఉన్నది. ఇచ్చట

లకులీశుడు ఒక పద్మముపై ఆసీనుడై యోగాసనములో నున్నాడు. అతనికి నాలుగు చేతులు కలవు. రెండు చేతులు ధర్మచక్ర ప్రవర్తన ముద్రను చూపుచున్నవి. ఈ ముద్ర సాధారణముగ బుద్ధుని విగ్రహములలో కనుపించును. మిగిలిన రెండు చేతులలో అక్షమాల, త్రిశూలము లున్నవి. అతని ఫాలభాగముపై శివునికివలె త్రినేత్రము కలదు. అతడు ఊర్ధ్వ లింగముతో చిత్రించబడి యున్నాడు. అతని రెండు కళ్ళను సగము మూయబడి యోగము దలో నున్నట్లు చూపబడినవి. అతడు ఎల్లప్పుడు ధరించు లకుటము అతని ఎడమ భుజముపై ఆనించబడి, ఎడమ చేతితో చుట్టబడి యున్నది. లకులీశుడు త్రినేత్రము, ఊర్ధ్వ లింగములతో చూపబడుట వలనను అతడు ధరించిన జటామకుటము వలనను ఆ విగ్రహమును చెక్కిన ముఖలింగపు శిల్పి లకులీశుని శివుని అవతారముగనే చిత్రించినాడని చెప్పవచ్చును. లకులీశుని విగ్రహమునకు క్రింది భాగమున అతని శిష్యులు నల్గురు పద్మపు కాడకు రెండు వైపుల ఆసీనులై యున్నారు. ఆ గూటి చుట్టును పాశుపత శైవమత గురువుల చిత్రములు చెక్కబడి యున్నవి.

సోమేశ్వరాలయములోని లకులీశుని విగ్రహపు ప్రాముఖ్యత ఏమనగా ఇచ్చట అతడు చతుర్భుజుడుగా చెక్కబడియున్నాడు. అతని విగ్రహములలో నిటువంటిది మనదేశములో వేరొక్కటి మాత్రమే కలదు. అది ఒరిస్సాలోని భువనేశ్వరమునకు సమీపముననున్న భైరవ దేవాలయపు శిథిలములలో దొరికినది. భైరవ దేవాలయములో దొరికిన లకులీశుని విగ్రహమువంటిది మరొకటి భారతదేశములో ఎక్కడనులేదని డా॥ కె. సి. పాణిగ్రాహిగారు 'భువనేశ్వరములోని పురావస్తు కట్టడములు' అను గ్రంథములో వ్రాసియున్నారు. బహుశా అతని దృష్టికి ముఖలింగంలోని పై నుదహరింపబడిన లకులీశుని విగ్రహము వచ్చియుండక పోవచ్చును.

ముఖలింగంలోని దేవాలయములు క్రీ. శ. 9 వ శతాబ్దమునుండి 11 వ శతాబ్దపు మధ్యకాలములో కట్టబడినవి. వాటిలో చివరిదైన సోమేశ్వరాలయము క్రీ. శ. 11 వ శతాబ్దమునాటిది. కావున సోమేశ్వరాలయములోని లకులీశుని విగ్రహము కూడ ఆ కాలము నాటిదే.

— శ్రీ బట్టేపాటి మస్తానయ్య

భారతీయ జ్ఞానపీఠ బహుమతి గ్రహీత డా. బి. ఆర్. బేంద్రె

ఆధునిక కన్నడ కవికులగురు 'శ్రీ' అనిపించుకొన్న డా॥ దత్తాత్రేయ రామచంద్ర బేంద్రెగారికి 1973 సం॥రపు జ్ఞానపీఠ బహుమతి లభించింది. ఈ బహుమతిని ఒరియా రచయిత శ్రీ గోపీచంద్ మహంతిగారితోపాటు పంచుకోవటం నాకెంతో సంతోషమన్నారు డా॥ బేంద్రె.

డా॥ బేంద్రె మహామనస్వి. తత్వవేత్త. ప్రకృతిని పరమాత్మగా భావించిన మహనీయులు. కాలానుగుణ్యముగ రచయితలలో భావాలలో మార్పు అనివార్యమంటారాయన 'ముదిరిపోయిన పండుటాకులను చూచి చిగురుటాకులు నవ్వటం సహజం. కాలచక్ర క్రింద నలిగిపోకుండా, ప్రభంజనానికి వెనుదీయకుండా మహాసముద్రం మధ్యనున్న దీపస్తంభమువలె వెలిగేది నవ్యకావ్యం. సత్యములేని కావ్యం, నవ్యత అనే ముసుగు వేసుకొన్నప్పటికీ అది—కాకి నెమలి ఈకలను పెట్టుకొని నెమలిలా నటించినట్లుండును' అంటారు శ్రీ బేంద్రె.

డా॥ బేంద్రె దేశభక్తి విశిష్టమైనది. వారు వ్రాసిన దేశభక్తి గీతాలపై కోపంతో నాటి బ్రిటిష్ ప్రభుత్వమువారిని జైలుకు పంపింది. ధర్మంపేర, మతంపేర జరిగే దురన్యాయాలను వారు తీవ్రంగా ఖండించారు. వారు ఇరువదితొమ్మిది కవితా సంపుటాలను, తొమ్మిది సాహిత్య విమర్శనా గ్రంథాలను, మూడు నాటకాలనేకాక ఆంగ్ల హిందీ, సంస్కృత మరాఠీ భాషలనుండె పెక్కు రచనలను కన్నడీకరించి

వారు. బేంద్రెగారి 'నాకు తంతి' (నాలుగు తీగలు) అనే కవితా సంపుటికి జ్ఞానపీఠ బహుమతి లభించింది.


నూతన ప్రపంచములో అడుగుపెట్టే నవ మానవుని విజ్ఞానానికి లాలిపాట యీ కవితా సంకలనమంటారు.

డాక్టర్. బేంద్రె 31–1–1896 లో ధారవాడలో జన్మించారు. వీరి తండ్రి శ్రీ రామచంద్ర రావు. తల్లి అంబికాదేవి. తల్లిపట్లగల భక్తితోవారు 'అంబికా తనయదత్త' అనే కావ్యనామ ముంచుకొన్నారు. ధారవాడ పూనాలలో చదివి పట్టభద్రులైన తరువాత, తమ ముప్పది ఎనిమిదవ యేట ఎం. ఏ పరీక్షపాసై 1944 నుండి 1956 వరకు షోలాపూర్‌లోని డి. ఏ. వి. కళాశాలలో కన్నడ భాషాచార్యులుగ పనిచేసి ప్రస్తుతం ధారవాడలో స్థిరపడ్డారు. వీరికి యిప్పుడున్న వారు ముగ్గురు పుత్రులు. షుమారు ఏబదేండ్లక్రితం ధారవాడలో 'గెళెయర గుంపు' అనే సాహితీ మిత్రుల సంఘము స్థాపించి సాహిత్య, కవిత్వ చర్చలను ప్రారంభించారు. డా॥ వి. కె. గోకాక్, డా॥ ఆర్. యస్. ముగళి. మధురచెన్న, ఎం. పి. లింగణ్ణ మున్నగువిఖ్యాత రచయితలు యీ బృందములోనుండి పైకి వచ్చిన వారే.

బేంద్రేగారు కన్నడ భావగీతములను ప్రచార మొనర్చిన మహాకవులలో మేటివారు. వారి రచనలు పండితులను, పామరులను రంజింప గల్గినవి. వీరు అరవిందులపై అపారమైన భక్తి ప్రపత్తులుగలవారు.

అంకెలలోని ఆంతర్యాన్ని అన్వేషిస్తూ ప్రస్తుతము మరో బృహత్తర కావ్యరచనకు పూనుకొన్నారు. సారస్వత యోగిగా, మహాకవిగా, ఉదాత్తమానవుడుగా వెలుగొందుచున్న డా॥ బేంద్రెగారిని పూర్ణాయువులై మరిన్ని మహత్కావ్యములు రచించునట్లు వాగ్దేవి అనుగ్రహించుగాక.

—శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి



గ్రంథవిమర్శలు

సుమనోంజలిః

[సంస్కృత ఖండకావ్యం. ప్రణేత శ్రీ కే రాజన్న శాస్త్రి, సంస్కృత సాహిత్యరత్నం, విద్యాప్రవీణ, ఎం. ఏ., ఎం. ఒ. ఎల్. ఉపన్యాసకులు — సర్దార్ పటేల్ కాలేజి, సికిందరాబాదు. డెమ్మీ సైజు. ఆముఖాదులు కాక 40 పేజీలు. వెల రూ. 2–50.]

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశభాషలకు ప్రాముఖ్యం వచ్చింది. వాటితోపాటు దేవభాష అయిన సంస్కృతానికి ప్రచారం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వంవారు పేరుపడిన విద్వాంసులను పోషించడమే కాకుండా ఆధునికులు వ్రాసే సంస్కృత గ్రంథాల ముద్రణకు తోడ్పడుతూ ప్రోత్సాహం కలిగిస్తున్నారు. ఉత్సాహవంతులైన విద్వత్కవులు రచనలు సాగిస్తున్నారు. అట్టి రచనలలో ఈ 'సుమనోంజలి' ఒకటి.

ఏతద్గ్రంథకర్త రాజన్నశాస్త్రిగారు సంస్కృతాంగ్లాలలో విలువైన పట్టాలు సంపాదించిన విద్వత్కవులు. వారు రచించిన ఈ కృతిలో వివిధ శీర్షికలలో పదహారు కవితలు ఉన్నవి. కొన్ని స్తుతిరూపాలు. కొన్ని అన్యాపదేశాలు. కొన్ని వర్ణనాత్మకాలు. కొన్ని స్మృతిరూపాలు. కొన్ని ప్రశంసలు. రచయిత స్వగ్రామమైన ధర్మపురిలోని లక్ష్మీనృసింహస్వామిని గూర్చి వ్రాసిన 'లక్ష్మీనృసింహ భగవన్ తవ సుప్రభాతమ్' అనే సుప్రభాతం కూడా ఇందులో చేర్చబడినది.

సంస్కృతభాషలో కవిత్వం చెప్పడం, చెప్పి సహృదయులను రంజింపజేయడం చాలా కష్టం. ప్రతి భాషకూ కొన్ని సంప్రదాయా లుంటాయి. వాటికి విరుద్ధంగా వుండే కవిత్వం కవిత్వం కాదు. ఈ విషయాన్నే చెబుతూ దీని ఆముఖంలో డాక్టర్ పుల్లెల— శ్రీరామచంద్రుడుగారు 'వానిదగ్గర డబ్బు ఉన్నది' అనే దానికి 'తస్య సమీపే ధన మస్తి' అనేది సరియైన సంస్కృతం కాదనీ, పదాలు సంస్కృత పదాలే కాని, వాక్యరచనాపద్ధతి అసంస్కృతమనీ చెప్పియున్నారు. ఇంకా సులభంగా చెప్పాలంటే తరగతిలో ఉన్న విద్యార్థి 'ఒంటికి పోతున్నాను' అని ఉపాధ్యాయుణ్ణి అడగడానికి 'ఏకస్య గచ్ఛామి' అన్న రీతిది సంస్కృతమే కాదని గ్రహించాలి. రచయిత ఆంధ్రులయినా, గీర్వాణభాషలో గట్టి విద్వాంసులు, సరసకవులు కావడంవల్ల ఇందలి కవిత సంస్కృత సంప్రదాయబద్ధమై హృదయంగమంగా సాగినది. అందువల్లనే ఇది సుప్రసిద్ధ సంస్కృత విద్వాంసుల ప్రశంసలను అందుకోగల్గినది.

సంస్కృత శ్లోకాల్లో క్లిష్టాన్వయాలూ, పాదపూరణంకోసం వ్యర్థమైన 'చ—వై—తు—హి' మున్నగు పదాల ప్రయోగాలూ ఉండడం సర్వసాధారణం. ఇందలి శ్లోకాల్లో వ్యర్థపదాలు కానరావు. రచయితే క్లిష్టాన్వయం లేకుండానే సులభపద్ధతిలో సరసంగానే కవితను సాగించారు. అంతేకాకుండా పాఠకులు సులభంగా అర్థం చేసుకోడానికి అనుకూలంగా ఉండడానికి— అవసరమైన చోట్ల టిప్పణిని కూడా ఇవ్వడం జరిగింది. రచనా పాటవాన్ని వెల్లడించే కొలది ఉదాహరణలు —

'బలిపుష్ట విలసితం'లో (పుట. 3.) కాకి స్వభావం చక్కగా వర్ణితమై ఉన్నది.

> 'విషమం హి సమీక్షసే సమస్తం
> సతతం కామయసేఽ ప్యరిష్టమేవ,
> అథ కార్ష్ణ్య మురీకరోషి రూపే
> చిరజీవీ త్వమతోఽన్యథా కథం స్యాః'

వక్రవీక్షణం, అరిష్టం పయి కోరిక, నలుపురంగు, చిరజీవి అనే పేరు ఉండడం కాకి లక్షణాలు. పక్షులలో కాకి పాపి; 'పాపీ చిరాయుః' అని ప్రసిద్ధి.

పాపబుద్ధి ఉండడంవల్లనే దానికి 'చిరజీవి' అని పేరు రావడం ఇక్కడి ధ్వని. కాకి చాలాకాలం జీవిస్తుంది కూడాను.

లలితంగా ఉండే శ్లేషకు 'ప్రత్యూషం'లోని బాలసూర్యుని వర్ణన—(పుట. 4)

'అంబర మవలంబ్య కరై
రుత్తిష్ఠంతం శనైః శనైర్బాలమ్,
ఉపవేశయతి నిజాంకే
ప్రాచీ రక్తా విభావసుం హృద్యమ్.'

అంబరమంటే ఆకాశమూ, వస్త్రమున్నూ; కరములు కిరణాలూ, చేతులున్నూ; ప్రాచి తూర్పుదిక్కూ, ఒక మహిళామణిన్నీ; రక్త ఎర్రనిదీ, ప్రేమగలదిన్నీ, శ్లిష్ట పదప్రయోగం లేకుండానే ఈ రెండర్థాలూ ఇక్కడ తెలుస్తున్నవి.

ఇలా ఇంకా ఎన్నింటినో చూపవచ్చును.

స్వతంత్రభారతాన్ని గురించీ, గాంధీమహాత్ముని గురించీ, జవహర్‌లాల్ పండితుని గురించీ వ్రాసిన ప్రశస్త శ్లోకాలూ, పండిత నెహ్రూజీ, లాల్‌బహదూర్ శాస్త్రీజీ, ప్రకాశం పంతులుగార్లకు సమర్పించిన శ్రద్ధాంజలి, స్మృత్యంజలి శ్లోకాలూ హృద్యంగా ఉన్నవి.

అచ్చుతప్పులను గురించి ఎక్కువ చెప్పనక్కర లేదు. కాని ఒక్కలోపం కొట్టవచ్చినట్లు కానవస్తున్నది. తెలుగు పుస్తకాలయితే పాటించకపోతే పోవచ్చునుగాని సంస్కృత పుస్తకం పేరు పెద్ద అక్షరాలతో అట్టపైని, ముఖపత్రంమీద అచ్చువేసేటప్పుడు శ్రద్ధ చూపాలి. 'సుమనోంజలిః' అని ముద్రితమయింది. ఇది 'సుమనోఽంజలిః' అని అకార చిహ్నంతో కూడా ఉండడం అవసరం.

ఈ రచన సంస్కృత భాషాభిమాను లందరి హృదయాలనూ రంజింపజేయగలదని భావిస్తున్నాను.

వికాసలహరి

(వికాసమూర్తులను గురించిన సాహిత్యోపన్యాస మంజరి. డెమ్మీ 160 పేజీలు. వెల 6 రూ. యువభారతి 18–వ ప్రచురణ. ప్రతులకు—యువభారతి, 5. కింగ్స్‌వే, సికింద్రాబాదు—500003.)

అత్యల్పకాలం కిందట పుట్టినా, అనితరసాధ్యమైన సాహిత్యసేవ చేస్తూ, అక్షరాస్యులకు సాహిత్యంలో ఆసక్తిని కలుగజేస్తున్న ఉత్తమ సాహిత్య సంస్థ యువభారతి. సాహిత్యోద్యమ ప్రచారం ప్రధాన లక్ష్యంగా గల దీనికి 'రాజకీయాలతో ప్రమేయం లేదు. ఆదికవితనుండి అభ్యుదయ కవితదాకా సాహిత్యం ఏ మార్గంలో వెలువడినా అది ప్రజల కందాలన్నదే దాని ధ్యేయం...యువభారతి ఉత్తమ సాహిత్యాన్ని పరిచయం చేసే సాహిత్యసభలు, చర్చా సదస్సులు నిర్వహిస్తోంది.' గత సంవత్సరం అక్టోబరునుంచీ జరిగిన అయిదు సమావేశాల్లో పెద్ద లిచ్చిన మహోపన్యాసాలు 'వికాసలహరి'గా ఆవిర్భవించాయి. అవి నన్నయభట్టారకుడు, బమ్మెర పోతన, పింగళి సూరన, కందుకూరి వీరేశలింగం పంతులు, తిరుపతి వేంకటకవులు అనునవి. వీటిలో ఆద్యంతాల రచయిత డాక్టర్ వేంకటావధాని గారు. పోతనను గురించి డాక్టర్ నారాయణరెడ్డిగారు. పింగళి సూరనను గురించి డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం గారు, వీరేశలింగంగారిని గురించి ఆరుద్రగారూ వ్రాశారు. పింగళి సూరన్నపై వ్యాసం అన్నిటిన్నా విపులమైనది. పోతనను గూర్చినది సంగ్రహంగా ఉన్నది. విషయ వివేచనలో అన్నీ సమానస్థాయిలో ఉన్నవి.

మనవి

తమ రచన లన్నింటినీ, వ్యక్తుల పేర్ల కాక

సంపాదకుడు

భారతి

7, తంబుచెట్టి వీధి

మదరాసు—1 కే పంపాలని రచయితలకీ రచయిత్రులకీ మనవి.

—సంపాదకుడు.

వేంకటావధానిగారు నన్నయను గురించిన వ్యాసంలో నన్నయకాలం, భారతాంధ్రీకరణకు కారణం, కులబ్రాహ్మణశబ్ద చర్చ, నన్నయ రచనలు, ఆంధ్ర శబ్దచింతామణి కర్తృత్వం, భారతాంధ్రీకరణ పద్ధతి మున్నగు విషయాలను విపులంగా చర్చించారు. నన్నయను గురించి ఎరగని కొత్తవారికి కూడా ఆ విషయాలు ఆసక్తిని కలిగిస్తాయి. తిరుపతి వేంకటకవులను గురించి వ్రాసిన వ్యాసంలో ఆ జంటకవుల జీవిత విశేషాలు, కవిత్వావధానాలు, రాజదర్శన సమ్మానాలు, గ్రంథ రచన, ఉద్యోగాలు, వాద వివాదాలు మున్నగు పెక్కు విషయాలను వివరించారు. తిరుపతి కవిగారి పుత్రులు, ఆ కవులతో సన్నిహిత సంబంధం కలవారూ అయిన వేంకటావధానిగారే ఆ విషయాన్ని గురించి వ్రాయగల సమర్థులు. వారికి తెలిసినన్ని విషయాలు ఇతరులకు తెలియవనే చెప్పాలి. ఆ కవుల ప్రఖ్యాతిమాత్రం విని, కవితా విశేషాలను గుర్తెరుగని ఆధునికులకు ఈ వ్యాసం ఎంతో ఉపయుక్తమై ఉంటుంది. ప్రాచీన సంప్రదాయాలను విడవకుండా, యువకులను ఆకర్షించే నూతన పద్ధతిలో జనరంజకంగా కవిత్వంచెప్పి, శిష్యులనే కాకుండా ఏకలవ్య శిష్యులనున్నూ సంపాదించి, వారికి గౌరవాన్ని కలిగించిన ఈ జంటకవులకు మరెవ్వరూ దీటుకాలేదు. వారిని గురించిన ఈ వ్యాసం అవశ్యపఠనీయం.

డాక్టర్ నారాయణరెడ్డిగారు పోతన్నను గురించి వ్రాస్తూ, పోతన్న వినయపద్ధతినీ, రసవంతమైన తన కవిత్వం మూలంగా జనసామాన్యంలో భక్తి భావాన్ని ప్రచారం చేసిన విధానాన్నీ వివిధ భక్తి భావాల విశిష్టతను పాఠకులను విసుగెత్తించకుండా సంగ్రహంగా తెలిపారు. 'ఇమ్మను జేశ్వరాధముల' అనే పద్యం పోతన్నది కాదనీ, అతని శిష్యుడు ఏర్చూరి సింగయ్యయే వ్రాసి చొప్పించి ఉంటాడనీ సహేతుకంగా సమర్థించారు.

డాక్టర్ సుబ్రహ్మణ్యంగారు పింగళి సూరన్నను గురించి వివరిస్తూ, అతని ద్వ్యర్థికావ్యమైన రాఘవ పాండవీయాన్ని గురించీ, కళాపూర్ణోదయంలోని పాత్ర పోషణను, ఔచిత్యాన్ని గురించి విపులంగా తెలియజేశారు. ప్రభావతీ ప్రద్యుమ్నాన్ని గురించి అంతగా వ్రాయలేదు. అందలి 'శుచిముఖి'ని వివరించి వ్రాసి వుంటే బాగుండేది.

ఆరుద్రగారు వీరేశలింగం గారిని గురించి వ్రాసిన వ్యాసం విశిష్టమైనది. దీన్ని వ్రాయడానికి ఆయన ఎంతో పరిశోధనచేసి, ఎన్నో పుస్తకాలుచూచి, ఎన్నో విషయాలు వ్యక్తులవల్ల సంగ్రహించి ఉండాలి. విషయ పరిశీలనకేకాక, చదవడానికికూడా ఇది ఇంపుగా ఉన్నది. పంతులుగారి బహుముఖ సాహిత్యసేవ, సంఘ సంస్కరణ, ఆయా సందర్భాలలో ఆయన పడిన కష్టనష్టాలు, వాదోపవాదాలు, కార్యనిర్వహణా దక్షత, కీర్తిప్రతిష్ఠలు, వ్యతిరేక ప్రచారాలు మొదలైన విషయాలన్నీ వివరించబడి ఉన్నవి. పంతులుగార్ని గురించి తెలుసుకోవాలంటే దీనిని తప్పక చదవవలసి యున్నది.

వికాసమూర్తులైన ప్రాచీనాధునాతన వాఙ్మయ నిర్మాతలను గురించిన కవితా వికాసాలను వివరించే ఈ వికాసలహరి అక్షరాస్యులలో వికాసాన్ని కలిగించడానికి తోడ్పడగలదని నా నమ్మిక.

సీతా కల్యాణము

(యక్షగాన నాటకము. శ్రీ శాహ మహారాజ ప్రణీతము. సంపాదకులు—డాక్టర్ దివాకర్ల వేంకటావధాని, శ్రీ కె. వేంకటేశ్వరరావుగార్లు, డాక్టర్ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారి 'తొలి పలుకు'తో. రాయల్ సైజు—45+23 పేజీలు. వెల రూ. 3=75. ప్రచురణ— ప్రాప్తిస్థానం. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ అండ్ రిసెర్చి ఇన్‌స్టిట్యూటు, అఫ్‌జల్‌గంజ్, హైదరాబాదు—12.)

తెలుగు వాఙ్మయంలో యక్షగానాలకు ఒక ప్రత్యేక స్థానం ఉన్నది. ఈ విభాగానికి మూలం సంస్కృత వాఙ్మయమే అయినా, ఆంధ్రంలోనే దీనికి ఎక్కువ ప్రచారం ఉన్నట్లు కానవస్తున్నది. ఇవి ప్రజా సామాన్యపు ఆదరాన్నే కాకుండా పాలకుల ఆదరాన్ని

కూడా పొందుతూ వుండేవని చెప్పడానికి—వీటిని రచించిన ప్రభువులే తార్కాణం.

యక్షగానాల్లో ఈ సీతాకల్యాణం ఒకటి. రచయిత తంజావూరిని పాలించిన మహారాష్ట్ర ప్రభువులలో ఒకరైన శాహాజీ మహారాజు. ఆయన మాతృభాషనే కాకుండా సంస్కృతభాషనూ, ప్రాంతీయాలైన ద్రావిడాంధ్రాలనూ పోషించిన సాహిత్యాభిమాని. ఆయన రామాయణంలోని సీతాకల్యాణ ఘట్టాన్ని మాత్రం ఇతివృత్తంగా స్వీకరించి దీనిని రచించాడు.

జనకమహారాజు సీతాదేవి వివాహాన్ని గురించి మంత్రితో సంప్రతించడం, స్వయంవర ప్రకటన, వివిధ దేశాలనుండి రాజుల రాక, తనవద్దనున్న శివధనుస్సును ఎక్కుపెట్ట గలిగినవారికే సీత నిచ్చి వివాహం చెయ్యగలనని జనకుని ప్రతిజ్ఞ, రాజుల విఫల ప్రయత్నం, శ్రీరాముడు చేసిన శివధనుర్భంగం, దశరథాదుల రాక, రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల వివాహం ఇందలి ప్రధాన కథాంశం.

రామాయణ కథకూ, ఇందలి కథకూ కొంత భేదం కానవస్తున్నది. జనకుడు చంద్రవంశపు రాజని యిందులో ఉన్నది. దశరథునిది సూర్యవంశం. సూర్య, చంద్రవంశజులు సంబంధ బాంధవ్యాలు కలిగి వుండినట్లు కానరాదు. జనకుని పురోహితుడు శతానందుడు కాగా, ఇందులో వామదేవుడని చెప్పడం కొంత వింతగానే ఉన్నది.

ఈ గ్రంథం చిన్నదయినా, తొలిపలుకు, ఉపోద్ఘాతాలుమాత్రం మూలాన్ని మించి వున్నవి. వాటిలో గ్రహింపవలసిన అంశాలు ఎన్నో ఉన్నవి. డాక్టర్ గోపాలకృష్ణయ్యగారు 'తొలిపలుకు'లో యక్షగానాల చరిత్రను గురించీ, వాటి స్వరూప సంప్రదాయాలను గురించీ. మార్గదేశి, పద్ధతులను గురించీ, సంస్కృతాంధ్ర యక్షగానాల సారూప్య వైరూప్యాలను గురించీ, సీతాకల్యాణపు విశిష్టతనుగూర్చీ సవిమర్శంగా విలువైన విషయాలను వివరించారు. డాక్టర్ వేంకటావధానిగారు ఏతద్యక్షగాన ప్రాశస్త్యాన్ని విపులీకరించారు. యక్షగాలను గురించి ప్రత్యేక కృషి సల్పి పెక్కు విషయాలను ఆంధ్ర లోకానికి వెల్లడించిన డాక్టర్ యస్వీ జోగారావుగారి కృషిని ప్రశంసించి, యక్షగానాలకు వారు చెప్పిన లక్షణాలన్నీ సీతాకల్యాణంలో సమన్వయిస్తాయని తెలియజేశారు. దృశ్యరూపాలయిన యక్షగానాలు కొన్ని సంప్రదాయాలకు కట్టుపడి వుంటాయి. ఇవి ప్రాచీనకాలపు రాజమర్యాదలను తెలుసుకొనుటకు ప్రధాన సాధనాలు. ఆ సంప్రదాయాలు ఇందు పాటింపబడినవి.

యక్షగానాలు 'జయ' ఇత్యాది పదాలు మొదట ఉన్న దరువుతో ప్రారంభింపబడతాయి. తర్వాత దైవస్తుత్యాదికం. పిదప సూత్రధారుడు ప్రవేశించి గ్రంథాన్ని గురించీ, గ్రంథకర్తను గురించీ తెలియజేస్తాడు. తర్వాత పది, పన్నెండు ద్విపదలలో కథాంశం క్లుప్తంగా ఇవ్వబడుతుంది. తర్వాత విఘ్నేశ్వర పాత్రధారి ఒకడు ప్రవేశించి, ప్రదర్శకుల పూజలను అందుకుంటాడు. ఆ పైని కటికవాడు ప్రవేశించి హెచ్చరికను తెలుపును. తర్వాతనే కథా ప్రారంభం. కథ దరువులతోనూ, పద్యాలతోనూ, అక్కడక్కడ చిన్న చిన్న వచనాలతోను సాగుతుంది. గ్రంథాంతంలో సాధారణంగా ద్విపదలోగాని, గద్యలోగాని కృతి సమర్పణ జరుగుతుంది. సామాన్యంగా అంకితం దైవపరంగానే ఉంటుంది. ఇది వీని సామాన్య లక్షణం.

తంజావూరు పాలించిన నాయకరాజులూ, మహారాష్ట్ర రాజులూకూడా యక్షగాన వాఙ్మయాన్ని బాగా పోషించినట్లు అక్కడ లభించిన యక్షగానాల వల్లనే తెలుస్తున్నది. చాలా గ్రంథాలకు ప్రభువులే కృతికర్తలు. ఇవి అప్పట్లో ప్రజామోదాన్ని ఎక్కువగా పొంది ఉండినవి. మొన్న మొన్నటిదాకా వీని ప్రచారం తెలుగుదేశం అంతటా ఉండినది. కాని, క్రమక్రమంగా క్షీణదశకు వచ్చింది. వీటి ప్రదర్శనాలు అంతరించాయి. లుప్తప్రాయమయిపోతున్న ఈ వాఙ్మయ భాగాన్ని ఉద్ధరించడం వాఙ్మయాభిమానుల విధి. ఇట్టి స్థితిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ పరిశోధనసంస్థ మూలంగా అముద్రితంగా ఉండిపోయిన యక్షగానాలను ప్రకటించడం ఎంతో ప్రశంసనీయమైనది. 'సీతాకల్యాణం'

23 పేజీల చిన్న గ్రంథం. ఇది ప్రచారానికి రావాలంటే వెలను రు 3=75 కంటె ఎంతో తక్కువగా నిర్ణయించడం మేలు. తొలి పలుకు, ఉపోద్ఘాతాల పుటలను చాలావరకు తగ్గించినా, అందలి విషయాన్ని సంగ్రహంగా తెలుపుటకు అవకాశం లేకపోలేదు. మును ముందు గ్రంథాలను ప్రకటించేటప్పుడు ప్రకాశకులు ఈ అంశాలను గుర్తించగలరని అనుకొంటున్నాను.

—శ్రీ బులుసు వేంకటరమణయ్య.

శృంగార పదములు

(ప్రాచీన అజ్ఞాతకవి కృతము. సంపాదకులు శ్రీ పి. సీతాపతి, శ్రీ కె. వెంకటేశ్వరరావుగార్లు. రాయల్ సైజు. 54+54పుటలు. వెల రూ. 4=40. ప్రకాశకులు—ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ అండ్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్, అఫ్జల్‌గంజి, హైదరాబాదు—12.)

హైదరాబాదులో ఉన్న ఆంధ్రప్రదేశ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంవారూ, ఆ సంస్థకు చేరిన పరిశోధన సంస్థవారూ—ఇదివరలో అముద్రితాలైనవాటినీ, ముద్రితాలలో విశిష్ట పునర్ముద్రణలనూ ప్రకటిస్తున్నారు. అముద్రితాలలో ఈ 'శృంగార పదములు' ఒకటి. ఏనాడో రచితాలై మరుగుపడివున్న వీటిని సంపాదకులు పరిష్కరించి ప్రకటించారు. ఇందులో ఉన్న రెండు భాగాల్లోనూ మొదటిదానితో 31 పుటలలో గేయాలు, ద్వితీయ భాగంలో 20 పేజీల్లోనూ 52 సీసపద్యాలూ ఉన్నవి. పదమంటే గేయమే కాకుండా పద్యం కూడా అవుతుందనీ, అందువల నే గేయ పద్యాత్మకంగా ఉన్న ఈ పుస్తకం పేరు 'శృంగార పదములు' అని ఉండడం సముచితమే అని దీని పీఠికలో వాఙ్మయ మహాధ్యక్ష వడ్లమూడి—గోపాలకృష్ణయ్యగారు (డాక్టర్—కళాప్రపూర్ణ.) విపులంగా తెలియజేశారు. 'అత్యంత విపులమై, పరిశోధాత్మకమైన యీ పీఠికలో పదవాఙ్మయమంటే యేమిటో లోతుగా పరిశీలించి అపూర్వ సంగీత సాహిత్య శాస్త్ర విశేషాలు వెల్లడించడం జరిగింది. దక్షిణాంధ్రాన్ని పరిపాలించిన భోసల వంశీయుల చరిత్ర విషయంలోకూడా అనేక నూతన విషయాలు ఉల్లేఖించాను. ఈ పీఠికతో ఆంధ్ర వాఙ్మయ వ్యవస్థా సమన్వయంలో సమన్వయరహితంగా దారితప్పి నడచిన—పరిశోధనా విమర్శలు—సమన్వయ పురస్సరంగా సక్రమమైన రాజవీధిలో నిరాటంకంగా పయనిస్తా యని నిస్సందేహంగా చెప వచ్చు' అని పీఠికాకర్తలే వ్రాశారు.

ఏనాడో రచించబడి మరుగుపడివున్న యీ శృంగారపదాలు తంజావూరు సరస్వతీమహల్ లైబ్రరీలోని తాళపత్రప్రతుల మైక్రోఫిల్ములనుండి వ్రాయించి ప్రకాశకులు ప్రకటింపజేశారు. గేయాలూ, పద్యాలూ ఏకకర్తృకాలని చెప్పడానికి ఆధారాలు లేవు. గేయాల చివరి చరణాలలో

'ఏక రాజేంద్ర తనయ! లోకైక పాలక!
శ్రీకర తుళజరాజేంద్ర! భోగదేవేంద్ర.

అని తుళజరాజాంకితంగానూ, ఒక చోట

'రతికేళి జతగూడదా యేక
రాజసుత! శరభోజ ధీర!'

అనిన్నీ కానవస్తున్నది. మొత్తంమీద తులజరాజు పేరే అధికంగా ఉన్నది. ఇవి ఆ రాజుపై ఒక కవిగాని, ఎక్కువమందిగాని చెప్పారని అనుకోవచ్చు. తుళువ రాజనేది తుళుజాతి యువతి పుత్రుడని సూచిస్తు ందనీ, అది సముచితమై ఉండవచ్చునీ పీఠికాకర్తల అభిప్రాయం దీనికి బలమైన ఆధారాలు అవసరం.

పద్యాలు చెప్పిన కవి ఈ గేయ కవికంటె భిన్నుడు కావచ్చును. ఆ పద్యాలు నాయికా నాయకుల ప్రణయ విరహ శృంగారాలకు సంబంధించినవి ఉన్నాయి. ఇవి కూడా గేయాలవలెనే దక్షిణాంధ్రకవి రచితాలయి ఉండవలెను. చాలా పద్యాలలో చివరి పాదంలో 'ముద్దుటొయ్యారి' అనేది మకుటంగా కానవస్తుంది. ఈ పద్యాలు ఏదైనా శృంగార శతకానికి సంబంధించి ఉండినా ఉండవచ్చును. గేయాలు వ్యావహారిక భాషలోనూ, పద్యాలు గ్రాంథికంలోనూ ఉన్నాయి. రచన ఇంపుగా ఉన్నది. శృంగారం చక్కగా పోషించబడింది.

గోపాలకృష్ణయ్యగారు చెప్పినట్లు పీఠికలో ఎన్నో విషయాలు చర్చింపబడినవి. అవి—అక్షర—మాత్రాచ్ఛందో విషయాలు, గీతం, పద కవిత, వృత్త విచారం, పాద—చరణాల తత్వం, తెలుగులోని పద వాఙ్మయం, కృతికర్త ధాతుమాతువులు, విశిష్ట రాగాలు, ఆంధ్రులైన మహారాష్ట్రుల చారిత్రక విశేషాలు మున్నగునవి. ఈ పీఠిక సామాన్య పాఠకులకే కాక విద్వత్పరిశోధకులకున్నూ ఎంతో ఉపయుక్తమైనది. ఇందులోని గేయాలు, పద్యాలు చదివి లేక విని ఆనందించవచ్చును. పీఠిక పరిశోధనాసక్తి ఉన్న వారికి ఎంతో పనిని కలిగిస్తుంది.

గీతోత్తర భాగవతము

(కర్త : మహాకవి శ్రీ కల్లూరి వేంకట నారాయణరావు; డెమ్మీ సైజు. మొదటి భాగం 130 పేజీలు. రెండవ భాగం 92 పుటలు. ఒక్కొక్కటి 3 రూ. ప్రతులకు—శ్రీమతి కె. కమలమ్మ రిటైర్డ్ డి. ఇ. ఓ కాంపౌండు, రైల్వేస్టేషను దగ్గర, అనంతపూరు.)

ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహం మూలంగా కవిచరిత్రకారులుగా పేరుపడిన క. వేం. నారాయణ రావుగారు సరళంగా కవిత్వం చెప్పే సమర్థులని కూడా దీనివల్ల తెలుస్తున్నది. మొదటి భాగంలో మూడు, రెండో భాగంలో రెండూ వెరశి అయిదు స్కంధాల గ్రంథంలో తొలి స్కంధంలో గద్య, పద్యాలలో కలి యుగారంభ చరిత్ర, యుగలక్షణం, బ్రహ్మజ్ఞానం మొదలైన విషయాలు వెల్లడింపబడినవి. రెండవ స్కంధంలో కావ్యపద్ధతిలోనే రాఘవేంద్రస్వామి (మంత్రాలయ)వారి జీవితం, వారి మహిమలు, లోకాన్నను గ్రహించిన రీతి మున్నగునవి సవిస్తరంగా ఉన్నవి. తృతీయ స్కంధంలో నింబార్కాచార్యులు, కబీరు, నానక్ అను ఉత్తమభక్తుల సంగ్రహ చరిత్రము, వారి సిద్ధాంతములు దృశ్యరూపంగా కూర్చబడినవి. రెండవ భాగంలో చతుర్థ, పంచమ స్కంధాలున్నవి. అవి రెండూ ఏడేసి అంకముల నాటకములు. మొదటిది అహల్యాప్రసన్నరాఘవ నాటకం. ఇది రామాయణంలోని అహల్యా వృత్తాంతానికి సంబంధించినది. రెండవది బుద్ధనాటకం; గౌతమబుద్ధుని జీవిత విశేషాలనూ, సిద్ధాంతాలనూ, బోధలనూ ప్రతిపాదించే నాటకం.

ఈ నాటకాలు పాత్రోచిత భాషలో కాకుండా పూర్తిగా గ్రాంథిక భాషలోనే సాగాయి. సిద్ధాంత ప్రచారం, ఆశయ వివరణ ప్రధానంగా గ్రహించబడినవి. రసపోషణయెడలను, నాటకీయతను గురించి శ్రద్ధ చూపబడలేదు.

కవి అయినవాడు తన కవిత్వాన్ని ప్రదర్శించడంతో తృప్తి పడరాదనీ, ప్రతిరచనా ఆధ్యాత్మిక దృష్టితోను, నీతిబోధతోను, ఉత్తమశీల నిర్మాణ సంకల్పంతోను జరగాలనీ రచయిత సంకల్పం. రచన చాలా సరళంగా జరిగింది. భావాలు అందరికీ సులభంగా గ్రాహ్యమవుతాయి.

ఒక్కపద్యం—

'అభము శుభంబు లెవ్వియును
నంటని పావనుడవై జనించి, యా
విభుని విభూతి యౌ ప్రకృతి
పెంపున గాదము వృద్ధి నొందగ, ద
త్ప్రభవము కామలోభగుణ
పాతమునన్ బడి నైజవిద్య, నీ
వుభయము గోలుపోయి భవ
దూహకు నందని మాయ మ్రగ్గితే!

(1. భాగం. పుట. 13)

అచ్చుతప్పులు చాలా దొర్లాయి. మొదటిభాగం పెద్దఅక్షరాలలోనూ, రెండవభాగం చిన్నఅక్షరాలలోనూ ముద్రితమయాయి. కొన్ని పుటలు హెడ్డింగులతోనే ముగియడం వింతగా కానవస్తుంది. గ్రంథం చివర—

'శ్రీగీతోత్తర భాగవ
తాగను మందిరము భాగలైదును ముగిసెన్'

అని వున్నది. (వివరణ పట్టికలో). 'భాగ' అనేది సరి

కాదు. 'గాథలైదును' అని వుంటే సరిపోవచ్చునని తోస్తున్నది.

" ఆంగీరస "

పాంచజన్యం

(ఎమ్. ఎస్. గోల్వాల్కర్ ప్రసంగ సంపుటి. అనువాదం : ఘనశ్యామల. ప్రతులకు : జాగృతి ప్రచురణ. రామమందిరం వీధి, విజయవాడ–520002. వెల 15 రూ.లు 1 8 క్రౌను. క్యాలికో. 530 పుటలు.)

ఇది రాష్ట్రీయ స్వయంసేవక సిద్ధాంత ప్రతిపాదకమైన గ్రంథం. సంఘ భూతపూర్వ (మాజీ) అధ్యక్షులయిన (సర్ సంఘ చాలక్) కీ. శే. శ్రీ ఎం. ఎస్. గోల్వాల్కర్ (గురూజీ) ప్రసంగాలను వ్యాసాల రూపంలో వింగడించి ఈ గ్రంథాన్ని మొదట ఆంగ్లంలో బెంగుళూరులోని విక్రమ ప్రకాశన్ ట్రస్టు వారు 'బంచ్ ఆఫ్ థాట్స్' అనేపేర వెలువరించారు. దానికి శ్రీ ఘనశ్యామల చేసిన తెలుగు సేతయే ఈ పాంచజన్యం. ఇంత సమగ్రంగా సంఘతత్వంమీద ఒక సిద్ధాంత గ్రంథం రావడం ఇదే ప్రథమం.

రాష్ట్రీయ స్వయంసేవక సంఘం (ఆర్. ఎస్. ఎస్.) 1925 విజయదశమినాడు శ్రీ కేశవరావు బలీరామ్ హెడ్గేవార్‌చే నాగపూర్‌లో స్థాపింపబడింది. వీరినే డాక్టర్‌జీ అంటారు. డాక్టర్‌జీ మొదట కాంగ్రెసు కార్యకర్త. ఆ తర్వాత వివిధ విప్లవ సంస్థల కార్యకలాపాలనూ జాతీయోద్యమాలనూ పరిశీలించారు, భాగం పంచుకున్నారు. అయితే హిందూజాతి పునరుద్ధరణకు ఇవేవీ సాయం చేయవని చివరకు వారు నిశ్చయించుకొని ఈ సంస్థను స్థాపించారు.

సంఘ స్థాపింపబడేనాడు అందరి దృష్టి ఆంగ్లేయులను పారద్రోలడం అనే అంశంమీద కేంద్రీకృతమై వుండేది. అయితే డాక్టర్‌జీ 'ఆంగ్లేయులను పారద్రోలితే స్వాతంత్ర్యం రావచ్చు. నిజమే కాని అసలు ఆంగ్లేయులు ఎందుకు వచ్చారో తెలుసుకోవద్దా?' అని ఆలోచించారు. పరాక్రమశాలి అయిన ఈ జాతిని అరబ్బులూ మొగలులూ ఆంగ్లేయులూ ఫ్రెంచివారూ ఎలా జయించగలిగారు? ఎందువల్ల భారతజాతి పరాధీనమయింది?? అని తనను తాను డాక్టర్‌జీ ప్రశ్నించుకున్నారు. ఈ దేశ పరాజయానికి పాశ్చాత్యుల ఘనత, కారణం కాక మన బలహీనతయే కారణమని వారు మౌలికంగా నిర్వచించారు. కాబట్టి ఏ బలహీనత కారణంగా మనం వేయేళ్లుగా స్వాతంత్ర్యాన్ని కోల్పోయామో అది తొలగకుండా స్వాతంత్ర్యం వచ్చినంత మాత్రాన, ఆ స్వాతంత్ర్యం మాత్రం నిలుస్తుందని ఏమిటి నమ్మకం? అని డాక్టర్‌జీ నిశ్చయించుకున్నారు. ఈ సామాజికరోగానికి డాక్టర్‌జీ చూపిన విధానమే రాష్ట్రీయ స్వయంసేవక సంఘ సిద్ధాంతం.

సంఘ సంస్థాపకులయిన డాక్టర్‌జీ ఖండితంగా ప్రతిపాదించిన ఆ సిద్ధాంతమే వారి తర్వాత సంఘ నేతృత్వాన్ని స్వీకరించిన శ్రీ గురూజీ ఈ గ్రంథంలో సోదాహరణంగా సరళాతి సరళంగా శక్తివంతమయిన భావాలతో ప్రకటించారు. ఈ పుస్తకానికి 'పాంచజన్యం' అని పేరు పెట్టడంలో మోహంచేత వైక్లబ్యం చెందిన ఆనాటి నరునికి నారాయణుడు శంఖారావం విన్పించినట్లే అకర్మణ్యుడూ, వికర్మణ్యుడూ అయిన ఈ నాటి భారతీయునికి ఈ మాధవుడు (మాధవరావు సదాశివరావు గోల్వాల్కర్) విన్పించిన శంఖారావమే ఈ 'పాంచజన్యం' అని వివరింపబడింది. అయితే ఆ శంఖారావ సందేశమేమిటి? 'హిందూదేశం హిందువులది' అన్నది సంఘ మౌలిక సిద్ధాంతం. ఈ దేశంలో హిందువులు ముస్లిములు క్రైస్తవులు తదితరులు ఎందరో జీవిస్తున్నారు. వీరిలో ముస్లిములకు అరబ్ రిపబ్లిక్‌లోని దేశాలూ క్రైస్తవులకు, యు. ఎస్. ఏ. యు. కె. ఇలా ఎన్నో దేశాలూ మాతృసంస్థలూ వున్నాయి. కాని హిందువులకు జన్మభూమి జీవనాధార భూమీ ఈ భారతదేశం ఒక్కటే — అంతే కాదు ఈ దేశంలో జీవిస్తూ దీనిని మృణ్మయఖండంగా కాక చిన్మయిశక్తిగా పరాత్పరిగా శివస్వరూపంగా

విష్ణుసాకారంగా భావించి ఉపాసించేవాడు హిందువు మాత్రమే. కాబట్టి 'హిందూదేశం హిందువులది' అని ఇందులో సిద్ధాంతీకరింపబడింది. అతిథులు గృహానికి యజమానులు కానట్లే క్రైస్తవులు కాని ముస్లిములు కాని ఎవరైనాసరే ఈ దేశంలో ప్రవాహగతిగా వస్తున్న జీవన పద్ధతికి భిన్నమైన జీవన విధానాన్ని ఆచార వ్యవహారాలను అనుసరిస్తున్నంతవరకూ వారికీ దేశంమీద స్వామ్యం ఉండదని ఇందులో ఖండితంగా చెప్పబడింది. ఇది సంఘ సిద్ధాంతాలలో మౌలిక మైనదీ, అగ్రగణ్యమైనదీ.

సంఘ ప్రతిపాదించిన రెండవ సిద్ధాంతం 'సంఘటన'. ఆర్గనైజేషన్ అనే పదానికి సన్నిహితార్థంలో ఈ సంఘటన అనే పారిభాషిక పదం ఇందులో ప్రయోగింపబడింది. హిందువంటే ఎవరో ముందు చెప్పి అతడూ అతడి దేశమూ ఎందుకు వేయేండ్లుగా పతనమైందో చెప్పి ఆ పతనంనుండి ప్రాభవానికి నడిపించే తారకమంత్రం 'సంఘటన' అని డాక్టర్‌జీ ప్రతిపాదించారు. హిందువులలో భాష పేర ప్రాంతాల పేర, కులాల పేర వర్గాల పేర వర్ణాలపేర ఎన్నో విధాలుగా అనైకమత్యం పెరిగి ఇంతటి వైభవోపేతమైన స్వర్ణయుగ నిర్మాత భారతదేశంకూడా కేవలం ఉప్పు మిరపకాయ అమ్ముకొనేందుకు వచ్చిన ఈస్టిండియా కంపెనీకి పాదాక్రాంతమైంది. గజనీ విజయానికి గుజరాత్‌లోని రాజాకర్ణునియొక్క ప్రధానమంత్రి కారణం. ఘోరీ విజయానికి జయచంద్రుడు కారణం. అక్బర్ విజయానికి మానసింగ్ కారణం. పాశ్చాత్యుల విజయానికి స్థానికులైన పాలియగాళ్ళూ, జమీందారులూ, సంస్థానాధిపతులూ కారణం. వీరు తమలో తాము పరస్పరం కలహించుకుంటూ ఆ విద్వేషం కారణంగా దేశాన్ని ఎప్పుడూ శత్రువులకు అప్పజెప్పేవారు కాబట్టి ఈ జాతి తిరిగి తన ప్రాచీన వైభవాన్ని అందుకోవాలంటే హిందువులంతా సంఘటితమై ఉండటమే శరణ్యమని ఇందులో వివరింపబడింది.

ఈ సంఘటనకు డాక్టర్‌జీ సూచించిన కార్యపద్ధతి 'నిత్యశాఖ' ప్రతిదినమూ హిందూ కార్యకర్తలు (స్వయం సేవకులు అనేది వీరికి సంఘం నిర్దేశించిన పారిభాషికపదం.) ఒక నిర్ణీత స్థలంలో నిర్ణీత సమయంలో కలుసుకొని అనుశాసనబద్ధంగా ఆటలాడి పాటలుపాడి అనాదిగావస్తున్న భగవాధ్వజం (దేవాలయాలపై ఉండే కాషాయజండా) ముందు ప్రార్థన చేసి తిరిగి వెళ్లిపోవడంద్వారా శారీరక మానసిక వికాసాలు జరిగి జాతి ఉద్ధరింపబడుతుందని ఇందులో సూచింపబడింది. ఈ రకంగా నిత్యశాఖలో వ్యక్తి నిర్మాణం జరుగుతుంది. అతనిలో వ్యక్తిశీలం (Per:onal character) జాతీయ శీలం (Na ional character) తీర్చిదిద్దబడుతాయి. సంఘం సిద్ధాంత ప్రవచనానికికాక ఈ కార్యపద్ధతికే విశేషమైన ప్రాముఖ్యమిచ్చినట్లు ఈ గ్రంథంద్వారా స్పష్టమవుతుంది. ప్రచార పద్ధతులమీదా, పూలదండలమీద సంఘముకు విశ్వాసం లేదు. ఆ కారణంవల్లనే కావచ్చు సంఘం స్థాపింపబడిన యాభై సంవత్సరాలకు మొదటిసారిగా ఇదీ సంఘ సిద్ధాంతం అంటూ 'సమగ్రంగా' ఒక గ్రంథం రావడం జరిగింది. సంఘుకు వేరే సిద్ధాంతం లేదు. వేదాలలో ఉపనిషత్తులలో పురాణాలలో ఋషి పరంపరలో చెప్పబడిన సిద్ధాంతమే సంఘ సిద్ధాంతం. ఆ జీవన విధానమే మన పునరుద్ధరణ కార్యక్రమం. సంఘ అనేది నేడు దేశంలోని నూరు సంస్థలతోబాటు వచ్చిన నూటఒక్క సంస్థ కాదు. నూరు సంస్థలనూ జాతీయ దృష్టికి అనుగుణంగా ఆలోచింపజేయించి ఆచరింపజేయుంచే ఏకైకసంస్థ' అని ఇందులో స్పష్టీకరింపబడింది.

ఉపయోగకరమైన
సరికొత్త గ్రంథములు
వ్యవసాయము— పెపరి— కోళ్ల పెంపకము— ఆవులు— తోటపని— యింజనీరింగ్ —వైద్యము— ఇతర సాంకేతిక విషయములపై గ్రంథములు గలవు. తెలుగు ఉచితము. ఇంగ్లీషులో వ్రాయుండి.
N. K. PAUL & SONS,
P. B. No. 12202, Calcutta—5.

ఈ గ్రంథం మొత్తం నాలుగు భాగాలుగా అనుబంధంతో కూడా కలిసి ఇరవై నాలుగు అధ్యాయాలుగా విభజింపబడింది. ఈనాడు సమాజంలో ఆర్. ఎస్. ఎస్. మీద ఎన్నో నిందలూ విమర్శలూ వున్నాయి. 'ఇది పారా మిలటరీ ఆర్గనైజేషన్. ఇది మతసంస్థ హిందూ ముస్లిం ద్వేషాలను రెచ్చగొడుతున్నది. 'వంటి సిద్ధాంతపరమైన ఆరోపణలతోబాటు 'ఈ సంస్థవారు పిల్లలను అపహరిస్తారు' (Child Lifters) వంటి అల్లరి చిల్లరి ఆరోపణలు కూడా సుభద్రాజోషీవంటి వారినుండి ఈ సంస్థ మీద వచ్చాయి. వీటన్నింటికీ ఇందులో గురూజీ తాత్వికంగా సమాధానం చెప్పారు. ఈ సంస్థ పిల్లలమీద యువకులమీద దృష్టిని కేంద్రీకరిస్తున్నమాట నిజమే. అందులో చేరిన యువతయొక్క మనస్సులను కూడా అపహరిస్తున్నమాట నిజమే—అని మనకీ గ్రంథం చదివితే స్పష్టమవుతుంది.

ఈనాడు వర్తమాన భారతదేశం చతుష్పథంలో నిలబడివుంది. పాకీస్తాన్ విడిపోయినా కాశ్మీర్, ఢిల్లీ, కేరళలలో మత కలహాలు నశించలేదు. దేశంలో వివిధ రకాల విదేశీ శక్తులు విధ్వంసాన్ని ప్రేరేపిస్తున్నారు. ఇంగ్లీషువాడినుండి లక్షలాది దేశీయులు త్యాగంతో రక్త తర్పణంతో స్వాతంత్ర్యం సంపాదిస్తే నేడు తిరిగి దేశంలో 'మావో జిందాబాద్' అని ఈ దేశం పైకి విదేశీయులను ఆహ్వానించే ప్రయత్నాలు కన్పడుతున్నాయి. వ్యక్తిశీలం జాతీయశీలం లేని కారణంగా ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నమైంది. అవినీతి దోపిడీ పెచ్చుపెరిగింది. భాషలపేర ప్రాంతాలపేర రక్తపాతాలు సాగుతున్నాయి. వీటికి పరిష్కారం తెలియక జాతి నైరాశ్యంలో పడి ఇక 'విముక్తి' లేదనే మానసికమైన దివాలా కోరుతనానికి వచ్చింది. ఈ పాంచజన్యం ఈ సమస్య లన్నింటికే పరిష్కారం చూపుతున్నది. చెప్పడమేకాక చేసి చూపుతున్నది. 'వైభవశాలి అయిన అఖండభారతం స్థాపించి తీరుతాం' అని భారతీయులకు అభయహస్తాన్ని ఇస్తున్నది.

ఈ గ్రంథంలో మొదటి అధ్యాయంలో జాతీయ వాదం, అంతర్జాతీయ వాదానికి వ్యతిరేకం లేదని సిద్ధాంతీకరింపబడింది. 'భారతీయుణ్ణి మించిన అంతర్జాతీయవాది లేడు అని సోదాహరణంగా నిరూపింపబడింది.' ఆర్వాత అధ్యాయాలలో మాతృదేశవైభవమూ. మాతృభూమికి నిర్వచనంచెప్పి, భౌతికవాదమూ. సామ్యవాదమూ, సమాజవాదమూ, క్రైస్తవమూ, ఇస్లాం, ఎలా ఈజాతి జీవనాడిని పీల్చి పిప్పిచేస్తున్నాయో 12 వ అధ్యాయంలో చెప్పబడింది. 'ఇజా'ల వ్యామోహం వదిలి 'నిజా'న్ని తెలుసుకోమని (realistic approch) 'జాతీయ జీవామృతం' అనే 16 వ అధ్యాయంలో హెచ్చరింప బడింది. లోకంలో నీతిబోధలుకాక శక్తిమాత్రమే జయిస్తుంది. 'జరిగే' అమలులో వున్నవర్తమాన ప్రపంచంలో శక్తిశాలి అయిన జాతియే తన అస్తిత్వాన్ని కాపాడుకో గలుగుతుంది. కాబట్టి శక్తిద్వారానే, అజేయ హిందూత్వంద్వారానే దానవీశక్తులను నిర్జించి శాశ్వతమైన సుసంఘటితమైన హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించాలనీ, అదే, రామరాజ్యానికీ, సత్య (సత్య) యుగానికీ, విశ్వశాంతికీ దారితీస్తుందనీ ఇందులో ఘంటాపథంగా చెప్పబడింది.

జాతీయ దృష్టికలవారికి గ్రంథం 'అపర భగవద్గీత' అనడంలో సందేహంలేదు. అలాగే సంఘ సిద్ధాంతంతో వ్యతిరేకించేవారూ, తటస్థులూ కూడా ఆ గ్రంథాన్నిచదివి, సంఘం ఏంచెపుతున్నదో స్పష్టంగా ఆకళించుకోవడం అవసరం. దాని వల్ల అపోహలతో వచ్చే ఆరోపణలుపోయి యదార్థ జ్ఞానం కలుగవచ్చు. సర్వాంగ సుందరంగా డాక్టర్‌జీ గురూజీ ఆర్ట్ పేపర్ ఫోటోలతోసహా మేలిమి రంగితంపై ఈ గ్రంథాన్ని అచ్చువేసి పుస్తకాల ముద్రణ ఒక వ్యాపారంగా సాగుతున్న కాలంలో సిద్ధాంతంకోసం అంకితమై నిర్భీ సాహసంతో దీనిని ప్రకటించిన, ఒక సంస్థ తెలుగుదేశంలో వున్నదీ అంటే అది మనకు గర్వకారణమే!

ఇంతమంచి పుస్తకంలో ఇన్ని తప్పులుండటం క్షంతవ్యం కాదు, అందులోనూ సిద్ధాంతం గ్రంథంలో

ద్వితీయ ముద్రణలో ఈ లోపం సవరింపబడగలదని ఆశిద్దాము.

—"శివప్రసాద్"

గాంధి తత్త్వ ప్రబోధము

(గ్రంథకర్త : శ్రీ కార్యంపూడి నాగేంద్రుడు బి.ఎ., బి.ఇడి ప్రకాశకులు : బహూత్తమ పబ్లికేషన్స్, కార్యంపూడి వారి వీధి, పేరాల, చీరాలపోస్టు ప్రకాశంజిల్లా. వెల : రు 10.)

కేంద్రప్రభుత్వ బహుమతి గ్రహీత, బహుగ్రంథ కర్త శ్రీ నాగేంద్రుడు గారు చక్కటి రచయిత. నిశిత పరిశీలనా దృష్టిగల వారు. విద్యావ్యాప్తి కృషి పట్ల వారి శ్రద్ధాసక్తులను పరిచయం చేస్తుంది. 261 పుటల ఈ గ్రంథం. గాంధి : గాంధీతత్త్వము, భగవత్ ప్రార్థన, సత్యము : అహింస, సత్యాగ్రహము, సత్యాగ్రహి, నిర్మాణ కార్యక్రమము : గాంధేయ సాహిత్యము. మత సామరస్యము, అస్పృశ్యతా నివారణము, మద్యనిషేధము ఖాదీ లేక ఖద్దరు ఇతర గ్రామ పరిశ్రమలు, గ్రామ పరిశుభ్రత, నవీన విద్యలేక బేసిక్ విద్య, వయోజన విద్య, స్త్రీ జనోద్ధరణము, ఆరోగ్య విద్య మాతృభాషలు : ప్రాంతీయ భాషలు, రాష్ట్ర భాష, ఆర్థిక సమానత్వము, రైతులు, శ్రామికులు, ఆదివాసులు, కుష్ఠురోగులు, విద్యార్థులు అనే 23 అధ్యాయాలున్నాయ్ యీ మంచి పుస్తకంలో.

'ఇఫ్ ఎనీథింగ్ దట్ ఐ రైట్ ఇన్‌దీస్ పేజెస్ షుడ్ స్ట్రైక్ ది రీడర్ ఏస్ బీయింగ్ టచేడ్ విత్ ప్రైడ్, దెన్ హి మస్ట్ టేక్ ఇట్ దట్ దేర్ యీజ్ సమ్‌థింగ్ రాంగ్ విత్ మై క్వెస్ట్. అండ్ దట్ మై గ్లింప్‌సెస్ ఆర్ నో మోర్ దాన్ మిరాజ్...బట్ లెట్ ది ట్రూత్ ప్రివేల్' అన్నారు గాంధీజీ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్ అనే పుస్తకం ఉపోద్ఘాతంలో. అని సూరదాస్ గేయానికి ఈ కింది ఆంగ్ల అనువాదాన్ని ఉదహరించారు.

'వేర్ ఈజ్ దేర్ ఎ రెచ్
సో వికెడ్ అండ్ లోత్‌సమ్ ఏస్ ఐ
ఐ హావ్ ఫర్‌సేకెన్ మై మేకర్
సో ఫెయిత్‌లెస్ హావ్ ఐ బీన్'

మహాత్ముని ప్రబోధాలపట్ల మక్కువగల రచయితలందరూ మననం చెయ్యవలసిన అంశాలివి. ఆ కారణాన యీ సమీక్ష ప్రారంభంలో యీ సంగతులను ఉదహరించడం అసందర్భం కాదనుకుంటాను.

వర్తమానం

మహాత్ముడు తాను కలలుగన్న 'రామరాజ్యము' లేక శ్రేయోరాజ్యమును భారత దేశములో అవలంబించవలసిన విధానమునే తన నిర్మాణ కార్యక్రమాంశముల ద్వారా ప్రతిపాదించి యున్నారు' అన్నారు ప్రస్తావన (2) వ పుటలో గ్రంథకర్త. ఈ అష్టాదశాంశములను త్రికరణశుద్ధిగా భారతీయులు అమలుజరపక పోవడమే వర్తమానంలోని అవకతవకలన్నింటికీ కారణమనే అభిప్రాయాన్ని యీ రచయిత ధ్వనింపజేశారు. అయితే మరి—ఈ పాతిక సంవత్సరములలో 'శ్రేయోరాజ్య ఛాయలైనను భారతదేశమున కనిపించక పోవడానికి కారణాలేమిటి ?

వర్తమానంలోని భాగాలైన మనం, దేశ స్వాతంత్ర్య సముపార్జనకు అంతో యింతో కృషి చేసిన తరం మేధావులు 'నేడు అరాచకము భారతావనిపై విలయతాండవము చేయుచున్నది (2 వ పుట) అని విమర్శించడం సమంజసమా ? మనం అనుకున్నట్లు, పోనీ ఒకానొక మేధావి ఊహించినట్లు ప్రకృతి నడుచుకోవలేదనే సాకున ఇదంతా అరాచకం అనడం శాస్త్రీయదృష్టిని సూచించుతుందా ?

'వ్యక్తుల ఆలోచనలలో మార్పురానిదే సమాజం యొక్క స్వరూపంమారదు. సమాజం స్వరూపం మారనిదే రాజకీయ స్వాతంత్ర్యం వ్యక్తి జీవితాన్ని మెరుగుపరచదు' అంటాడొక రాజకీయ శాస్త్రవేత్త. ఈ దృష్టితో చూచినప్పుడు 'ఇప్పుడు కనిపించుతున్నవన్నీ విపరీతాలా ? లేక చారిత్రక పరిణామాలలోని ఒకదశయా ?' అనే ప్రశ్న వస్తుంది.

విద్యావిషయమున గొప్పతప్పిదం జరిగిన, జరుగుతున్నమాట నిజమే. కానీ— 'ఇదుగో ఇటువంటి విద్య మాకు కావాలి' అని విశదం చెయ్యగల విద్యా వంతులు ముందుకువచ్చి కొన్ని విద్యాకేంద్రాలను ఎందు కని నెలకొల్పలేదు?? నిర్మాణ కార్యక్రమం అమలు జరగకపోవడమే కారణమని ప్రతి పరిణామానికీ సాకు చెప్పడం మహాత్మునికి న్యాయం చెయ్యడమూ కాదు— మహాత్మునిపట్ల మన భక్తిగౌరవాల కది నిదర్శనమూ కాజాలదనుకుంటాను.

రవీంద్రనాథ టాగోర్ శాంతినికేతనాన్ని ఎప్పుడు నెలకొల్పారూ? పండిత మదనమోహన మాలవ్యా బెనారస్‌లో హిందూ విశ్వవిద్యాలయాన్ని ఎప్పుడు నెల కొల్పారూ? తెనాలి తాలూకా కావూరులో, వినయాశ్ర మాన్ని స్వర్గీయ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు ఎప్పుడు నెలకొల్పారూ? విద్యావ్యాప్తికి జరిగిన ప్రయో గాలు కావా యివి? మరి వర్తమానంలో స్వతంత్ర విద్యా విధానాన్ని లోకానికి స్పష్టం చెయ్యగల విద్యా కేంద్రాన్ని ఎందుకని ఎవరూ నెలకొల్పలేదూ? గాంధీజీ ప్రబోధాలను మరచిపోవడమే అందుకు కూడా కార ణమా? అట్లా అనడం గాంధేయ మార్గమా?

గాంధేయ సాహిత్య ప్రచారం

'మహాత్ముని స్వీయ చరిత్ర ఇంగ్లీషులో ప్రక టింపబడిన వెంటనే, తెలుగులో దాని అనువాదమును, ఆంధ్ర గ్రంథమాలద్వారా శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు రెండు సంపుటములుగా ప్రకటించి స్వల్పమైన వెలకు ఆంధ్ర ప్రజానీకము నకు అందజేసిరి. అభినవతిక్కన, తెలుగులెంక శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు...యున్నారు' అని 2 వ పుటలో ఈ గ్రంథకర్త వ్రాశారు. ఆ తరవాతి పేరాలో 'అయినను గాంధేయ సాహిత్యము తెలుగుగడ్డపై విస్తృతముగ తగినంతగా ప్రచారము నకు రాలేదనియే చెప్పవలసి ఉన్నది' అన్నారు. గాంధేయ వాదులందరూ ఆలోచించవలసిన అంశాలలో ఇదొకటి.

డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు వ్రాసిన గ్రంథాలు గాంధేయ సాహిత్యంలోకి రావా? అసలు సాహిత్యంద్వారా తన సిద్ధాంతాల ప్రచారం అవసర మని గాంధీజీ గుర్తించారా? గుర్తించితే మరి తమ రచనలను తమ అనుయాయులచేత తెలుగునాట ఎందుకని ప్రచారం చేయించలేదు?

విప్లవమంటే ?

శ్రీ రాధాకృష్ణన్ తాను సంకలనము చేసిన 'మహాత్మ గాంధి' 100 సంవత్సరములు (16 వ పుట) అనుగ్రంథమునకు వ్రాసిన అవతారికలో (1) 'గాంధీ విప్లవకరమైన ఆలోచనాపరుడు' అని వ్రాశా రట. గాంధేయ పరిభాషలో విప్లవమంటే యేమిటో కూడా మరికొంత విశదం చేసివుంటే పాఠకులకు ఉపయోగకరంగా ఉండేది.

(2) 'నేను చెప్పినది. బోధించునదికూడ ఉద్రేకమును కలిగించదు. నేను పురాతనమైన వానినే బోధించుచున్నాను.' 8 వ పుట (30) ఆచారమునకు గాని పూర్వ ఉదాహరణములకుగాని దాసుడునగుటకు నేను సమ్మతింపను' 11 వ పుట. ఈ రెండు అంశాలకూ ఎట్లా సమన్వయం కుదురుతుందీ? సమన్వయం కుదరలేదు. ఫలితమే వర్తమానంలో ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక రాజకీయాది రంగాలలో అవకతవకలు.

'హేతువాదమునకు భిన్నమైన సమస్తమును ఆయన త్యజించెను' 13 వ పుట. ఇక్కడ హేతు వాదమనే మాట ఏ అర్థంలో ప్రయోగించడో వివ రించి ఉంటే సమంజసంగా ఉండేదనుకుంటాను. 17 వ పుటలో ప్రారంభమైన గాంధీజీ సూక్తులను కాంగ్రెసువాదులందరూ శ్రద్ధగా చదవడమవసరం.

సత్యాగ్రహమంటే

'గాంధీజీ అన్నకుమారుడైన మగన్‌లాల్ గాంధి సదాగ్రహము (సత్ + ఆగ్రహము' అను పదమును సూచించెను. దానిని స్వీకరించి గాంధీజీ 'సత్యాగ్రహము' (సత్య + ఆగ్రము)గా మార్చెను. ఆగ్రహమనగా

తెలుగులో మనము వాడుకొనునట్లుగా కోపమని అర్థము కాదు. పట్టుదల యనియే అర్థము (25 వ పుట). ఈ తరం యువకులందరూ శ్రద్ధగా చదివి అవగాహన చేసుకొనవలసిన అంశా లున్నాయ్ ఆ అధ్యాయంలో. అందుకు తీరిక యేదీ మనకు?

'నిగ్రహశక్తులు అలవడని సామాన్య ప్రజానీకములో మూక మనస్తత్వము ప్రత్యక్షమగుచుండును. గుంపును ఏదైనా విషయముపై......విషయము కాదు' 25 వ పుట. ఈ అంశం గురించి కొంత మీమాంస జరిగింది. ఇంతకు పూర్వం. 'ప్రజలను రెచ్చగొట్టవద్దు' అని డాక్టరు పట్టాభి చాలాసార్లు హెచ్చరించి ఉన్నారు. గాంధీజీ వినలేదు ఆ హెచ్చరికను. దాన్నిబట్టే పొరపాటు అభిప్రాయం కారణంగా కాక కావాలనే ప్రజలను మహాత్ముడు రెచ్చగొట్టెనని ఆ కాలంలో చాలామంది రాజకీయ మేధావులు అభిప్రాయపడి ఉండిరి.

'మొదట భగవంతుడు సత్యము అని నిర్వచించెను. కాని చివరకు సత్యమే భగవంతుడు అని ఉద్ఘాటించెను 27 వ పుట. విజ్ఞులు చర్చించవలసిన అంశ మిది.

'స్వయముగా ప్రచరితమగు శక్తియే అహింసకు కేంద్రము. అహింస యనగా సర్వవ్యాప్తమైన ప్రేమ (29 వ పుట') మరికొంత వివరణ—ఆ వివరణకూ విద్యావ్యాప్తికిగల సంబంధమును గురించిన వ్యాఖ్య చాలా అవసరం. ఇటువంటి అస్పష్టమైన నిర్వచనాల ఫలితమే వర్తమానంలోని అల్లకల్లోలాలకు ప్రధాన కారణము. 29 వ పుటనుంచి 37 వ పుట వరకూగల 60 సూక్తులను గురించిన వ్యాఖ్యానం విడిగా శ్రీ నాగేంద్రుడుగారు ప్రచురించితే బాగుంటుంది.

నిర్మాణ కార్యక్రమము

18 అంశములపైన సమగ్రమైన వ్యాఖ్యాను ఈ గ్రంథంలో పొందుపరిచారు. బాగానే ఉన్నది. కానీ యీ నిర్మాణ కార్యక్రమాన్ని అమలుజరిపే సందర్భంగా స్వర్గీయ గొల్లపూడి సీతారామశాస్త్రి, గుళ్లపల్లి రామకృష్ణయ్య, నేతి చలపతిరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, బ్రహ్మాండం నరసింహం ప్రభృతులు చేసిన కృషి ప్రాముఖ్యాన్ని విస్తరించడం సమంజసంకాదు. నిర్మాణ కార్యక్రమం ఆచరణ సాధ్యం కానట్టిదేమో ననిపించుతుంది కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాలు తదితర ప్రాంతాలలో జరిగిన కొన్ని ప్రయోగాలను సునిశితంగా పరిశీలించితే.

'అస్పృశ్యతా నివారణము' అను అధ్యాయంలో 67 వ పుటనుంచి 71 వ పుటవరకూ ఈ రచయిత పొందుపరిచిన గాంధీజీ సూక్తులను గురించి వ్యాఖ్యానము చాలా అవసరం.

మద్యనిషేధం గురించిన వాదోపవాదాలు చాలా ఉన్నాయ్. 80, 81 పుటలలో శ్రీ నాగేంద్రుడుగారు కొంత చర్చించారు ఈ అంశం గురించి.

ఖాదీ లేక ఖద్దరు

నూలు వడకడానికి ఉపయోగపడే రాట్నాన్ని ఎవరు ఎక్కడ ఎప్పుడు కనిపెట్టినదీ 'మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ది ట్రూత్' 363 వ పుటలో 'ఫౌండ్ ఎట్‌లాస్ట్' అనే అధ్యాయంలో గాంధీజీ వివరించారు. ఆ సంగతిని కూడా నాగేంద్రుడుగారు ఈ గ్రంథంలో పొందుపరిచిఉంటే బాగుండేది. బరోడా (అప్పటి) సంస్థానంలో విజాపూర్ 1917 లో గంగా బిహెన్ కనిపెట్టారట రాట్నాన్ని 'దిస్ వీల్ బిగాన్ మెరిలీ టు హమ్ ఇన్ మై రూమ్, అండ్ ఐ మే సే వితవుట్ ఎగ్జాగరేషన్ దట్ ఇట్స్ హమ్ హాడ్ నో స్మాల్ షేర్ ఇన్ రెస్టోరింగ్ మై హెల్త్... ఇట్స్ ఎఫెక్ట్ వజ్ మోర్ సైకలాజికల్ దాన్ ఫిజికల్' అని రాశారు గాంధీజీ ఫవుండ్ ఎట్‌లాస్ట్ అనే అధ్యాయం 363 వ పుటలో.

ఇక ఖాదీ లేక ఖద్దరు ఆర్థికత గతించి కాని ఫలితాలను గురించి చాలా చెప్పవలసి ఉన్నది. విదేశీ వస్తు బహిష్కరణ గాంధీజీ ఎత్తుగడలలో

తోడ్పడింది. ఆదే వయోదశలలోనూ ఆమె జీవితాన్ని నడిపించడం చూస్తాం, ఈ నవలలో.

పసివయస్సుతో ఏడ్చి, గోలచేసి తన పొట్టకు కావలసినవి సంపాదించుకోగలిగింది, సుందరి.

కాని, కొంచెం పెరిగేక అవసరాలు ఆకలికి మాత్రమే పరిమితంకావు. తలపిన్నులు, జడరిబ్బను వంటివి అతిసామాన్యమైన కోరికలే కావచ్చు. అయితే ఈ అతిసామాన్యమైన ఆ వాంఛల్నికూడా చదువూ, అల్లరీ, గోలా సాధించలేవని గ్రహించడం సుందరికి కష్టంకాదు. వానికి ఎంత కొంచెమే అయినా డబ్బులు కావాలి. ఆ జీవికి అవసరం తీరడం ఒక్కటే కావలసింది. తాత జేబులో డబ్బులు తీసుకోవడం మనకు దొంగతనం. లలిత చీర ఇస్తే తీసుకోవడం సిగ్గులేనితనం. ఆనంద్ కారులో తిరగడం అభిమానం లేకపోవడం. జానీ అండతో ఢిల్లీపోవడం లేచి పోవడం. ఖన్నా వెంటబడిపోవడం గృహత్యాగం. సామాన్యజీవితంలో నింద్యాలూ, పరిహార్యాలూ నిర్ణయించే ఈ నైతికసూత్రాలకు సుందరి జీవితంలో విలువలేదు. పసితనంలో తన అవసరాలను తీర్చుకొనేందుకుపయోగించిన ఏడ్పులూ, గోలకూవయోభేదాన్నిపట్టి వచ్చిన పాఠభేదాలుతప్ప అన్యంకావు, అవి ఆమె దృష్టిలో.

'కలల్లో చూసేవన్నీ వాళ్ళింట్లో ప్రత్యక్షంగా చూస్తున్నాను. నీలాగా నాకు ప్రిన్సిపల్స్ లేవు. అందినంతమట్టుకు పుచ్చుకోవడం, పొందినంత ఆనందించడం నా పాలసీ' (పుట 43) అ... ంది సీతతో, ఆమె.

ఆ పాలసీ అమలు జరగాలంటే సులభం కాదు. ఏమంటే దీని అమలు ఒక్కసుందరిమీాదనే లేదు. పుచ్చుకోవాలంటే ఇచ్చే మనిషి వుండాలి. ఏ మనిషీ ఎవ్వరికీ అల్లా ఇచ్చెయ్యడం జరిగేపనికాదు. తాను ఇచ్చే దానికి ప్రతిఒక్కరూ ప్రతిఫలం కోరుతారు. తననుంచి కోరగలది ఏముందో సుందరికి మేనమామ తంబిద్వారా పదేళ్లలోపు వయస్సులోనే చూచాయగా అవగతం అయింది. చిన్నవయస్సులో కలిగిన ఆ అనుభవంవలన కలిగినవెల పరమో, తల్లిదండ్రుల ప్రవర్తనవలన అజ్ఞాతంగావే అంకురించి, పెరిగిన అసహ్యభావమో సుందరిలో సెక్సు సంబంధాల యెడ వైముఖ్యం కలిగించవచ్చు. కాని స్త్రీ పురుష సంబంధాల పరిజ్ఞానం లేనిది కాదు ఆమె. జాన్ తననుంచి ఏమి ఆశిస్తాడో, భర్త అశోక్ తననుంచి వాంఛించేదేమిటో వూహించలేని, తెలియనిదేం కాదు. ఉద్యోగంలో వచ్చేడబ్బు చాలదనుకొన్నాక, దానిని వదిలేశాక, తన కనీసావసరాలకయినా డబ్బు ఎల్లావస్తుందో ఎరగకుండా అమాయికంగా జానీకోసం ఢిల్లీ బయలు దేరిందనడం నవలలో అసహజంగా వుంది.

న్యాయవర్తనుడైన అశోక్ అన్ని తరవాయిలూ తీరిన ఒక అందకత్తె వలలో చిక్కినట్లు చెప్పడానికి మనసు ఒప్పక సుందరి మనస్తత్వంలోకి అసహజమైన ఈ మెలికను రచయిత్రి ప్రవేశ పెట్టలేదుగదా అనిపిస్తుంది.

'ఆడవాళ్ళదగ్గర బోలెడు ఆనందాన్ని ఇచ్చే వస్తువులున్నాయి. నేనే అడిగి తీసుకొందామనుకున్నా. ఏకాంతం దొరకలేదు. వెధవ, ఈ ఆనందం పానకంలో పుడకలాగావెంట తిరిమేడు' అన్నాడు జాన్.

సుందరి ఏమీా అర్థం కానట్లు తలపక్కకు తిప్పేసుకొని దిక్కులు చూసింది.' (పుట 56)

ప్లాట్‌ఫారమ్ మీాద జరిగిన ఈ ఘటన చాలు సుందరి స్త్రీ పురుష సంబంధాల విషయంలో అనభిజ్ఞకాదనడానికి. కాని తరువాత హఠాత్తుగా ఆ అమాయకత్వపు మెలిక వచ్చింది. ఒక క్రమంలో సాగుతున్న కథలో ఈ మెలిక అసహజత్వాన్ని తీసుకొచ్చింది. మనస్తత్వ చిత్రణం అన్నది పెడదారి పట్టింది.

ఆశల ఆరాటంలో జీవన పోరాటం

ఒక మనిషిచేసే త్యాగాలకి కారణాలలాగానే, చేసే త్యాగంయొక్క అవధులుకూడా ఆ వ్యక్తి స్వభావంపట్టి మారుతుంటాయి.

మూర్తి తన ఆస్తి, సంపాదనా సర్వం ఖర్చు చేసి తమ్ముడి చౌళికి మెడిసిన్ చెప్పించేడు! ఆ చదు

పూర్తి అయ్యేసరికి ఆస్తి, ఆరోగ్యం, దానితో సంపాదన ఖాళీ అయాయి, పైగా అప్పులుకూడా.

సమాజంలోవున్న పరిస్థితులలో, తమ్ముడికి కట్నం తీసుకొని పెళ్లిచేసి, ఆ ధనంతో తన ఆపద నుంచి గట్టెక్కే అవకాశంవుంది మూర్తికి.

కాని మౌళి అప్పటికే మంజుల అనే అమ్మాయికి మనసిచ్చి పుచ్చుకొన్నాడు; ఫలితంగా మూర్తి ప్రాణప్రతిష్ఠకీ, మౌళి ప్రేమాభిమానాలకీ సంఘర్షణ వచ్చింది.

ఈనాడు మన సమాజంలో విద్యావంతులకీ ముఖ్యంగా శాస్త్రసాంకేతిక శిక్షణపొందిన యువతీ యువకుల అవసరం చాలావుంది. ఆలోటు తీరుస్తూ మధ్యతరగతి కుటుంబాలనుంచి శాస్త్ర, సాంకేతిక శిక్షణపొందిన యువకులు తయారవుతున్నారంటే దానిలో మూర్తి మొదలయినవారుచేస్తున్న త్యాగాల పాత్ర చాలావుంది. స్వాతంత్ర్యసాధనకు అవసరమైనట్లే,దేశపునర్నిర్మాణానికీ అనంతత్యాగాలు అవసరం. మూర్తిలాంటివారుచేసిన, చేస్తున్న త్యాగాలు అందులో భాగమే. అవి తెలిసిచేయకపోవచ్చు. తన తమ్ముడో, కొడుకో డాక్టరయ్యేడంటే కలిగే ప్రతిష్ఠ, అతనికి పెద్ద సంబంధంచేసి, సమాజంలో తనస్థానం పెంచుకోగలమనే ఆశ, మంచి వుద్యోగమో, మంచి సంపాదనో ఏర్పడి భవిష్యత్తులో సుఖపడగలమనే కలలు—ఆ త్యాగాలకు అనేక కారణాలు. కట్నాల ద్వారా తమ ఖర్చును దేశంమీద సర్దవచ్చుననే ఆలోచన మధ్యలో అనుషంగికంగా వచ్చేది మాత్రమే.

కట్నాలసమస్యయొక్క మంచిచెడ్డలు కాదు. మనం ఇక్కడ ఆలోచిస్తున్నది. విద్యాభివృద్ధికి మూర్తిలాంటివారుచేస్తున్న త్యాగాలగురించి ఆలోచన.

తన త్యాగాన్ని ఇంకా పొడిగించి, మూర్తీ అతని కుటుంబమూ సర్వనాశంకావడమా? లేక—

ఆ కుటుంబాన్ని కాపాడేందుకు మౌళి తన ప్రేమను త్యాగంచెయ్యడమా ?

ఇక్కడున్నది ఈనాడు అనేక మధ్యతరగతి కుటుంబాలనూ, యువతీ యువకుల్నీ ఎదుర్కొంటున్న సామాజికసమస్య. దీనికి పరిష్కారం ఆయా వ్యక్తుల పరిస్థితులూ, మనస్తత్వాలమీద ఆధారపడి వుంటుంది. మూర్తి చచ్చిపోవచ్చు. అతని కుటుంబం తితర్ బితర్కావచ్చు. మౌళి భగ్నప్రేమికుడుకావచ్చు. లేదా ఓర్పు, నేర్పుతో కాలక్రమంలో అందరికీ అనుకూలంగా సమస్య పరిష్కారమూ కావచ్చు. ఏలా జరిగినా అసహజంకాదు. అయితే సహజమైనవిధంగా చిత్రించాలంటే రచయితకి తాను ఎత్తుకున్న సమస్య లోతుపాతులూ, దాని స్వభావమూ అర్థంకావాలి. ఇక్కడ అదేలేదు.

శ్రీమతి కావలిపాటి విజయలక్ష్మి ఇంతలోతయిన సమస్యను ఎత్తుకొని దానిని సెంటిమెంట్ల బురదలోకి ఈడ్చేరు. అర్థంలేని, అసహజ త్యాగాల అగాధంలోకి నెట్టేరు.

అన్నకోసం మౌళి తన ప్రేమను త్యాగం చేసేడు. బాగుంది. తాను చేస్తున్నదేమిటో ఎరిగి మరీ పెళ్లి చేసుకొన్నాడు. అదీ సరే. పెళ్లిచేసుకొన్నా భగ్నప్రేమ మనస్సును వేదిస్తూనూ వుండవచ్చు. అసహజంకాదు.

కాని, దేవదాసు పాత్ర స్వీకరించి, తాగి పెళ్లాన్ని హింసపెట్టడం బొత్తిగా అసహజం, అమానుషం. అటువంటి దుర్బల మనస్కులను, అల్పబుద్ధులను సాహిత్యంలోకి ఎక్కించటం అవసరమా?

అటువంటి వ్యక్తి సానుభూతికర్హుడా?

అలాగే—జయంతి భర్త తన్ను నిరాదరిస్తున్నాడని తెలిసి, ఆతనిని వదలిపోయి, స్వతంత్రంగా జీవించాలనుకోడం న్యాయంగానే వుంది. ఆ విషయంలో జయంతి నిర్భీకంగా నిలబడడానికి బదులు, తల్లిదండ్రులకుకూడా కనిపించకుండా పారిపోవడం, అనవసర కష్టాలుపడడం పాఠకుల సానుభూతికోసం వెంపర్లాడడం తప్ప, ఆ ఆధునిక యువతిపాత్రకు పుష్టినేమాత్రం ఇవ్వదు.

జయంతి తన రహస్యజీవితంలోనే రోగపడి మరణించడం, ఆమె కొడుకు తండ్రి నన్వేషిస్తూ

పోయి పళ్ళి కారుకిందనేపడడం, తండ్రి కొడుకుల సమాగమం వగైరాఘటనలు తెలుగు వెండి తెరకు కావలసిన హంగులు కల్పిస్తున్నాయే, తప్ప రచయిత్రి ఎత్తుకొన్న సమస్యకు ఏవిధంగానూ సాయపడవు.

చక్కని సమస్యను ఎత్తుకొని, దానినెంత అద్భుతంగా గబ్బు పట్టించవచ్చునో చూపడానికి ఇంతకన్న వేరే వుదాహరణ అక్కరలేదు.

జీవితవలయాలు

శ్రీమతి ఇల్లిందల సరస్వతీ దేవిగారి ఈ నవలలో మధ్యతరగతి కుటుంబాలు దేశపునర్నిర్మాణంలో ఎటువంటి త్యాగాలు చేస్తున్నారో చూడగలుగుతాము.

వారి ఆలోచనలు, అలవాట్లు ఫ్యూడల్ సమాజపు పరిధినుంచి బయటపడవు. నూతన సామాజిక పరిస్థితులలో పరిమిత సంతానం ఆవశ్యకత వారికి తోచదు. తిండి పెట్టలేక పోవడం, రోగపడితే మందు మాకు ఇప్పించలేక పోవడం, తానో తన భార్యో అనారోగ్యంగా వుండడం— ఇన్నివున్నా కనీసావసరంగా సంతాన నిరోధ ప్రక్రియల ననుసరించడానికికూడా మనసొప్పదు. అధిక సంతానం వ్యవసాయ ప్రధాన ఫ్యూడల్ సమాజపు అవసరం. ఆ అవసరం తెచ్చిపెట్టిన అలవాటూ, ఆచారమూనది. నూతన పరిస్థితులలోకూడా ఆ అలవాటు మానరు.

అధిక సంతానంవలన కలిగే బాధలు మాత్రమేనా? ఆ పిల్లలలో మగవానికిచ్చే ప్రాముఖ్యం, ప్రత్యేకత చూపే అలవాటు తొలగదు. తమకు మంచిదని తోచిన యింట పడెయ్యాలన్నంతవరకే ఆడపిల్లల అభివృద్ధి గురించిన ఆలోచనలు. తమకు నచ్చని వానిని ఆడపిల్ల యిష్టపడి చేసుకొన్నట్లయినా తమ ప్రతిష్ఠకి భంగంగా బాధపడడం, ఆచారాలూ, కులాభిమానాలూ అడుగడుగునా అదనపు కష్టాలు తెచ్చిపెడుతున్నా వానిని సర్దుకోలేరు. ఇన్ని వ్యతిరేక పరిస్థితులలో కూడ తమ సంతానాన్ని వర్తమాన సమాజావసరాలకి సరితూగేటట్లు చేయడానికై రామనరసయ్యా, భార్య సావిత్రమ్మా విపరీతమయిన భారం మోసేరు. గుమాస్తా జీతంతో, సంతానాధిక్యం తప్ప మరో ఆదాయంలేని కుటుంబీకుడు కొడుకును మెడిసిన్ చదువుకు పెట్టడం పెద్దబరువే. తమ బిడ్డలు సరిగ్గా చదువుకొంటున్నారా—అని కనుక్కొనేందుకు కూడా వ్యవధి వుండదు. ఇంతా కష్టపడితే వారు భవిష్యత్తులో సాయపడగలరా, సాయపడతారాయన్న ఆలోచనకూడా కలగదు. తలవంచుకొని బండెద్దులగా బరువు లాక్కుంటూపోవడం. తలకుమించినప్పుడు బాటపక్క ప్రాణం వదలెయ్యటం. మధ్యతరగతులలో రామనరసయ్యవంటి ప్రాణులు మనకు అడుగడుగునా తగులుతారు.

వర్గ సమాజంలో సామాజికావసరాలు వ్యక్తి అవసరాలుగా, త్యాగాలు స్వార్థప్రయోజనాలుగానే కనిపిస్తాయి. పూర్వ సమాజ సంబంధాల అవశేషంగా మనిషిలో కనిపించే భావాలూ అలవాట్లకూ, నూతన సమాజ సంబంధాలకు సంకేతంగా మనిషిచూపే ఆచరణకూ మధ్యనున్న వైరుధ్యాలలో ఈ త్యాగాలు కనిపిస్తాయి. ప్రేక్షకుడుగా రచయిత ఈ వైరుధ్యాలను నమోదు చేయవచ్చు. శ్రీమతి సరస్వతి దేవిగారు రామనరసయ్య కుటుంబ చిత్రణలో చేసినది అంతవరకే. కాని ఆ వైరుధ్యాల సామాజిక స్వభావాన్ని అర్థం చేసుకోకపోతే ఈ నవలలోలాగ జీవిత ఘటనలను ఒకచోట పోగు చెయ్యడమే తప్ప, వానిని సమన్వయంచేసి, అర్థవంతంగా చిత్రించడం జరగదు.

మసాలా వాసనకూడా కిట్టని విమల—రామనర్సయ్య కూతురు—విద్యాసక్తితో మతాంతరురాలు కావడం, కామేశంవలన కలిగిన బిడ్డను భర్త ప్రకాశానికి అందించడంలో అనితపొందే మానసిక సంక్షోభం, తల్లిదండ్రులకు చెప్పకుండానే విశ్వం తన భార్యను ఎన్నుకోవడంలో చూపిన స్వాతంత్ర్యం—దీనిని రచయిత్రి ప్రాసంగికంగా మాత్రమే పరామర్శిస్తారు.

సావిత్రమ్మ తనకూతురు సాయంకోరినా వెళ్లక, పరమ నిరర్థకుడైన వకీలు సాంబయ్య కుటుంబంలో వంటకత్తెగా మిగలడం, ఎవరో అమ్మకని చెత్త కుండీలో వదలిపోయిన పసికందును సాకడానికి (తనకు తిండిలేక పోయినా) తీసుకోవడం—ఇవే రచయిత్రి దృష్టిలో సావిత్రమ్మ తన జీవితంలో చేసిన త్యాగాల పరమార్థం అయాయి.

ఇది నిజంగా విపరీత దృష్టి. సామాజిక అవగాహన లేకుండాచేసే రచనలో కనపించే వక్రదృష్టి.

భావబంధం

ప్రసిద్ధ తెలుగు రచయిత్రి శ్రీమతి ద్వివేదుల

విశాలాక్షిగారి పన్నెండు కథలు కూర్చిన సంపుటి యిది. దానిలో మొట్టమొదటి కథ భావబంధం.

నిరాశ్రయుడైన అనాథ బాలుడు రాముడిని సుమిత్ర ఇంటికి తెచ్చి తన బిడ్డలతో సమంగా పెంచుకుంటూంది. ఆమె సహృదయత ఎంతోకాలం రాముడికి ఆశ్రయం ఇవ్వలేకపోయింది. తన బిడ్డలా రాముడా ఎవరు ముఖ్యం అనే ప్రశ్న ఎదురయింది.

దీనికి కారణం సుమిత్ర పిల్లలు పెద్దగావుండి ఆ అనాథబాలునిమీద ఈర్ష్య కనబరచడంకాదు. రాముడు దుష్టుడయి, తన పిల్లల్ని చెడ్డదార్లకి పట్టిస్తాడనీ కాదు. భర్త వాసుదేవరావు అభ్యంతరం చెప్పడంకాదు. అందరూ మంచివాళ్లే, కాని రాముడు ఓ ముద్ద ఎక్కువతింటే సుమిత్ర కంటగించుకొనే పరిస్థితి వచ్చింది. వారాలు చూసుకోమని పంపేసింది. పంపిందేకాని మనసు నిల్పుకోలేకపోయి అనంతవ్యథకి గురి అయింది.

దీనికి మూలం దేశంలో పెరిగిపోతున్న ధరలు. జీతాలు పెరగవు. తిండిగింజలు దొరకవు. 'నెల ముగిసేందుకు ఇంకా పది రోజు లుండగానే నిండుకున్న బియ్యపుజాడీ, నేలమీద దొరలిపడివున్న పాప పాల డబ్బా, చిల్లరగా మారిన జీతండబ్బులు' చూస్తూంటే మనసు భయంతో వణికిపోతూంది. సహృదయత ఇంకిపోతూంది.

మనిషిలోని మానవీయతను, సహృదయతను నిర్మూలిస్తూన్న దేశ ఆర్థిక దుర్వ్యవస్థను ఒక కొత్త కోణంలోంచి చిత్రిస్తూ ప్రజలను హెచ్చరిస్తూంది ఈ కథ. ఇది మంచికథలలో ఒకటి.

అమ్మ

దేశంలోని ఆర్థిక దుర్వ్యవస్థ కుటుంబ సంబంధాలను ఎంత అస్తవ్యస్తం చేస్తూందో ఎంతో సూటిగా చెప్తున్న కథ.

నిరుద్యోగం సమస్య. కొద్ది జీతాలు సమస్య. ధరలు పెరగడం సమస్య. జీవితాలకి భద్రత లేకపోవడం సమస్య. ఆధునిక వ్యవస్థతెచ్చి కూరుస్తున్న ఈ అనంత సమస్యలు మనిషిని స్వార్థపరుణ్ణి చేస్తున్నాయి. కూతురి సంపాదనమీద బతకడానికై తల్లిదండ్రులామెకు పెళ్లి చేయడం లేదు. ఆమెయే ఒక వరుణ్ణి చూసుకుంటే తమ సంసారం గడవడం గురించి బెంగపడుతున్నారు. చివరకు తన కూతురు భవిష్యత్తును భగ్నం చేయడానికై ఆత్మహత్యకు కూడా సిద్ధపడేటట్లు తల్లి తయారయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఈ మనస్స్థితిని ఘాతదర్పణంలోలాగ అతి భయంకరంగా కనబరిచేందుకు కూతురు కల్యాణి పెళ్లి ఆలోచనను వ్యతిరేకిస్తూ తల్లి కాంతమ్మ (ఆత్మహత్యకు పూనుకొని) ఉత్తరాన్ని వ్రాసినట్లు రచయిత్రి వుపయోగించుకొన్నారు.

'రాళ్లెత్తిన కూలీ లెవరు?'—అంటూ మహాకవి శ్రీ శ్రీ లేవనెత్తిన అనంత జిజ్ఞాసకు అస్తి మాంస కల్పన—'అడుగున పడిన పునాదిరాళ్లు' కథ.

బిడ్జి కట్టుబడిలో గోపన్న రాళ్లు మోస్తూండగా చూసిన చిట్టిబాబు దాని ప్రారంభోత్సవంలో గోపన్న కనబడకపోతేనూ, కట్టినవాళ్ల పేర్లలో గోపన్న పేరు వినబడకపోతేనూ తల్లకిందులయిపోయేడు. మసి బొగ్గుతో ఈ బ్రిడ్జి గోపన్నతాత కట్టేడని వ్రాసి ఆ లోపం యథాశక్తి దిద్దుతాడు.

చిట్టిబాబువంటి అమాయికులకు మాత్రమే కనబడే జీవిత వైరుధ్యం ఇది. కథ బాగుంది.

కథలలో ఒక కొత్త దృక్పథం ఆలోచన, వ్యక్తీకరణలో ఒక విశిష్టత చూస్తాం. 'అమె లేదు,' 'తాటాకుల మంట,' 'ఆడదాని శత్రువు,' 'మాదా కబళం, తల్లీ' కథల వస్తువులో ప్రత్యేకత లేకపోయినా అవి చదువరిని ఆకట్టుకొంటూ ఉంటే అదే కారణం.

మంచికథలు చదివామనే సంతృప్తి కలిగించే సంపుటి.

—'అవంతి'

The Sculpture of the Kakatiyas

[By S. Gopala Krishnamurti, Retd., Principal Govt., Training College. Nellore-Published by the Govt. of Andhra Pradesh, Hyberabad, Rs 20/]

చిత్రపట శోభితమైనను వట్టి కాగితపు అట్టతోడి మాసపత్రికవంటి ఈ ఆకృతికి ఖరీదు ఎక్కువేమో! డిపార్టుమెంటు డైరెక్టరుగారైన శ్రీ వహీద్ ఖానుగారు చక్కని సంగ్రహ పీఠికను వ్రాసియున్నారు.

మొదటి వాక్యము—"The powerful dynasty of Kakatiyas which succeeded Chalukyas of Kalyani ruled over Deccan from circa 950 A. D. to circa 1160 A. D. They were great warriors and declared their independence in the middle of 12 th Century and ruled over a vast dominion from their Capital at Warangal." ఈ వాక్యము పరవా లేదేమోకాని చదువరులకు విశదము కాదు. కాకతీయులు 950 క్రీ. శ. నుండి కనబడుచున్నారు. మొదట రాష్ట్రకూటుల సామంతులుగా, తర్వాత వెంగి చాళుక్యుల ఆశ్రితులుగా నుండుచు, తుదకు కల్యాణి చాళుక్యులను ఆశ్రయించి, మెల్లగా అభివృద్ధి నంది క్రీ. శ. 1160 వఱకు సామంతులుగా నుండిరి. క్రీ. శ. 973 లో కల్యాణి చాళుక్యులు తలయెత్తి 1200 ప్రాంతమున పతనమందిరి. ఈ చరిత్ర తెలియని సామాన్య పఠితలకు పై ఆంగ్ల వాక్యములు అపార్థ ప్రతిపాదకములు. మరికొంత స్పష్టముగాను విశదముగాను వ్రాసియుండదగును.

శ్రీ గోపాలకృష్ణమూర్తిగారు శిల్ప చిత్రలేఖన చారిత్రక పరిశోధనలలో చక్కని కృషిచేసిన సిద్ధహస్తులు. ఆయా కాలముల చారిత్రక పరిణామమును తెలుపుచు నాటి శిల్పకళాభివృద్ధిని వివరించుటకు చక్కని కృషి చేసియున్నారు.

కాకతీయులు ఓరుగంటినుండియు హనుమకొండనుండియు 1050 నుండి 1323 వఱకు పాలించినారని వీరి మొదటి వాక్యము సరిగా నున్నది. కాని 1050 తారీఖు ఉజ్జాయింపు లెక్క. వీరు పశ్చిమ చాళుక్యులతో అంతకుముందే చేరియుండవలెను. ఆ విషయములను కొంత సూచించినారుగాని తారీఖులు నిర్ణయించుటకు తగిన ఉపపత్తి లేనందువల్ల కాబోలు వదలినారు.

కాకతీయులను పేరునకు కారణములు తెలియవు. ఊహించవలసినదే. కాకతీయ శిల్ప మన్నప్పుడు దాని ప్రత్యేకత యేదో గుర్తింపవలసియున్నది. వీరు చాళుక్యుల సామంతులుగ నుండి స్వతంత్రులై వారి వెనువెంటనే వచ్చిన దువల్లనో లేక ఆ శిల్పశైలియే కొనసాగింపబడినందుచేతనో వీరి శిలమును ఫెర్గుస్సన్‌గారు చాళుక్యశైలి యనియే చెప్పిరి. హావెలుగారు డెల్యూసివ్' అనగా అసందిగ్ధము, అస్పష్టము, కుదురుపాటు లేనిది అను నర్థమున చెప్పిరి. చాళుక్యుల శిల్పమే కొనసాగి దానికి చేర్పులు కూర్పులు కాకతీయులు చేర్చిరని ఫెర్గుసన్ గారి భావమైనట్లున్నది. ఇది హావెల్ గారికి తృప్తినీయనందువలన 'అది కాదు, మరేదో దీనికేదో ప్రత్యేకత యున్నదిగాని తెలియరా'దను భావమువారి డెల్యూసివ్ పదములో గోచరించుచున్నది. జహీద్‌ఖానుగారు దీనిని దక్కనీశైలి యనుట మంచిదని సూచించినారు. రామప్ప, పాలమగల్లు, నాగులపాడు, మొదలైనచోట్ల ఇతరత్ర కానరాని 'కాకతీయత' కనబడుచున్నది. వీరి విశిష్టతయే ఈ గ్రంథమునకు ప్రధాన విషయము.

ఒక్కొక్క యుగమున మతనైతిక రాజకీయాది కారణములచేత వాస్తుశిల్పాదికములు వానికి అనుగుణముగానుండును. బౌద్ధ జైన యుగముల తర్వాత పల్లవ చాళక్య యుగములు ప్రధానములు. మార్పులో క్రమ పరిణామమున్నను స్పష్టముగా వ్యత్యాసము కనబడుచుండును. అమరావతి నాగార్జునకొండ మొదలైనవాని తర్వాత కాంచి బాదామి పట్టదకల్లు, మాన్యఖేటములలో శిల్పము వర్ధిల్లినది. బాదామి చాళుక్యుల ముద్రవేరు, రాష్ట్రకూటుల రీతివేరు, కల్యాణి చాళుక్యుల పద్ధతులు వేరు. కాకతీయుల భావములు వేరు. జైనుల బౌద్ధుల పద్ధతులుపోయి రూపకల్పనలో వాస్తు నిర్మాణములో, అంగసౌష్ఠవ, ఆభరణ ధారణ, భంగిమలలో, ఆయుములలో క్రమభావ పరిణామములు ఏర్పడినవి. ఈయభిప్రాయములనే శ్రీ గోపాలకృష్ణమూర్తిగారు తమ లఘుపీఠికలో క్లుప్తముగా నిర్దేశించినారు. శిల్పవాస్తు నిర్మాణములు వేర్వేరుగా ఉత్పత్తియై యుండినను శిల్పము గృహవాస్తువునకు సహాయకారిగా అభివృద్ధియై, బౌద్ధులకాలమునుండి పల్లవ చాళుక్యుల కాలమునకు రెండును అభేద ప్రతిపత్తిని పొందినవి. రాష్ట్రకూటులు కట్టించిన దేవాలయములను చెక్కించిన శిల్పములు చాల తక్కువయట. జైనులు బౌద్ధులును ప్రతిమా నిర్మాణములకు పూనుకొనిరిగాని వారివి ఎక్కిరాలేదు. కాంచి బాదామి మున్నగు ప్రదేశములలో ప్రతిమా నిర్మాణము చక్కగా పెంపొందగా కాకతీయులు దానిని అందుకొని ప్రకాశింపజేసిరి. వారు ప్రారంభమున గ్రహించిన జైన దేవాలయ నిర్మాణ పద్ధతి అనుకూలపడనందువలన ఆ పద్ధతినిమార్చి, తాము స్వతంత్రులైనప్పటినుండి వాస్తు ఆలయాది నిర్మాణములతో శిల్పమునకు వన

తులు కల్పించుకొనిరి, కాకతీయ శిల్పముయొక్క చరిత్రయే పై రెంటియొక్క సమన్వయమని తమ గ్రంథ సారమును నాలుగు ముక్కలలో తెల్పినారు. ఇందులో వారు చెప్పకపోయినను అంతర్భూతమైనది కాకతీయుల చరిత్రము—రాజకీయముగా కాకతీయులు వృద్ధియైన కొలది దేశాభివృద్ధితోపాటు వారి ఆలయములు శిల్ప సంపదయు పెంపొందినవి—అని

చూడగా విషయమును ఇట్లు విభజించుట మంచిదేమో; (1) రాజ్యాభివృద్ధి—కొలనినుండి అనుమకొండకు, ఓరుగంటికి. పిదప సబ్బిసాయిరమును కూడ చేర్చుకొని దేశ వైశాల్యమును పెంచుకొనుట—అటు వెనుక స్వాతంత్ర్యానంతరము దేశము పూర్తిగా త్రిలింగముగా పెంపొందుట. (2) వీనికి తగినట్లు దేశమందు మొదటి జైన సంప్రదాయము—బసదులు (3) కాకతీయులు కొంత తలయెత్తి తమ కులదేవత కాకతమ్మకు ప్రాధాన్య మిచ్చుట—దేశమందు సప్తమాతృకలపూజ—చాముండ=కాకతమ్మ — (4) శైవ మతము వ్యాపించి శివాలయములు, శైవమఠములు విరివిగా నిర్మింపబడుట (5) వరాహపూజ, వరాహ లాంఛనము, నరసింహాది విష్ణురూపపూజలు, గుళ్లు.

దేవాలయములే విద్యలకును కళలకును నిలయములైనందున సంగీతనృత్య సంబంధములైన శిల్పములుకూడ క్రమాభివృద్ధినంది వాఙ్మయముతోకూడ వర్ధిల్లినవి. కాకతీయుల కాలము (1050–1323) ఇంచుమించు నాలుగు శతాబ్దములలో వర్ధిల్లిన శిల్ప సంపద కాలగర్భమున లీనమైపోగా నేటి శాసన, వాస్తు, శిల్పాది శకలములచేతను, నష్టశేషమైన వాఙ్మయముచేతను పండితులు పరిశోధకులు పునర్నిర్మాణమునకు పూనికొని అపారసేవ చేసియున్నారు. ఇట్టివారిలో నేటివారు మన శ్రీపాద గోపాలకృష్ణ మూర్తిగారు. ఆయన ప్రకరణములుగా విభజించి, ప్రారంభ కాలమునుండి రెండవ ప్రోల రుద్రదేవ, మహాదేవ, గణపతిదేవ, రుద్రాంబ, ప్రతాపరుద్ర చక్రవర్తుల కాలములయందలి విశేషములను విశదీకరించినారు. ఆయా సందర్భములలో దక్షిణ భారతీయ శిల్పముల క్రమపరిణామమును, మతపరిణామములను, చిత్రముల సూక్ష్మ సూక్ష్మతర భేదములతో తర్కించి లెక్కలేని నూతనాంశములను తెలిపియున్నారు. ఎన్ని ప్రదేశములు చూచినారో, ఎన్ని దేవాలయములు ఎన్నెన్ని మారులు పరిశీలించినారో, ఎంత శ్రద్ధ ఎంత ఆస్థ, ఒక ఆశ్చర్యకరమైన పరిశ్రమగాని వీరిది సామాన్యము కాదు. వీరి రచనను అంతయు చదివి అర్థము చేసికొనుటకే ఎంతో ప్రావీణ్యము కావలెను.

చారిత్రకముగా శ్రీపాదవారు చెప్పుచుపోయిన క్రమము (arrangement) చక్కగా కుదిరినది. కాకతీయుల చరిత్రయే వారి శైలిలో నొక ప్రత్యేకత ఎట్లు కుదిరినదో తెలుపును. ఆ విషయమును వీరు మొదటి ప్రకరణమున విశదీకరించినారు. కాకతీయ శబ్ద విచారముతో ప్రారంభించినారు. ఆ పేరెట్లు వచ్చినదో తెలియదుగాని మూలపురుషుడు కరికాలచోళుడు 'కాకతి' పురమున నొకప్పుడు సైన్యముతో విడిసిన కారణముచేత కాకతి పురవరేశ్వరులైనారన్న కథలో నెల్లూరుజిల్లాలోని క్రాకగ్రామమును—ఆ ప్రాంతమును తెలుగు చోళులు పాలించియుండినందుచేతను—దుర్జయ సంబంధముండుటచేతను కలిపినారు. కాని ఇదివరలో శ్రీ చిలుకూరు వీరభద్రరావుగారును తదితరులును చూపిన 'కాకంది' పురమును ఏలనో ప్రస్తావించలేదు. కాకతీయులకు తెలుగు చోళులతోను దుర్జయులతోను సంబంధ ముండినట్లు చెప్పుటచేత, కావేరీ తీరమునకు వీరిని తీసికొనిపోవలసినదే. కరికాలచోళుడు కావేరీతీరమున ఒరయూరివాడు కదా. మరి తెలుగు చోళులు ఒరయూరు పురవరాధీశ్వరులు. ఇతరులు కారు. దుర్జయులు వెలనాటి చోళులు ఒరయూర్పుర వరాధీశ్వరులు కారు గాని చోళులతోడి సంబంధములు వారికడ చాల కనబడుచున్నవి. కాకందియనుపురము జైనుల గ్రంథములలో విశేషముగా స్తుతింపబడియున్నది. (పుష్పదంత పురాణము 9—11, 9—19) కావేరిప్రాంత దేశమునకు శిబిదేశమనియు చోళులకు శెంబియన్ అనియు, మరల ఆ దేశమునకే కాకందియనియు పేళ్లు తమిళ వాఙ్మయమున కలవు. ఈ కాకంది సముద్రమున మునిగిపోయినదట. అందుచేత 'కడల్కొండకాకంది' అని పేరాయెనట. ఇదిగాక నెల్లూరుజిల్లా గూడూరు తాలూకాకు చేరిన సముద్రతీరపు రాజపాళెముయొక్క చుట్టుపట్టులుకూడ కాకందియని నెల్లూరి శాసనములలో కలదు. కాకతీయులలో బేతశబ్దము ఎక్కువ. ఇది ప్రేతశబ్దభవమని నాకు తోచుచున్నది. కడపజిల్లాలో నొక ప్రేతేశ్వరాలయము కలదు. ఇది శైవమతములో

బేతాళారాధన. బేతాళుడు శవము గానేగదా యుండును. కాబట్టి కరికాలుని వంశమువారిలో కొందరు తెలుగు చోళులు కాగా మరికొందరు అతనికి ముందే విడిపోయి దుర్జయులుకాగా, బహుశః ఇంకను ముందో ఎప్పుడో విడిపోయివచ్చిన కాకందివారు కాకతీయు లగుటలో వింత లేదు. పైగా శ్రీ గోపాలకృష్ణమూర్తిగారు ఇంకొక చక్కని ప్రతిపాదనను ప్రేతేశ్వర సంబంధమును గట్టి చేయుదానిని చేసియున్నారు.

అది కాకతమ్మ చాముండా దేవియని. కాకతమ్మను కనిపట్టుటకు చాల ప్రయత్నించినారు. దొండపాడు శిలా విగ్రహమును ఎంతో పరిశీలించి అది చాముండా స్వరూపమేయని నిర్ధారించినారు. ఇంకను ఎన్నో చాముండా శిల్పములను చూచి శవాధిరూఢయైన యొక చాముండనుకూడ గుర్తించినారు. వీరి పుస్తకములో అది 3 నెంబరు బొమ్మ. చాముండయనుదేవి సప్తమాతృకలలో నున్నప్పుడు కొంతరూప భేదము కలదట. ఈయమ్మ వారేకాక తమ్మయని దేశమందంతటను ఆరాధింపబడుచుండినదని వీరి యభిప్రాయము. ఈ ప్రేతవాహనా దేవితో ప్రేతశబ్దమును, బేతగామారిన దానిని, ప్రేతేశ్వరారాధనను ముడి పెట్టుట మంచిది కాదా? ఇంతలోతుగా పరిశోధించిన గోపాలకృష్ణమూర్తిగారు దీనినికూడ ఆలోచించినయెడల ఇంకను చాల క్రొత్త విషయములు వెలువడగలవని విశ్వసించుచున్నాను. కాకతమ్మ ప్రస్తావము మొదటలేక కాకతీయులలో తర్వాత కానబడుటయే కొంత బాధకము.

మరి కావేరీ తీరమునుండి కాకతీయులువచ్చిరా, వీరు దాక్షిణాత్యులా, అని స్పష్టముగా కాదుగాని వీరికి రాష్ట్రకూట పదమెట్లు వచ్చినది అను విషయమును గురించి చర్చించినారు. కాకర్త్యగుండ్యన రెండవ అమ్మరాజు సామంతుడు. తండ్రి ఎఱియ రాష్ట్రకూటుడు, తాతగుండ్యన రాష్ట్రకూటుడు. కాని ఇందుచేత వీరు రాష్ట్రకూట వంశస్థులు కారనియు, ఈ శబ్దము రాజవంశమునకేకాక చాల విస్తృతముగా గ్రామములలోని కుటుంబికులకు కూడ చెల్లుచుండినదనియు అందుచేతనే రెండవగుండ్యన ఆ పదమును మాని కాకతి పదమును పెట్టుకొనుటయేగాక అతడు రాష్ట్రకూటులతో బెడిసి తూర్పు చాళుక్యులతో చేరి యుండుననియు అభిప్రాయపడుచున్నారు. కాని రాష్ట్రకూటులకును అమ్మరాజునకును సంబంధ మెట్లుండినను రాష్ట్రకూటులు పంపియే కాకర్త్యగుండ్యన దానార్ణవునికి సాయపడ కొరవి దేశమును గ్రహించియుండను. బెడిసియుండలేదు. ఈ విషయమును వీరు ఏల గుర్తింపలేదో తెలియదు. కాని కాకర్త్య పదము మాత్రము వీరన్నట్లు ఇంటి పేరుగానే యుండవలెను. వీరు రాష్ట్రకూటులో లేక, వారికి బంధువులో ఐ యుండినయెడల ఆ విషయమును దాచియుండరుగదా. మొదటినుండి కాకతమ్మ భక్తులై యుండినయెడల అది కాకతీయులు మొదట చెప్పక తర్వాత చెప్పుకొనుటవలన పురమును అమ్మవారుగా మార్చిరేమో!

రాష్ట్రకూటపదము ఉద్యోగమునో లేక జాతినో దేనిని తెలుపునో చక్కగా పరిశోధింపవలసియున్నది. అసలు రాష్ట్రకూటులు కూడ క్షత్రియులు కారు. కృషీవలజాతులవారు క్రమముగా రాజ్యములు సంపాదించినట్లున్నారు. రెడ్డిరాజులను మన మెఱుగుదుముగదా!

మొదటి బేతరాజును విరియాల ఎఱ్ఱనరాజు భార్య కామమసాని పల్లవరాజును ఎదుర్కొని కొఱవి యందు ప్రతిష్ఠచేసి 'కాకతి నిల్పినది' గుండ్యనతోటి సంబంధమును తెలుపునేగాని ప్రతాపచరిత్ర యందలి కథలకును దీనికిని ముడివేయుట మాత్రము ఊహయే. 'పల్లవరాజు'ను దర్శించినదిగాని ఎదుర్కొనినదనుటకు ఆధారములేదు. పల్లవులు కొఱవికి దగ్గర ఎవరును లేరు. దూరమున అనంతపురముజిల్లా ప్రాంతములలో నొళంబపల్లవులు కలరు. మొదటి తైలపునినాటికే (973) కొరవియు, అనుమకొండరాజ్య ప్రాంతమును కల్యాణి చాళుక్యుల యధీనమైనది. సత్యాశ్రయుని శాసనములు ఆ ప్రాంతములలో దొరకినవి. బాలుడైన మొదటి బేతరాజు తండ్రి యెవడో, బేతరాజు ఎప్పుడు పుట్టెనో తెలియదు. పశ్చిమ చాళుక్యుల సామంతు డెప్పుడాయెనో తెలుపు ఆధారములు కానరావు. కాని మొదటి సోమేశ్వరుని కాలమున మహాయోధుడుగా, చాళుక్య చోళ సమరములలో పాల్గొనియుండుటచేతను, అతని కుమారుడు మొదటి ప్రోలరాజు కూడ ఆ సోమేశ్వరుని యుద్ధములో పాల్గొని అతనిచేత అనుమకొండను శాసనపూర్వకముగా గ్రహించియుండినందువలన, చాల దీర్ఘజీవియేగాక మొదటి బేతరాజు చాళుక్య సోమేశ్వరుని కన్న పెద్దవాడైయుండి తైలపునికడనుండియో సత్యాశ్రయునికడ నుండియో కొఱవిని గ్రహించియుండును.

ఇచ్చట గుర్తింపవలసిన విషయ మేమనగా ఇతర రాజులు తమకుముందే ఎందరో పాలించి, ఊళ్లు పల్లెలు నగరములు చక్కగా ఏర్పడిన రాజ్యములను జయించి పాలింపగా కాకతీయులు అరణ్యములుగాను, మన్నెములుగాను నుండి, కొద్దిగా ఆక్రమింపబడిన ప్రాంతములను జయించి ఓరుగంటి రాజ్యమును నిర్మించుకొనిరి. కాబట్టియే వారి శిల్పములో విశిష్టత కలదు. ఈ చారిత్రక భాగము గోపాలకృష్ణమూర్తి గారు వివరముగా వ్రాయలేదు. కారణము పశ్చిమ చాళుక్య కాకతీయ సంబంధములను సరిగా పరిశోధించుటకు వారికి అవకాశములేదు. శిల్పమువిూదనే దృష్టిని కేంద్రీకరించుటచేత ఆ పని వీరు పెట్టుకొనలేదని తలంతును. కాకతీయుల ప్రారంభ చరిత్రను నేను విపులముగా ఆంధ్రపత్రిక సాధారణ సంవత్సరాది సంచికలో వ్రాసియున్నాను.

కాకతీయుల అభివృద్ధికి కారకులు కల్యాణి చాళుక్యులే. సందర్భములు వీరికి అనుకూలించినవి. క్రీ. శ. 973 లో తైలపుడు రాజ్యమునకు వచ్చినప్పుడే జటాచోడ భీముడను తెలుగు చోళరాజు దానార్ణవుని చంపి వేంగిని దాదాపు ఇరువదియైదు సంవత్సరములు ఆక్రమించియుండెను. దానార్ణవుని కుమారులు శక్తివర్మ విమలాదిత్యులు చోళరాజుల నాశ్రయించిరి. రాజరాజచోళుడు 983 లో రాజ్యమునకు వచ్చినది మొదలు వేంగియందు దానార్ణవుని సంతతిని ప్రతిష్ఠించుటకు ప్రారంభింపగా పశ్చిమ చాళుక్యులు దానిని ప్రతిఘటింపగా, యుద్ధములు ప్రారంభమై, ఒక శతాబ్దము అట్లే జరిగి, కులోత్తుంగ చోళుడు వేంగీ చోళదేశములకు చక్రవర్తి యగుటతో నిలిచినది. రాజరాజు, రాజేంద్రచోళుడు, రాజాధిరాజు, రెండవ రాజేంద్ర చోళుడు, వీరరాజేంద్రుడును, శక్తివర్మ విమలాదిత్య రాజరాజ నరేంద్రులను వేంగియందు స్థాపించుటకై తైలపసత్యాశ్రయ విక్రమాదిత్య జయసింహ సోమేశ్వరులతో పోరాడుచుండిరి. పశ్చిమ చాళుక్యులును జటాచోడ భీముని మరణానంతరము వేంగిని ఆక్రమింప యత్నించుట జటాచోడ భీముని మనుమడను విమలాదిత్యుని కుమారుడును, రాజరాజ నరేంద్రుని సవతి తమ్ముని కుమారుడును నైన విష్ణువర్ధన విజయాదిత్యుని కొఱకే శక్తివర్మ క్రీ. శ. 1000 కి వేంగియందు ప్రతిష్ఠితుడైనను అతని తమ్ముడు విమలాదిత్యుడు చోళుల సాయముతోనే మరల వేంగికి వచ్చెను పశ్చిమ చాళుక్యులు క్రీ. శ. 1006 లోను, 1014 లోను, 1019 నుండి 1022 వఱకును వేంగిని ఆక్రమించిరి. రాజరాజు తర్వాత రాజేంద్ర చోళుడు స్వయముగానే వేంగికివచ్చి రాజరాజ నరేంద్రుని పట్టాభిషేకమున పాల్గొనెను. ఆ సందర్భముననతడు భారతదేశపు రాజులందరితోను కలసి పశ్చిమ చాళుక్యులను ఎదుర్కొనుటకు వ్యూహము పన్నుటకొఱకే గంగవఱకు పోయినాడు. చాళుక్యులు మధ్య దక్షిణాపథముననుండగా, వారికి బాధపెట్టుటకు వెనుకనుండి మాళవ కాన్యకుబ్జ, దాహళ, కోసల కళింగరాజులతో మైత్రి నెరపుటయేగాక కళింగాంధ్ర కర్ణాటముల నడిమి మన్నెపు రాజులను, వారితో చేరిన చక్రకూటప్రాంత రాజులను వశము చేసికొనెను. అటువైపు కొంకణమునకూడ కుట్ర సాగించెను. గంగైకొండ చోళపురమును నిర్మించుకొని కంచినుండి రాజధానిని మార్చుకొనెను. ఇంతవ్యూహముపన్ని నలువైపుల చాళుక్యులను కొట్టసాగెను.

ఈ కాలమున పశ్చిమ చాళుక్యులును బలవంతులైయుండి చోళులను బలముగా ప్రతిఘటించిరి. చోళుల శత్రువులందఱు వారికి మిత్రులు. పైగా జయసింహ సోమేశ్వరులు (క్రీ. శ. 1015–1042–1068) చాల బలవంతులే గాక వారి సామంతమాండలికులును, మంత్రి దండనాథ సేనాపతులను బలవంతులు, మహాయోధులు. రాజరాజనరేంద్రుని సవతి తమ్ముడు విష్ణువర్ధన విజయాదిత్యుడును మహాపరాక్రమశాలి. మొదటి సోమేశ్వరుని కుమారులును తక్కువవారు కారు. మొదటి సోమేశ్వరుడును తన రాజధానిని మాన్యఖేటమునుండి కల్యాణ కటకమునకు మార్చుకొనెను. ఈ చాళుక్యచోళ సమరములలో కాకతీయులు చాళుక్య సామంతులైయుండి పెక్కుతావులలో చోళులనెదుర్కొనిరి. కావేరీ తుంగభద్రలను దాటి కర్ణాటకమును చొచ్చుచుండిన చోళులు కృష్ణా తుంగభద్రలను కూడ దాటివచ్చుటయే గాక కొల్లిపాకవఱకు కూడ పోయిరి. తూరునుండి చక్రకూటమును ఒక కేంద్రముగా చేసికొని అటు గోదావరిని దాటివచ్చి కొట్టుచుండిరి. ఈ సందర్భములలో భోజరాజు చోళులకు మిత్రుడై వెనుకనుండి చాళుక్యులను కొట్టుచు చోళులకు సాయపడుచుండెను. ఇతడు కూడ తన రాజధానిని

ఉజ్జయినినుండి తాను క్రొత్తగా నిర్మించుకొన్న ధారా నగరమునకు మార్చుకొనెను. కాకతీయులు కొరవిలో నుండి ఆ చుట్టుపట్లను, చక్రకూటమునుండి అటు మంతెనవఱకు కాపాడుటయేగాక, కొంకణమున జయకేశిని జయించి కంచిని తగులబెట్టి, ఆ కవాటమును ఊడబెరికి, ఉత్తరమున మాళవమునకు పోయి భోజరాజును ఓడించి, ఒకసారు దేశమంతయు సంచరించినారు. ఇందు ప్రోలరాజే గాక అతని తండ్రి బేతరాజు కూడ పాల్గొనియుండెను. కంచి యుద్ధము క్రీ. శ. 1049—50 కి ముందే భోజుని మరణమును అప్పుడే అంతకు కొంతముందు చోళులు కల్యాణిని తగులబెట్టిరి. చాళుక్యులు కంచిని, ధారానగరమును కూడ తగులబెట్టిరి. అంతేకాదు భోజుని మూడు మహానగరములకు, ధారా మండవ ఉదయ పురములకు నిప్పంటించిరి. 1050 నాటికి మొదటి బేతరాజున్నాడు. ఈ యుద్ధము లంతటితో ముగియలేదు. 1054 కొప్పం సంగ్రామము రాజాధిరాజచోళుడు ఏనుగుమీదనే చంపబడెను. రాజరాజ నరేంద్రుడు 1050–51 నుండి సోమేశ్వరుని మిత్రుడు. నారాయణభట్టు కర్ణాటక సోమేశ్వరుని ప్రధాని, రెసిడెంట్ ఆఫీసర్. రాజరాజనరేంద్రుడును తన రాజధానిని బెజవాడనుండి రాజమహేంద్రవరమునకు మార్చుకొని 1061 వఱకు నిశ్చింతతో ఆంధ్ర మహాభారతమును నన్నయచేత వ్రాయించుచుండెను. చోళులు బలహీనులై యుండి కొంతకాల మూరకుండిరి. రాజరాజనరేంద్రుని మరణముతో మరల యుద్ధములు ప్రారంభమైనవి వేంగిని రాజరాజు తమ్ముడు విజయాదిత్యుడు గ్రహించెను. చోళరాజు వీరరాజేంద్రుడు కల్యాణి చాళుక్యుల మీదికి విజృంభించెను. గుత్తి గుంటకల్లుల మీదుగా దండెత్తుటయే గాక చక్రకూట ప్రాంతమునుండి చోళులు చాళుక్యులను కొట్టసాగిరి. వేంగికిని కల్యాణీ చాళుక్యుల రాజ్యమునకును నడిమి భాగమున నొక సామంతరాజ్య ముండుట చాల ఆవశ్యకమని పశ్చిమ చాళుక్యులకు తోచనది. క్రీ. శ. 1068 నాటికి మొదటి సోమేశ్వరుడు గతించెను. ఈ సందర్భములలో 1068 కి కొంత ముందు. చుట్టుపట్ల దేశము అనుమకొండను సోమేశ్వరుడు ప్రోలరాజున కిచ్చెను. 'తత్త్రద్వ్యాయుత మన్మకొండ నగరం త్రైలోక్య మల్లక్ష్మాధీశాచ్ఛాసనబద్ధ ముద్ధతజయీ సంలబ్ధవాన్ శశ్వతమ్.' పశ్చిమ చాళుక్యులు కాకతీయులు చేసిన సేవకు మెచ్చియేకాక, తమ యెల్లలను రక్షించుకొనుటకొఱకు కూడ అనుమకొండ రాజ్యమును కాకతీయుల కిచ్చిరి. వీరు కొఱవి నుండి మెల్లగా అనుమకొండకు వ్యాపించి ఆ చుట్టుపట్ల చక్రకూటమువఱకు విజృంభించి ఆక్రమించుటకు వారికి తమ ప్రతాపముతో కూడ సమకాలిక పరిస్థితియు, కల్యాణీ చాళుక్యుల కేర్పడిన ఆవశ్యకతయు కారణములు. చక్రకూటమువారు మొదట చోళులతో చేరినందువలననే అచట ఒక మధురాంతకుడు ఏర్పడినాడు. తర్వాత కాకతీయులు బలవంతులై పశ్చిమ చాళుక్యుల ఆధిపత్యము రాగా ఒక సోమేశ్వరుడు కనబడుచున్నాడు.

శ్రీ గోపాలకృష్ణమూర్తి కాకతీయుల చరిత్రను గుఱించి ఎప్పుడు వ్రాత సతి వ్రాసిపంపినారోగాని చాల పాత సిద్ధాంతముగా నున్నది. ఆంధ్రపత్రిక సాధారణ (1970—71) సంవత్సరాది సంచికలో నా వ్యాసమును వీరు చూచినారో లేదో తెలియరాలేదు. ఆధునిక పరిజ్ఞానము—త్రైలోక్యమల్లాహవమల్లుని చివరి తారీఖు 1068 క్రీ. శ. నాటికి మొదటి బేతరాజు లేడు. 1079 నాటికి మొదటి ప్రోలరాజును లేడు. రెండవ బేతరాజు 1076 లో రాజ్యమునకు వచ్చిన ఆరవ విక్రమాదిత్యుని పేరు చెప్పడు. 1090 నాటికి త్రిభువనమల్ల దుర్గరాజు ప్రభువు. మొదటి బేతరాజు 1051 లో కంచి యుద్ధములో పేరు తెచ్చుకొనెను. ఇట్లు వీరు ఇంచుమించు ఉండిన తారీఖులు దొరకినందువలన ముగ్వురును దీర్ఘకాలము జీవించిన మహాయోధులనవలసియున్నది. తాత తండ్రి మనుమలు ముగ్వురును కల్యాణి చాళుక్యుల నాశ్రయించియుండిరి. వీరికి జగదేకమల్ల జయసింహుని కాలమున (1015—1042) కాని ప్రాముఖ్యము త్రైలోక్యమల్లాహవమల్లుని కాలమున (1042—1068) ఏర్పడుటకు చోళ చాళుక్య యుద్ధములు కావేరీ తీరమును వదలి గోదావరీ తీరమును ఆశ్రయించుటయే కారణము. వేంగిని అదుపులో నుంచుకొనవలసియుండుట ఇంకొక కారణము. 1051 లో కంచిలో నుండిన మొదటి బేతరాజు చక్రకూటమున కానరాదు. క్రీ శ. 1000 లో పుట్టియుండినను ఏబదియేండ్లవాడు. ఇంకను పెద్దవాడై యుండును. ఇతని కుమారుని కాలముననే చక్రకూటముయొక్క ప్రాముఖ్యత గుర్తింపబడి అనుమకొండ రాజ్యముగా ఏర్పడి ఇతని కొసగబడినది.

రెండవ బేతరాజు చాళుక్య విక్రమాదిత్యునితో చేరలేదేమో అన్నదమ్ముల పోరాటములో. తన్నే 'విక్రమేణభుని విక్రమచక్రి బేతభూపతిరితి ప్రథితోఽభూత్' అని చెప్పుకొన్నాడు. ఇతని కుమారుడు త్రిభువనమల్ల దుర్గరాజు. ఇతనిని శ్రీ గోపాలకృష్ణమూర్తిగారు చెప్పనే లేదు. రెండవ బేతరాజు తర్వాత రెండవ ప్రోలరాజు రాజైనట్లు వ్రాసియున్నారు. త్రిభువనమల్లదుర్గరాజు ఖాజీపేట శాసనము 1090 వీరెట్లు వదలిపెట్టినారో తెలియరాలేదు. ఇందు రెండు తారీఖు లున్నవి. 1090 రెండవ బేతరాజుది. 1102 త్రిభువనమల్లదుర్గరాజుది. రుద్రదేవుని అనుమకొండ శాసనములో త్రిభువనమల్లుని (దుర్గరాజు) కుమారుడు రెండవ ప్రోలరాజని యున్నది. రెండవ బేతరాజు 1079 లో చాళుక్య విక్రమాదిత్యునికి వైరియై యుండి తర్వాత రాజకీయముగా లోబడిపోయి వైజదండనాథుని నీతి ప్రయోగముచేత స్నేహితుడై, ఎనుబదిమిక్కిలి సబ్బిసాయిరమును కూడ పొంది, తన కుమారునికి త్రిభువనమల్లుని పేరు పెట్టుకొన్నాడు. ఇదంతయు 1090 (క్రీ. శ.) లోపలనే జరిగియుండవలెను.

సబ్బిసాయిరము — అనగా వేయిగ్రామములుగల సబ్బిదేశము—వేములవాడ రాజ్యము, నేటి కరీంనగరు జిల్లాలో నున్నది. క్రీ. శ. 1083 లో డిసంబరు 25 నాటికి సబ్బిసాయిరమును రాజాదిత్యుడను నతడు పరిపాలించుచుండెను కాబట్టి క్రీ. శ. 1084 కు తర్వాత 1090 కి ముందు వైజదండనాథుని నీతిప్రయోగము జరిగియుండవలెను.

కాని కాకతీయుల కీ మైత్రి చాళుక్యులతో చాల కాలము జరుగలేదు. క్రీ. శ. 1106 కుమార సోమేశ్వరుడు వేములవాడలో కల్యాణి విక్రమాదిత్యుని పక్షమున పాలించుచున్నాడు. కాకతీయుల పేరు లేదు. క్రీ. శ. 1109 లో సబ్బిసాయిరము పరమార జగద్దేవుని యధీనమున, చాళుక్య విక్రమాదిత్యుని రాజ్యమున నున్నది. ఈ పరమార జగద్దేవుడే హనుమకొండమీద దండెత్తినవాడు—ఆంధ్రరాజు నొకనిని జయించి, చక్రకూటమును నిర్జించి, ద్వారసముద్రమును ప్రవేశించి విక్రమాదిత్యుని మెప్పునందినట్లు చెప్పుకొనియున్నాడు. ఒక జగద్దేవుని తాను తరిమినట్లు ప్రోలరాజు చెప్పుకొనియున్నాడు. ఇదంతయు సమన్వయించి నేను సాధారణ సంవత్సరాది సంచికలోని పై వ్యాసమున చివర ఇట్లు ఉపసంహరించితిని—'ఆఱవ విక్రమాదిత్యుని రాజ్యకాలమున హొయసల సామంతులు తరుగబడినట్లే పలువురు తిరుగబడిరి. వేంగియందును చిక్కు లేర్పడినవి. అనంత పాలాది దండనాయకులు పలుచోట్ల కనబడుచున్నారు. చక్కగా పరిశోధించినయెడల ఈ కాలమున కాకతీయులు విజృంభించినట్లు తెలియగలదు. హొయసలులను జయించినట్లే జగద్దేవుడు కాకతి ప్రోలరాజును జయింప అనుమకొండను ప్రవేశించి ముట్టడించలేక వెడలిపోయెను. చాళుక్య విక్రమాదిత్యుడు 1126 లో గతించువఱకు ప్రోలరాజు కాచుకొనియుండి ఆ తర్వాత మరల మూడవ సోమేశ్వరుని కాలమందును (రెండవ) జగదేకమల్లుని కాలమందును బలవంతుడై మూడవ తైలపుని కాలమందు విజృంభించిస్వాతంత్ర్యము సంపాదించియుండును.

రెండవ ప్రోలరాజు తర్వాత కాకతీయుల చరిత్రలో ఇట్టి చిక్కులు తక్కువ. వాస్తవము శిల్పవాస్తు నిర్మాణాదికములు వీరి స్వాతంత్ర్యానంతరమే ప్రశంసార్హములు. శ్రీ గోపాలకృష్ణమూర్తిగారు శిల్పము మీద చూపిన శ్రద్ధను చరిత్రమీద కూడ చూపి రెంటిని సమన్వయపరచియుండినయెడల చాల చక్కగా నుండియుండును.

కాకతీయుల శిల్పములో నొక విశేషమేమనగా తత్పూర్వపు పశ్చిమ చాళుక్యుల వైఖరిని పునాదిగా, ప్రారంభముగా గ్రహించినను అలంకార రచనలో హొయసలులు కల్పించినంత గజిబిజి విపరీతాలంకారములు లేవు. హొయసల కాకతీయుల కిరువురకును గురువులు పశ్చిమ చాళుక్యులేగాని తర్వాత ఆదర్శములు భావములు మారి కాకతీయులలో ఆంధ్రత్వము పరిమితాలంకరణాదులలోను అభిరుచులలోను కనబడుచున్నది. వివరములు శ్రీ గోపాలకృష్ణమూర్తిగారి ఈ చక్కని గ్రంథమున చూడవచ్చును.

— శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-600001. Editor : S. Radhakrishna.

అమృతాంజన్ లిమిటెడ్

75 సంవత్సరాల పైగా గృహౌషధములు తయారు-చేస్తున్నవారు!

- అమృతాంజనం బాధానివారిణి
  తలనొప్పి, ఒళ్ళునొప్పులు, బెణుకులు, జలుబు, దగ్గు, కండరాల నొప్పులకు.
- అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్
  పసిబిడ్డల అజీర్ణానికి, పళ్ళు వచ్చేటప్పుడు కలిగే బాధలకు.
- అమృతాంజన్ డెర్మల్ అయింట్‌మెంట్
  తామర, తీట, గజ్జి వగైరాలకు.
- అమృతాంజన్ ఇన్‌హేలర్
  జలుబుచేసి ముక్కుదిబ్బడ, తుమ్ములు వగైరాలకు.
- అనోలియమ్-కోల్డ్ రబ్
  దగ్గు జలుబులను పారద్రోలే అమోఘమైన ఒక కొత్త శక్తి.
- శాలోఫెన్-బాధానివారిణి మాత్రలు
  తలనొప్పి, ఫ్లూ, ఒళ్ళు నొప్పులకు

...ఇండియాలోను,
ఇతర దేశాలలోను
పేరు పొందినవి.

అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు-4

